Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతంలతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :243 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | గురువారం 25 డిసెంబర్ 2025 | పేజీలు :12 | వెల రూ5 /-

## న్యూ ఇయర్ జోష్ లో
# తప్పులు చేస్తే..కటకటాల్లోకే..




**హైదరాబాద్, డిసెంబర్ 24:**కొత్త సంవత్సరానికి ఓ మంచి వాతావరణంలో స్వాగతం పలకండి, గలీజు పనుల జోలికి వెళ్లొద్దు, సెలబ్రేషన్స్‌ని ఇల్లీగల్‌గా చేసుకొని కేసుల బారిన పడొద్దు అని కూల్‌కూల్‌గా మెసేజ్ ఇస్తున్నారు ఖాకీలు. కాదూకూడదూ అని రెచ్చిపోతే, కథ కటకటాల్లోకే అని గట్టి వార్నింగూ వినిపిస్తోంది.మరో వారం రోజుల్లో న్యూఇయర్ జోష్ షురూ. అంబరాన్నంటే సంబరాలే కాదు, ఓవరాక్షన్లు, ఆవారా పనులూ కూడా అప్పుడే. వెర్రెక్కిన కుర్రకారుకు అడ్డూ అదుపూ ఉండదు. పోలీసులకు ఏడాదంతా ఒక ఎత్తయితే, కొత్త సంవత్సర సీజన్ ఒక్కటీ ఒక ఎత్తు. ఎందుకంటే, సెలబ్రేషన్స్ పేరుమీద అక్కడ జరిగే అరాచకాలకు అంతే ఉండదు. అందుకే, ఎక్సైజ్, డ్రగ్ కంట్రోల్, లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్.. అన్ని శాఖలూ ఒక్కటయ్యాయి. ఈగల్ టీములు కూడా ఎటెన్షన్‌లోకొచ్చేశాయి. GHMC తోపాటు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో స్పెషల్ డ్రైవ్‌కి సిద్ధమైంది ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్.హైదరాబాద్‌లోని పబ్బులు, ఫామ్ హౌస్‌లపై డేగ కన్నేశారు ఖాకీలు. డ్రగ్స్ అమ్మేవాళ్లతోపాటు వినియోగించేవాళ్లు కూడా దొరికితే లోపలేయడం పక్కా. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీల్లో కనిపించకూడదు. ఇంతేకాదు, - మిగతా3లో

## మెట్రో టేకోవర్
# ప్లాన్ సిద్ధం!

**హైద్రాబాద్, డిసెంబర్ 24:**హైదరాబాద్ వాసుల జీవననాడి, ప్రతి రోజూ లక్షల మందిని గమ్య స్థానాలకు చేర్చే హైదరాబాద్ మెట్రో రైలు చరిత్రలో ఒక భారీ మార్పు చోటు చేసుకోబోతోంది. ఇప్పటి వరకు పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ పద్ధతిలో ఎల్ అండ్ టీ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి స్థాయిలో తన ఆధీనంలోకి తీసుకోవాలని సంచలన నిర్ణయం తీసుకుంది. కేవలం నిర్ణయం తీసుకోవడమే కాకుండా, ఈ ప్రక్రియను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తి చేయాలని గడువు విధించుకోవడం ఇప్పుడు నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. మెట్రో రైలు



టేకోవర్ ప్రక్రియను అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదిగా భావిస్తున్న ప్రభుత్వం దాన్ని మార్చి 31 నాటికి పూర్తి చేయాలని చూస్తోంది. ఈ భారీ బదిలీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఇప్పటికే కార్యదర్శులు స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ ఇటీవల ఎల్ అండ్ టీ ఉన్నతాధికారులతో ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి, ప్రాజెక్టు బదిలీలో ఎదురయ్యే సవాళ్లు, పరిష్కారాలపై లోతుగా చర్చించింది. ప్రభుత్వం లక్ష్యం స్పష్టంగా ఉంది. ఏప్రిల్1 నాటికి మెట్రో రైలు కార్యకలాపాలు ప్రభుత్వ పర్యవేక్షణలోకి వచ్చేలా సర్వ సిద్ధం చేయడం. ఆర్థిక, న్యాయ - మిగతా3లో




## బీఆర్ఎస్ సోషల్ మీడియా
# ఫుల్లీ లోడెడ్..

**హైదరాబాద్, డిసెంబర్ 24:**నేటి కాలంలో రాజకీయ పార్టీలకు బలమైన సోషల్ మీడియా ఉండాల్సిందే. నిజమో లేదా అబద్ధమో గట్టిగా చెప్పగలగాలి. ప్రస్తుతం ప్రపంచం మొత్తం సోషల్ మీడియా చుట్టూ తిరుగుతోంది కాబట్టి.. రాజకీయ పార్టీలకు బలమైన సోషల్ మీడియా అనేది ఒక కనీస అనివార్యతగా మారిపోయింది. అధికారంలో ఉన్న పార్టీ సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ సోషల్ మీడియాను - మిగతా3లో

## రాజకీయాలకు తావు లేకుండా
# గ్రామాల అభివృద్ధి జరగాలి

- చిన్న పంచాయతీలకు 5లక్షలు,
- మేజర్ పంచాయతీలకు 10 లక్షల ఎస్ డి ఎఫ్ నిధులు.
- వివక్ష చూపితే అభివృద్ధికి ఆటంకం.
- దేశంలోనే కొడంగల్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం.
- సర్పంచుల సన్మాన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి.

**కొడంగల్, డిసెంబర్ 24(స్టైన్యూస్):**ఎన్నికల సమయంలోనే రాజకీయాలు, ఇక రాజకీయాలు లేవు, పార్టీలు, పంతాలు వద్దు. ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయని, రాజకీయాలకు తావు లేకుండా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, వివక్ష చూపితే అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. బుధవారం కోస్గి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో కొడంగల్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఆత్మీయ



సమ్మేళనం, సన్మాన కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరై నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన 182 మంది కొత్త సర్పంచులు - మిగతా2లో



## మేడారంలో గద్దెలపై కొలువుదీరిన
# పగిడిద్దరాజు, గోవిందరాజులు

**ములుగు డిసెంబర్ 24:**మేడారం మహా జాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాల నుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా.ఈ సారిగా నూతనంగా నిర్మించిన గద్దెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది.పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్క-సారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గద్దెల చుట్టూ 8 స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేస్తారు.

# కాళేశ్వరం పై ఆశలు

**హైద్రాబాద్, డిసెంబర్ 24:**తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయాలు నీళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. గత ఆదివారం మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్య మంత్రి చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చ కు దారి తీస్తూనే ఉన్నాయి. కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మర్చిపోక ముందే.. ఆయన కుమారుడు రంగంలోకి వచ్చారు. ఈసారి ఏకంగా ఆయన కాళేశ్వరం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మంగళవారం సిరిసిల్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆయన పరిపాలన మాఫియా మాదిరిగా ఉందని మండిపడ్డారు.. కెసిఆర్ పరిపాలన కాలంలో చేసిన మంచి పనులకు అనేక రకాలుగా రేవంత్ ప్రభుత్వం వక్ర భాష్యం చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఇందుకోసం రేవంత్ ప్రభుత్వం చేయని పని లేదంటూ మండిపడ్డారు.2023 ఎన్నికల సమయంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి



కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేశారని కేటీఆర్ ఆరోపించారు. ఆ పథకం పై బాంబులు వేయడం వల్లే దెబ్బ తిన్నదని అనుమానించారు.. - మిగతా3లో

## నెలరోజుల్లోగా గ్రామ పంచాయతీలకు
# నిధులు విడుదల చేయాలి

మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, డిసెంబర్ :** గ్రామ పంచాయతీలకు నెలరోజుల్లోగా నిధులు విడుదల చేయాలని.. లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. రెండేళ్లుగా రాష్ట్రంలోని పంచాయతీలకు నిధులు ఇవ్వలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. పంచాయితీలకు ఇచ్చిన నిధులన్నీ కేంద్రానివే అని స్పష్టం చేశారు. పంచాయతీలకు ఇచ్చిన నిధులపై - మిగతా3లో

## ఫోన్ ట్యాపింగ్ లో....
# చిక్కులు తప్పవా



**హైదరాబాద్, డిసెంబర్ 24:**తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం కీలక మలుపు తిరిగింది. విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం తన దూకుడును పెంచడంతో, ఈ వ్యవహారం ఇప్పుడు నేరుగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుల ముంగిటకు చేరినట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా ఆరోపణలు వస్తున్న ఫోన్ ట్యాపింగ్ ఉదంతం కేవలం ఒక క్రైమ్ కేసుగానే కాకుండా, రాజకీయ భూకంపంగా మారింది. సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ నేతృత్వంలోని సిట్ బృందం పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోంది. ఇటీవల కీలక నిందితుడు, మాజీ నిఘా విభాగం చీఫ్ టి. ప్రభాకర్ రావు విచారణలో వెల్లడించిన అంశాలు ఇప్పుడు గులాబీ బాస్ చుట్టూ ఉచ్చు బిగించేలా ఉన్నాయి.అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే విపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, చివరకు సొంత పార్టీలోని అసంతృప్త నేతల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా విదేశాల నుంచి విచారణకు సహకరిస్తున్నట్లు చెబుతున్న ప్రభాకర్ రావు, అప్పటి ప్రభుత్వంలోని అగ్రనేతల సూచనల మేరకే ఈ వ్యవస్థ నడిచినట్లు కీలక సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో నిధుల మళ్లింపును పర్యవేక్షించడానికి, ప్రతిపక్షాల వ్యూహాలను చిత్తు చేయడానికి ఈ ట్యాపింగ్ పరికరాలను వాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారబోతోందని - మిగతా3లో

వార్తాతరంగాలు

గురువారం 25 డిసెంబర్ 2025

# సంపాదకీయం

## సంస్కరణల ముసుగులో

# పెత్తనం

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడమే కాక, మందబలంతో ఏకచ్ఛత్రాధిపత్యం వహించింది. విపక్షాలు లేవదీసిన అభ్యంతరాలకు సరైన సమాధానాలు చెప్పడం లేదు సరికదా, చర్చకు కూడా అవకాశం లేకుండా బుల్‌డోజర్ సంస్కృతి అవలంబించింది. ఉన్నత విద్యారంగాన్ని తన గుప్పెటలో పెట్టుకోవడానికి శ్రీకారం చుట్టింది. ఆత్మనిర్భర్ భారత్ నినాదంతో ఇతర దేశాలపై ఆధారపడే దుస్థితినుంచి బయటపడాలంటూ పదేపదే ప్రబోధించే మోడీ ప్రభుత్వం బీమా, అణువిద్యుత్ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు స్వాగతం పలకడం, ముఖ్యమైన వ్యవస్థలను విదేశాలకు తాకట్టుపెట్టడం ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేకత. ఇది కాక యుపిఎ ప్రభుత్వ చిహ్నాలను, మహాత్మాగాంధీ పేరును పూర్తిగా చెరిపేసేందుకు చరిత్రాత్మక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసింది. ఈ పథకాన్ని తన అధీనం లోకే తెచ్చుకుని తన పెత్తనంతోనే పనులు సాగేలా మార్చుకుంది. ఈ పథకంలో 100 రోజుల పనిదినాలను 125 రోజులకు పెంచి ఉద్ధరిస్తున్నట్టు నమ్మిస్తున్నా దాని అసలు స్వరూపం వేరేగా ఉంటోంది. ఏ రాష్ట్రంలో, ఎక్కడ, ఏ పనులు చేపట్టాలో కేంద్రమే నిర్ణయిస్తుంది. ఏ రాష్ట్రానికి ఎంత బడ్జెట్ కేటాయిస్తుందో ఆ మేరకే పనులు చేపట్టాలి. అదీ కూడా అవసరం బట్టే పని కల్పన ఉంటుంది. అంటే రాష్ట్రాలకు ఇందులో ఎలాంటి స్వేచ్ఛ లేనట్టే. ఇక నిధుల వ్యయంలో ఇంతవరకు శ్రామికుల వేతనాలు పూర్తిగా, సామగ్రి వ్యయంలో 75% నైపుణ్యం, పాక్షిక నైపుణ్య కార్మికుల వేతనాల్లో 75 శాతం కేంద్రమే చెల్లించేది. కానీ ఇకనుంచి మొత్తం వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వమే 40 శాతం వరకు భరించక తప్పదు. 90: 10 గా ఉన్న వ్యయం ఇకనుంచి 60:40 గా ఉంటుంది. ఇంత భారీ వ్యయాన్ని రాష్ట్రాలు ఎంతవరకు భరించగలవో ఆలోచించాలి. ఈ వివాదాస్పద నిర్ణయంపై కాంగ్రెస్‌తో సహా విపక్షాలన్నీ భగ్గుమంటున్నాయి. జాతీయ స్థాయిలో వ్యతిరేక ఉద్యమానికి సన్నద్ధమవుతున్నాయి. కేంద్రం మితిమీరిన పెత్తనానికి మరో తార్కాణం ఉన్నత విద్యారంగం. ఉన్నత విద్య క్రమబద్ధీకరణ చట్టాన్ని పూర్తిగా ఏకీకృతం చేస్తూ వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (వి బిఎస్ఎ) బిల్లును తీసుకొచ్చింది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ), నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ) పర్యవేక్షణ అధికారాలన్నీ ఒకే రెగ్యులేటర్ కిందకు తెస్తూ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేస్తోంది. అన్ని కేంద్ర యూనివర్శిటీలు, వాటి కిందగల కాలేజీలు, విద్యామంత్రిత్వశాఖ పరిపాలన కింద గల జాతీయ ప్రాముఖ్యత గల సంస్థలన్నీ ఈ కమిషన్ కిందకే వస్తాయి. ప్రస్తుతం యుజిసి కింద లేని ఐఐటిలు, ఐఐఎంలు, ఎన్‌ఐటిలు, ఐఐఎస్‌సిలు, ఐఐఎన్‌ఇఆర్‌లు, ట్రిపుల్ ఐటిలు కూడా ఈ కమిషన్ కిందకే వస్తాయి. ఈ విబిఎస్ఎ కమిషన్‌లో తనకు అనుకూలమైన తొమ్మిది మందిని కేంద్రమే నియమిస్తుంది. ఈ బిల్లుపై రాష్ట్రాలకు ఎలాంటి హక్కులు ఉండవు. రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలు కూడా కేంద్ర అధిష్టానం ఆదేశాలకే లోబడాల్సి వస్తుంది. ఇక బీమా రంగంలో విదేశీ సంస్థలు పూర్తిస్థాయిలో ప్రవేశించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బీమా రంగంలో ప్రస్తుతం 74% వరకు ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతం పెంచడానికి వీలుగా బిల్లును రూపొందించింది. జిడిపిలో 3 శాతం వాటాకు పరిమితమైన బీమారంగం ఇక నుంచి విదేశాల్లో మాదిరిగా ఆరున్నర శాతానికి చేరుతుందని ప్రభుత్వం నమ్మబలుకుతోంది. నూరు శాతం ఎఫ్‌డిఐలతో విదేశీ కంపెనీలు తక్కువ మూలధనంతో ఇకపై ఇక్కడ వ్యాపారాలు పెట్టుకోవచ్చు. ఇప్పటివరకు 65 శాతం వాటాతో అత్యంత బలంగా ఉన్న ప్రభుత్వ రంగ ఎల్‌ఐసికి ఇప్పుడు అగ్నిపరీక్షే ఎదురవుతుంది. బీమా రంగంలో వంద శాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరిచిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అణుశక్తి బిల్లు రూపంలో మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. అణుశక్తిని స్థిరంగా వినియోగించుకుంటూ అభివృద్ధి పథం వైపు దేశాన్ని తీసుకెళ్లడమే లక్షంగా 'శాంతి బిల్లు' ను ప్రవేశపెట్టినట్టు మోడీ ప్రభుత్వం ప్రకటిస్తోంది. అణు విద్యుత్ సంస్థాపిత సామర్థ్యం ప్రస్తుత 8.8 గిగావాట్లు నుంచి 2047 నాటికి 100 గిగావాట్లకు పైగా పెంపు చేయడమే లక్షంగా 2008లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అమెరికాతో సివిల్ అణుశక్తి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అయితే రియాక్టర్లలో ఏదైన ప్రమాదం సంభవిస్తే మానవ ప్రాణ, పర్యావరణ నష్టానికి ఆ రియాక్టర్ల సరఫరాదారు పరిహారం చెల్లించాలని సివిల్ లయబిలిటీ బిల్లు తీసుకు రాగా, అమెరికా కంపెనీలు వ్యతిరేకించడంతో బిల్లు అమలు కాలేదు. ఈ పరిహారం విషయంలో సడలింపు కల్పించి దాన్ని మోడీ ప్రభుత్వం అమలులోకి తీసుకు వస్తోంది. 1962 అణుశక్తి చట్టం, 2010 పౌర అణు నష్టపరిహార చట్టాన్ని రద్దు చేయాలనే బిల్లు లోని నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు రియాక్టర్ల సరఫరాదారుల నష్టపరిహార చెల్లింపు బాధ్యత కేవలం 300 మిలియన్ డాలర్లకే పరిమితం చేయడం ప్రజలభద్రతను నిర్లక్షం చేయడమే. జపాన్‌లో పుకుషిమా, రష్యాలో చెర్నోబిల్ అణుప్రమాదాలు నేర్పిన గుణపాఠాలు ఇప్పుడు విస్మరించడం ఎవరికీ క్షేమం కాదు. నియంత్రణలన్నీ ప్రభుత్వం చేతిలోనే ఉంటాయని చెబుతున్నప్పటికీ బహుళజాతి కంపెనీలు ఎంత శక్తిమంతమైనవో భోపాల్ యూనియన్ కార్బైడ్ గ్యాస్ లీక్ ప్రమాదం సంఘటనే ప్రత్యక్ష సాక్షం. ఈ బిల్లు ద్వారా అమెరికా, ఫ్రాన్స్ వంటి విదేశీ కంపెనీలకే తప్ప భారత కంపెనీలకు ప్రయోజనం శూన్యం అన్న విమర్శలు వస్తున్నాయి.

# పాకిస్తాన్ కు ట్రంప్ అల్టిమేటం..

**న్యూయర్క్, డిసెంబర్ 24:** పాకిస్తాన్ ప్రస్తుతం విచిత్ర పరిస్థితి ఎదుర్కొటోంది. కరవ మంటే కప్పకు కోపం.. విడవ మంటే పాముకు కోపం అన్నట్లుగా మారిపోయింది. పెద్దలు మంచివారితో స్నేహం చేయమంటారు. ఎందుకంటే తాను కూడా బాగుపడతారని, కానీ పాకిస్తాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్నేహితుడి భావిస్తున్నారు. అయితే పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కు తాజాగా ఓ అల్టిమేటం జారీ చేశారు. గాజాలోని హమాస్ ఉగ్రవాదులను అంతం చేయడానికి పాకిస్తాన్ సైనికులను పంపాలని ఆదేశాలు జారీ చేశారు. కోరిలేషన్ ఆఫ్ ముస్లిం సోల్జర్స్ (సీఎంఎస్) కూటమి ఏర్పాటుతో ఈ ప్రణాళిక మరింత తీవ్రతరం అవుతోంది. పాకిస్తాన్‌లో 7 లక్షల మంది సైనికులు ఉండటం ప్రధాన కారణం. ఇతర ముస్లిం దేశాలతో పోల్చితే ఇక్కడే అత్యధిక సైన్యం ఉంది. అంతేకాకుండా, ట్రంప్‌కు ఆసిమ్ మునీర్‌పై పూర్తి నమ్మకం ఉంది. 'నా ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తారు' అనే విశ్వాసంతో ఒత్తిడి పెంచారు.



చేయకపోతే ఆర్థిక, సైనిక సహాయాలను ఉపసంహరిస్తామని హెచ్చరించారు. పాకిస్తాన్ ప్రజలు పాలస్తీనాకు బలమైన మద్దతు ప్రదర్శిస్తున్నారు. ఇక్కడి సైన్యం హమాస్‌పై దాడి చేస్తే, ఇస్లామిక్ సమాజంలో పాకిస్తాన్‌కు వ్యతిరేకత పెరుగుతుంది. ఇప్పటికే ఇమ్రాన్ ఖాన్ అనుచరులతో ఆసిమ్ మునీర్ పోరాడుతున్నారు. గాజా మిషన్‌కు సైన్యం పంపితే, విపక్ష పార్టీలు ఏకమై మునీర్‌పై తిరుగుబాటు ప్రారంభించే ప్రమాదం ఉంది. ఇటీవల మునీర్ త్రివిధ దళాల అధినేతగా నియమితులైనా, ఇంకెంత డ్యామేజ్ కంట్రోల్ చేయగలరో సందేహం. పాకిస్తాన్ సైన్యానికి హమాస్‌ను జయించే శక్తి లేదని నిపుణులు అంచనా. స్వంత దేశంలో తెహ్రీక్%-%ఎ%-%తాలిబాన్ వంటి ఉగ్రవాద గుండాలను అరికట్టలేకపోతున్నారు. గాజాలో ఓటమి జరిగితే అంతర్జాతీయ స్థాయిలో పాకిస్తాన్ ప్రతిష్ట పడిపోతుంది. ఇప్పటికే ఆఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో దాడులు జరుగుతున్న నేపథ్యంలో భారత్ 'ఆపరేషన్ సిందూర్ 2.0' ప్రారంభించే అవకాశం కూడా ఉంది. అంతర్గత రాజకీయాలు, ప్రజల భావోద్వేగాలు ఈ ప్లాన్‌ను కుప్పకూల్చే అవకాశం ఉంది. మునీర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అంతర్జాతీయ వర్గాలు ఆసక్తిగా చూస్తున్నాయి.

# ఏడాదిలో కండోమ్స్ కోసం లక్ష రూపాయిలు...

**వాడు మగాడురా బుజ్జీ**

**ముంబై, డిసెంబర్ 24:** మరికొద్ది రోజుల్లో 2025 కాలగర్భంలో కలిసిపోనుంది.. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికి సంబంధించిన అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఈ కామర్స్ అనేది ప్రస్తుతం మన జీవితంతో అవినాభావ సంబంధాన్ని ఏర్పరచుకున్న నేపథ్యంలో.. ఈ కామర్స్ సంస్థలు తమ లావాదేవీలను వెల్లడిస్తుంటాయి. తమకు ఎదురైన అనుభవాలను పంచుకుంటాయి. మనదేశంలో ఈ కామర్స్ సంస్థలలో దిగ్గజ కంపెనీ ఇన్ స్టా మార్ట్ ఈ ఏడాదికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ఆ సంస్థ వెల్లడించిన ఈ ఏడాది వార్షిక నివేదిక ప్రకారం.. అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బెంగళూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి అత్యంత కనిష్టంగా ఖర్చు పెట్టాడు. అతడు కేవలం పది రూపాయల ఆర్డర్ మాత్రమే ఇచ్చాడు. పది రూపాయల విలువైన ప్రింట్ అవుట్ కావాలని అతడు ఆర్డర్ పెట్టాడు. వాటిని మాత్రమే అతడు తెప్పించుకున్నాడు. ఈ ఏడాది ఇన్స్టా మార్ట్ లో అత్యంత కనిష్టమైన లావా దేవి ఇదేనని ఆ సంస్థ పేర్కొంది.. హైదరాబాద్ నగరానికి చెందిన ఓ వ్యక్తి లేటెస్ట్ ఐఫోన్ కోసం



ఏకంగా 4.3 లక్షలు ఖర్చు పెట్టాడు.. ఇది అత్యంత ఖరీదైన లావాదేవీ అని ఇన్స్టా మార్ట్ ప్రకటించింది. కేవలం అతడు ఫోన్ల కోసమే భారీగా ఖర్చు పెట్టాడని ఇన్స్టా వెల్లడించింది. మరోవైపు ఓ వ్యక్తి ఏడాదిలో 22 లక్షల ను వివిధ ఉత్పత్తుల కొనుగోలుకు ఖర్చు పెట్టాడు. ముంబై నగరానికి చెందిన ఓ వ్యక్తి దాదాపు 15.16 లక్షల విలువైన బంగారాన్ని కొనుగోలు చేశాడు. చెన్నై నగరానికి చెందిన ఓ వ్యక్తి కలిడోలిమ్ ల కోసం ఏకంగా లక్ష రూపాయలు ఖర్చు పెట్టాడు. ఇన్ స్టా మార్ట్ నివేదిక ప్రకారం మనదేశంలో టైర్ 2 నగరాలలో రాజ్ కోట్ వేగవంతమైన అభివృద్ధిని నమోదు చేస్తోంది. ఇప్పటికే ఈ నగరం 10రెట్ల వృద్ధిని నమోదు చేసింది. లుధియానా ఏడు, భువనేశ్వర్ నాలుగు రెట్ల వృద్ధిని శ్రద్ధ చేసుకుంది.. ప్రజలు ఎక్కువగా ఆర్డర్ చేసిన వాటిల్లో కరివేపాకు మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత పెరుగు, గుడ్లు, పాలు, పండ్ల వంటివి ఉన్నాయి.. కేరళ రాష్ట్రంలోని కొచ్చి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఏకంగా 368 సార్లు కరివేపాకు కోసం ఆర్డర్ పెట్టాడు. ఈ ప్రకారం చూసుకుంటే రోజుకు సగటున ఒకసారి అతడు ఆర్డర్ పెట్టినట్టు అర్థమవుతుంది. బెంగళూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి తరచూ ఇన్ స్టా మార్ట్ లో కొనుగోలు జరిపాడు. అదే కాదు తనకు వస్తువులను డెలివరీ చేయడానికి వచ్చిన వ్యక్తికి ఏకంగా 68,600 టిప్ గా చెల్లించాడు. ఇక మిగతా తినుబండారాలు కూడా భారీగానే విక్రయమయ్యాయని ఇన్ స్టా మార్ట్ వెల్లడించింది. ఉదయం 7:00 నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 4గంటల నుంచి ఏడు గంటల వరకు తమకు ఆర్డర్లు ఎక్కువగా వచ్చినట్టు ప్రకటించింది.

## రాజకీయాలకు తావు లేకుండా

# గ్రామాల అభివృద్ధి జరగాలి

- మొదటి పేజీ తరువాయి

అందరినీ సీఎం శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన ప్రసంగించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిర్మించాలి. దేశ పునాదులు గ్రామాల్లోనే ఉన్నాయి. వారి స్ఫూర్తిని కొనసాగించాలని కొత్త సర్పంచుల సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు చేరినప్పుడే నిజమైన పాలన. నాకు ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తూ ఎక్కువ సమయం ఇవ్వలేక పోయినా.. నియోజకవర్గ కార్యకర్తలకు స్థానికంగా ఉన్న మండల పార్టీ అధ్యక్షులు అందుబాటులో ఉంటున్నారు. తెలంగాణలోనే కోడంగల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలబెట్టాలి. నేను ఎక్కడున్నా.. నిరంతరం మిమ్మల్ని గమనిస్తుంటాను. నా సోదరుడిని ప్రత్యేకంగా మీ సమస్యలు తీర్చేందుకే ఎలాంటి పదవి లేకుండా నియోజకవర్గంలో అందుబాటులో ఉంచాను. 2009లో ఇక్కడి నుంచి నన్ను ఎమ్మెల్యే గెలిపించారు. మళ్ళీ కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాను. కోడంగల్ ప్రజలు నన్ను గుండెల్లో పెట్టుకున్నారు. ఇక్కడికి వచ్చిన సర్పంచ్ లలో చాలామంది సమస్యలు చెప్పాలని ఆశతో ఉన్నారు. నిధులు మంజూరైన చేయాల్సిన అభివృద్ధి ఉంది. కొడంగల్ నియోజకవర్గం దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్ది, ఇక్కడి ప్రతి తండా కు గుడి బడి నీళ్లు, అన్న బియ్యం ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం. ఈ ప్రాంతంలో చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామిక వాడ ఇంట్రెస్ట్ యల్ పార్క్ ఏర్పాటు చేసుకుందాం. రాష్ట్రంలో కొడంగల్ నియోజకవర్గం ఒక రోల్ మోడల్ కావాలి. ప్రతి పౌరుడు మన కుటుంబ సభ్యుడే. అందరినీ కలుపుకుపోదాం. అండగా నిలుద్దాం. అందరూ కావాల్సినవాళ్లే. పెద్ద హోదాలో ఉన్నప్పుడు హుందాగా వ్యవహరించాలి. గ్రామాల్లో కక్షపూరిత వాతావరణం ఉండొద్దు. నాణ్యమైన సేవలు అందించాలి. నేను మీకు పూర్తి సమయం ఇవ్వకపోయినా.. ఇక్కడ ఏం జరుగుతుందో నాకు తెలుసు. ఏ పార్టీ నాయకులైన వాళ్ళ పేర్లు కూడా తెలుసు. కొడంగల్ నా కుటుంబం. ప్రాణ సమానం. 2018లో ఇక్కడ కుట్ర జరిగి నేను ఓడిపోయినా.. మల్కాజ్ గిరిలో ఎంపీగా నిలబడితే ఈ ప్రాంత ప్రజలు అక్కడికి వచ్చి ఓటర్లకు దండం పెట్టి నన్ను ఎంపీగా గెలిపించారు. మీ ఆశీర్వాదంతోనే సేవ చేసే భాగం కలిగింది. ఇంత గొప్ప పదవి వచ్చేది లేదు.. ఇచ్చేది లేదు.. ఇంజనీరింగ్ చదివిన యువత సర్పంచి ఎన్నికల్లో పోటీ చేశారు. చిన్న గ్రామపంచాయతీలకు 5 లక్షలు, మేజర్ పంచాయతీలకు రూ.10 లక్షల ఎస్.డీ.ఎఫ్. నిధులను కొత్త సంవత్సరంలో ఇచ్చే బాధ్యత నాది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులకు ఇవి అదనం. ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోకపోవచ్చు. కొత్త సర్పంచుల గౌరవం నిలబెట్టేందుకే ఎస్.డీ.ఎఫ్. నిధులు మంజూరు చేస్తున్నాం. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోండి. ప్రజలకు మీరు ఇచ్చిన మాట నిలబెట్టుకోండి అని సీఎం తెలిపారు. 2023 డిసెంబరు లో వచ్చిన ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంది. అధికారంలోకి వచ్చి పదేళ్లుగా ఇవ్వని రేషన్ కార్డులు ఇచ్చాం. రాష్ట్రంలో 3 కోట్ల 10 మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. ఇంకా రేషన్ కార్డులు లేని వారికి కార్డులు ఇచ్చి ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్న బియ్యం ఇచ్చే బాధ్యత



నాది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల్లో రేషన్ కార్డులు లేని వారి పేర్లు, ఉచిత కరెంటు లేని వారి పేర్లు, రైతు భరోసా రాని రైతుల పేర్లు రాసుకుని ఇస్తే అర్హులైన అందరికీ ఆయా పథకాలను అందిస్తాం. బస్సుల్లో మహిళలకు కండక్టర్ బస్ చార్జీ అడిగితే నా పేరు చెప్పండి. మా అన్న సీఎం కు చెప్తాం. మీ నౌకరి ఊడుతుంది అని చెప్పండి. బస్సులో శ్రీశైలం, యాదగిరి గుట్ట, వెళ్తారో వెళ్లండి. సమ్మక్క సారక్క జాతరకు వెళ్లి దర్శనాలు చేసుకోండి. నెలకు ఒకసారి తల్లిదండ్రులను పలకరించి రండి అని ఆయన మహిళలకు సూచించారు. కోటిమంది ఆడ బిడ్డలకు సారే పేరిట చీర ఇస్తునాం. ఇంకా ఎవరికైనా చీర అందక పోతే ఇవ్వాలని అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన వేదిక మీద నుంచి సీ ఎస్. కలెక్టర్లను ఆదేశించారు. మీ పిల్లలను పాఠశాలకు పంపించండి. చదువుతోనే వెలుగు, మార్పు వస్తుంది. ఇక్కడున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్లు చిన్నచిన్న కుటుంబాలనుంచి వచ్చినవారే అయినా వాళ్లు ఉన్నత చదువులు చదువుకున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో 25 వేల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం పెడుతున్నాం. రాష్ట్ర మొత్తం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాగే టిఫిన్ మధ్యాహ్న భోజనం పెట్టి మంచి చదువు చెప్పిస్తాం. నాణ్యమైన విద్య,వసతులు, భోజనం అందిస్తేనే చదువు పై ఆసక్తి ఉంటుంది. ఈ ప్రాంతం నుంచి ఉన్నత చదువులు చదివి ఐఏఎస్, ఐపీఎస్ లు కావాలి. తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి. రాష్ట్రంలోనే లేని కు సైనిక్ స్కూల్ ను లగచర్ల కు తీసుకొచ్చాం. 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ ను కొడంగల్ లో కడతాం. దేశంలో నీ ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకోవాలి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మన బిడ్డ పెత్తనం ఉండాలని జిల్లా ప్రజలు ఆశీర్వదించి నన్ను సీఎం ను చేశారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులతో పాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు చేసుకుంటున్నా%శీ%. 2014లో తెచ్చిన జీవో 69 ను మంజూరు చేయిస్తే గత ప్రభుత్వం తొక్కి పెట్టింది. చివరకు ఆ ప్రాజెక్టు సాధన సమితి ఏర్పాటు చేసి గొంతెత్తి నినదించింది. ఇప్పుడు తాము ఆ ప్రాజెక్టు ను ప్రారంభించుకుంటుంటే కోర్టులో కేసులు వేసి అడ్డుపడుతున్నారు. మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ లో ఎకరా కు 14 లక్షలు సరిపోవడం లేదని మంత్రి శ్రీహరి వచ్చి అడిగి ఎకరాకు 18 లక్షలు ఆశిస్తున్నారని చెబితే తాను ఎకరాకు 20 లక్షలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నానని క్యాబినెట్ ఆమోదం పొందింది అని సీఎం తెలిపారు. ఇప్పుడు 96 శాతం రైతులు ఒప్పుకుని భూములు ఇస్తున్నారన్నారు.

పదేళ్లలో ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదు

గత పదేళ్లలో ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదని, తొడుక్కోవడానికి చెప్పులు, వేసుకోవడానికి బట్టలు లేని వాళ్లకు వేల కోట్ల ఆస్తులు వచ్చాయి తప్ప పాలమూరుకు నీళ్లు రాలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పడావు పెట్టిన ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టాం. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు%ా% పదేళ్లలో వాళ్లు చేసిన అప్పులు మన ముందు ఉన్నాయి.

నా కోపాన్ని దృష్టిలో పెట్టుకుని పగ సాధించాలనుకుంటే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని ఊరుకున్నా. రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా అంటున్నాడు.. ఇదేం దుబాయ్ పాస్ పోర్ట్ బ్రోకర్ దందా కాదు నేనేం పాస్ పోర్టు బ్రోకర్ దందా చేయలేదు..అని సీఎం పేర్కొన్నారు. మేం కక్షా రాజకీయాలు చేయం.. ఎవరి పాపాన వాళ్లే పోతారని మా పని మేం చేసుకుంటున్నాం అని తెలిపారు.

కొడంగల్ వేదికగా సవాల్ విసురుతున్నా... 2029 ఎన్నికల్లో 119 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 87 సీట్లతో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొస్తా 150 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 100 కు పైగా స్థానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొస్తా. రాష్ట్రంలో మరోసారి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని.. ధీమా వ్యక్తం చేశారు. ఏ అంశంపై అయినా అసెంబ్లీలో చర్చించేందుకు మేం సిద్ధం. సభకు రండి.. అర్థవంతమైన చర్చ చేద్దాం కాళేశ్వరంపై చర్చిద్దామా, కృష్ణా గోదావరి జలాలపై చర్చిద్దాం, టెలిఫోను ట్యాపింగ్ పై చర్చిద్దామా రండి అని విపక్ష నేతకు సవాల్ విసిరారు. కార్యక్రమంలో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. తన 32 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలా సర్పంచులను స్వయాన సీ ఎం సన్మానించడాన్ని చూడలేదు అన్నారు. మీరంతా అదృష్టవంతులు అన్నారు. రాష్ట్రంలో 70 శాతం సర్పంచ్ లను గెలిశాం. ఇది మళ్ళీ రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం అనడానికి శుభసూచకం అన్నారు. కృష్ణానది జలాలతో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సీఎం నిలుపుతారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం తో ఈ ప్రాంతమంతా పచ్చని పొలాలతో సస్యశ్యామలం అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, వికారాబాద్ కలెక్టర్ ప్రతిక్ జైన్, నారాయణపేట ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వర్, రెవెన్యూ కలెక్టర్ శ్రీను, కాడ అధికారి వెంకట్ రెడ్డి,కాంగ్రెస్ జిల్లా నాయకులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, కుంభం శివకుమార్ రెడ్డి, నారాయణపేట, వికారాబాద్ జిల్లా డీఎస్పీలు, కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో టేకోవర్ ప్లాన్ సిద్ధం!

- మొదటి పేజీ తరువాయి

చిక్కులు లేకుండా ఐడీబీఐ కసరత్తు: వేల కోట్ల రూపాయల ప్రాజెక్టును ఒక ప్రైవేటు సంస్థ నుంచి ప్రభుత్వం తీసుకోవడం అనేది సామాన్యమైన విషయం కాదు. ఇందులో అనేక ఆర్థిక, న్యాయపరమైన మెలికలు ఉంటాయి. వీటికి పరిష్కరించడానికి ప్రభుత్వం ఐడీబీఐ సంస్థను ఫైనాన్స్, లీగల్ అడ్వైజర్‌గా నియమించింది. సమాచారం ప్రకారం ఐడీపీఐ సంస్థ ఇప్పటికే సమగ్రమైన నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేసింది. ఎల్ అండ్ టీ సంస్థకు ప్రభుత్వం ఎంత మొత్తం చెల్లించాలి, బకాయిల పరిస్థితి ఏంటీ, ఒప్పంద పత్రాల్లోని నిబంధనలు ఎలా ఉన్నాయి అనే అంశాలై ఈ నివేదికలో స్పష్టత ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ రిపోర్టు ఆధారంగానే హెచ్ఎంఆర్ఎల్, ఎల్ అండ్ టీ ప్రతినిధులు అంతిమ ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. టెక్నికల్ కన్సల్టెంట్ నియామకం: ఇంజనీరింగ్అద్భుతంపై ఆడిట్ మెట్రో అనేది కేవలం రవాణా వ్యవస్థ మాత్రమే కాదు, అది ఒక సంక్లిష్టమైన సాంకేతిక వ్యవస్థ. నిర్మాణం నుంచి ఆపరేషన్స్ వరకు ప్రతి అడుగులోనూ సాంకేతికత కీలకం అందుకే మెట్రో ప్రాజెక్టు నిర్మాణ నాణ్యత, ప్రస్తుత నిర్వహణ తీరు, రైళ్ల ఆపరేషన్స్ వంటి కీలక అంశాలను అంచనా వేయడానికి ప్రభుత్వం క టెక్నికల్ కన్సల్టెంట్‌ను నియమించలని నిర్ణయించింది. ఈ నియామక ప్రక్రియ మరో వారం రోజుల్లో పూర్తికానుంది. ఈ కన్సల్టెంట్ ఇచ్చే సాంకేతిక



నివేదిక, ఐడీబీఐ ఇచ్చిన ఆర్థిక నివేదికతో కలిపి మెట్రో టేకోవర్ ప్రక్రియకు ఒక పూర్తి స్థాయి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తుంది. ప్రజలకు కలిగే ప్రయోజనం ఏంటీ? ప్రభుత్వ నిర్ణయం వెనుక లోతైన వ్యూహం కనిపిస్తోంది. మెట్రో పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి వస్తే టికెట్ ధరల నియంత్రణ, మెట్రో రెండో దశ విస్తరణ పనుల్లో వేగం, ఇతర ప్రజా రవాణా వ్యవస్థలతో మెట్రోను అనుసంధానించడం సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**సెకండ్ ఫేజ్ పై పెండింగ్**

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం మోడల్‌లో నిర్మించిన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలంటే సుమారు రూ.15,000 కోట్ల నుంచి రూ.18,000 కోట్ల వరకు నిధులు అవసరమని అంచనా. ప్రాజెక్టు అప్పులు, ఎల్ అండ్ టీ పెట్టుబడి, ఇతర నిర్వహణ ఖర్చులను లెక్కగడితే ఈ మొత్తం భారీగా ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌పై ఒత్తిడి ఉన్న సమయంలో , కేంద్ర ప్రభుత్వ సహాయం కోరాలా లేక విదేశీ రుణ సంస్థల ద్వారా నిధులు సమీకరించాలా అనే అంశంపై ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. మెట్రో ప్రాజెక్టు ప్రభుత్వ చేతుల్లోకి వస్తే, రెండో దశ విస్తరణ పనులు మరింత వేగవంతం అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. విమానాశ్రయ మార్గం, పాతబస్తీ మెట్రో వంటి కీలక మార్గాల్లో నిర్ణయాలు తీసుకోవడం ప్రభుత్వానికి సులభతరం అవుతుంది. ప్రైవేట్ భాగస్వామి నిబంధనల అడ్డంకులు లేకుండా, ప్రభుత్వం సొంతంగా నిధులు కేటాయించి నగరం నలుమూలలా మెట్రోను విస్తరించే అవకాశం ఉంటుంది. హైదరాబాద్ మెట్రో స్వాధీనం అనేది కేవలం ఒక వ్యాపార లావాదేవీ మాత్రమే కాదు, ఇది నగర ప్రజా రవాణా ముఖచిత్రాన్ని మార్చే అతిపెద్ద నిర్ణయం. ఎల్ అండ్ టీ నుంచి వాటాల బదిలీకి సంబంధించి ప్రస్తుతం చర్చలు తుది దశలో ఉన్నాయి. ప్రభుత్వం క్లారిటీ ఇస్తే, రాబోయే కొద్ది నెలల్లోనే హైదరాబాద్ మెట్రో పూర్తి స్థాయిలో ప్రభుత్వ సంస్థగా రూపాంతరం చెందనుంది. ఆ తర్వాతే మెట్రో విస్తరణ గురించి అడుగులు ముందుకు పడే అవకాశం ఉంది

# ఫోన్ ట్యాపింగ్ లో.... చిక్కులు తప్పవా

- మొదటి పేజీ తరువాయి

తెలిసిన వెంటనే ఇంటెలిజెన్స్ కార్యాలయంలోని హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయడం ఈ కేసులో అతిపెద్ద నేరంగా పరిగణించబడుతోంది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, సిట్ అధికారులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. త్వరలోనే రాజకీయంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభాకర్ రావుతో పాటు ఇతర నిందితుల స్టేట్‌మెంట్లలో వీరి పేర్లు ప్రస్తావనకు రావడంతో, అసలు ఈ నిర్ణయాల వెనుక ఎవరున్నారు? దీనికి నిధులు ఎక్కడి నుండి వచ్చాయి? అనే కోణంలో ప్రశ్నలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. "చట్టం ఎవరికీ చుట్టం కాదు, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష



అనుభవించాల్సిందే" అని ఆయన వ్యాఖ్యానించారు. నిజానిజాలు వెలుగులోకి రావాలని, బాధితులకు న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ యుద్ధంలా కాకుండా, ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశంగా బీజేపీ చిత్రీకరిస్తోంది. ఈ కేసు కేవలం నోటీసులతో ఆగిపోతుందా లేదా అరెస్టుల వరకు వెళుతుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కేసును లాజికల్ ఎండ్‌కు తీసుకెళ్లాలని పట్టుదలతో ఉంది. ఇది రాజకీయ కక్ష సాధింపు అని బీఆర్ఎస్ వాదిస్తున్నప్పటికీ, సాంకేతిక ఆధారాలు బలంగా ఉంటే తప్పించుకోవడం కష్టమే. ధ్వంసం చేసిన హార్డ్ డిస్క్‌ల నుండి రికవరీ చేసిన డేటా, నిందితుల మధ్య జరిగిన వాట్సాప్ చాట్స్ ఈ కేసులో కీలకం కానున్నాయి. తెలంగాణ రాజకీయ చరిత్రలో ఇదొక చీకటి అధ్యాయంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత గోప్యతను హరించడం క్షమించరాని నేరం. ఒకవేళ సిట్ సేకరించిన ఆధారాలు కోర్టులో నిలబడితే, బీఆర్ఎస్ అగ్రనాయకత్వం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోక తప్పదు. వచ్చే కొన్ని వారాలు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానున్నాయి.

# బీఆర్ఎస్ సోషల్ మీడియా ఫుల్లీ లోడెడ్..

- మొదటి పేజీ తరువాయి

మరింత పద్ధతిగా ఉపయోగించుకోవాల్సి ఉంటుంది.. ఏతా వాతా సోషల్ మీడియా అనేది ప్రస్తుత కాలంలో రాజకీయ పార్టీలకు కనీస అవసరం. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. దశాబ్ద కాలం రాష్ట్రంలో అధికారానికి దూరమైన తర్వాత కాంగ్రెస్ పార్టీ 2023లో గద్దెనెక్కింది.. ఇలాంటి క్రమంలో ప్రభుత్వ పథకాలను.. ప్రభుత్వం చేస్తున్న పనులను.. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అక్రమాలను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా బలంగా చెప్పగలగాలి. అవసరమైతే విస్తృతమైన నెట్వర్క్ ఏర్పాటు చేసుకొని ప్రజల్లో స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలి.. కానీ ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మర్చిపోయినట్టు కనిపిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాదిరిగానే ఇప్పుడు కూడా సోషల్ మీడియా ను అంతంతమాత్రంగానే ఉపయోగిస్తుంది. ఇటీవల కెసిఆర్ బయటికి వచ్చారు. రేవంత్ ప్రభుత్వం మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అనుకూల సోషల్ మీడియా మొన్నటి నుంచి అన్ని విభాగాలలో అధికార కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు మొదలుపెట్టింది. అంతేకాదు కేసీఆర్ మాత్రమే తెలంగాణకు రక్షకుడు అన్నట్టుగా ప్రచారం ప్రారంభించింది.. కెసిఆర్ చెప్పిన ప్రతి మాటను నిజమని నమ్మించే ప్రయత్నం చేసింది. ఈ విషయంలో గులాబీ పార్టీ సోషల్ మీడియా విజయవంతమైనది కూడా. వాస్తవానికి ఇలాంటి సమయంలో గులాబీ పార్టీ సోషల్ మీడియాకు బలమైన కౌంటర్ ఇవ్వడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ కు కర్త ఎవరు? కర్మ ఎవరు? క్రియ ఎవరు? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు. పైగా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ పార్టీ సోషల్ మీడియా విభాగానికి కీలక స్థాయిలో పనిచేసిన వారంతా సరైన గుర్తింపు లేకపోవడంతో బయటకు వెళ్లిపోయారు. ఇప్పుడు ఎవరో కొందరిని రిక్రూట్ చేసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి సోషల్ మీడియా ఆశించిన స్థాయిలో బలాన్ని ఇవ్వలేకపోతోంది. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ ఎంత బలహీనంగా ఉందో ఏబీఎన్ లో పనిచేసే కీలక న్యూస్ ప్రజెంట్ వెంకటకృష్ణ చేసిన వ్యాఖ్యలే బలమైన నిదర్శనం. సోమవారం నాటి ఏబీఎన్ ప్రైమ్ టైం బులిటెన్ లో వెంకటకృష్ణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. గులాబీ పార్టీ సోషల్





మీడియా విపరీతంగా ప్రచారం చేస్తుంటే.. కనీసం కౌంటర్ కాదు కదా.. ఏమీ ఇవ్వకుండా ముసుగు తన్ని పడుకున్నారని వెంకటకృష్ణ ఆరోపించారు. దీనిని బట్టి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఎలా మార్పు చెందాలి? ఎలా బలోపేతం అవ్వాలి? అనే విషయాల మీద ఆ పార్టీ పెద్దలు దృష్టి పెడితే మంచిది. లేకపోతే అంతే సంగతులు. ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియా ముందు అధికార పార్టీ సోషల్ మీడియా సైలెంట్ అయిపోతే అంతకుమించిన దరిద్రం మరొకటి ఉండదు.

# ఢిల్లీలో నేను ఉండలేను..

**ఢిల్లీలో మూడు రోజులు ఉంటే..**
**అలర్జీలు వచ్చాయి**
**నితిన్ గడ్కరీ...**

**మెవ్ ఢిల్లీ డిసెంబర్ 24:** దేశంలో అత్యంత కాలుష్య నగరాల్లో దేశరాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటుంది. అక్కడ ఏటా శీతాకాలం సమయంలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరస్థాయిలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మూడు రోజులు ఢిల్లీలో ఉంటే.. కాలుష్యం కారణంగా అలర్జీలు వచ్చాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. ఢిల్లీలో తీవ్ర కాలుష్యానికి 40 శాతం రవాణా రంగమే కారణమని అంగీకరించారు. 'నేను రవాణా శాఖ మంత్రిని. 40 శాతం కాలుష్యానికి రవాణా రంగమే కారణం' అని తెలిపారు.'ఇది ఎలాంటి జాతీయవాదం..? శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కాలుష్యం పెరుగుతోంది. శిలాజ ఇంధన వినియోగాన్ని



మనం తగ్గించలేమా..? సున్నా కాలుష్యానికి దారితీసే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ శక్తితో నడిచే వాహనాలను మనం ఎందుకు ప్రోత్సహించలేము..?' అని నితిన్ గడ్కరీ ప్రశ్నించారు. శిలాజ ఇంధనాల్ని దిగుమతి చేసుకోవడానికి ఏటా రూ.22 లక్షల కోట్ల ఖర్చు అవుతోందని.. ఇది ఆర్థిక భారమని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్, హైడ్రోజన్ వాహనాల వైపు మళ్లాలని సూచించారు.

**ఢిల్లీలో నేను ఉండలేను..**

కాగా, ఢిల్లీ కాలుష్యంపై గడ్కరీ గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. తాను రాజధాని నగరంలో రెండు లేదా మూడు రోజులకంటే ఎక్కువ ఉండలేనని అన్నారు. ఢిల్లీకి వస్తే.. ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుందని వ్యాఖ్యానించారు. 'నేను ఢిల్లీలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఉండగలను. అంతకుమించి ఉండటం నావల్ల కాదు. ఢిల్లీలో అడుగుపెట్టగానే ఎప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుంది. అందుకే నేను వచ్చేటప్పుడే రిటర్న్ టికెట్స్ కూడా బుక్ చేసుకుంటాను. ప్రజలు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఢిల్లీలో కాలుష్యం కారణంగా సాధారణ ప్రజల ఆయుర్దాయం తగ్గింది. వాహనాలకు వినియోగించే శిలాజ ఇంధనాల వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలందరి ప్రధాన బాధ్యత' అని అన్నారు.

# న్యూ ఇయర్ జోష్ లో తప్పులు చేస్తే..కటకటాల్లోకే..

- మొదటి పేజీ తరువాయి




పరిమితికి మించి లిక్కర్ వాడినా నేరమే. అటు, నాన్ పెయిడ్ డ్యూటీ లిక్కర్ మీద కూడా ఫోకస్ పెట్టింది ఖాకీ శాఖ. గంజాయి విక్రయాల్లో స్టూడెంట్స్ కూడా ఉండడంతో కాలేజ్ యాజమాన్యాలు, హాస్టళ్ల ఓనర్స్‌తో మీటింగ్స్ పెట్టి క్లాసులు పీకారు పోలీసులు. ఇటు, ఏపీ, ఒడిషా, మహారాష్ట్ర నుంచి గంజాయి తరలిస్తున్నారన్న వార్తలతో అప్రమత్తమయ్యారు పోలీసులు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు పెట్టి వాహనాలను ఎక్కడికక్కడే తనిఖీ చేసి పంపిస్తున్నారు. ఈగల్ టీమ్స్, ఎస్ఓటీ పోలీసులు కంబైన్డ్ ఆపరేషన్స్ స్పీడప్ చేశారు. నిన్నటికి నిన్న హైదరాబాద్ రాయదుర్గంలో ఐదుగురిని అరెస్ట్ చేసి, 12 గ్రాముల MDMA , 7 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. పబ్‌లపై కూడా నిఘా పెంచేశారు. రూల్స్ ఉల్లంఘించిన పబ్‌లపై కేసులు నమోదయ్యాయి. ఇటీవలే ఆపరేషన్ దూల్‌పేట్ పేరుతో జూలు విదిల్చి, వంద కేసులు నమోదు చేసింది. వరుస తనిఖీలతో డ్రగ్స్ ట్రాఫిక్ నియంత్రణలోకొచ్చి, గంజాయి అమ్మకాలు 90 శాతం తగ్గినట్టు లెక్కుంది. అయినా సరే, న్యూ ఇయర్ వేడుకలను తేలిగ్గా తీసుకోవడం లేదు పోలీసులు.

# ఆ రెండు పార్టీలు... కమలంపై కయ్యానికి దిగుతాయా

- మొదటి పేజీ తరువాయి

చూస్తున్నారు.కానీ కలసి రావడం లేదు. గత ఎన్నికల్లో ఏపీ,తెలంగాణ, మహారాష్ట్ర ఇలా కొన్ని రాష్ట్రాలను టార్గెట్ చేసి రాజకీయాలు చేస్తే జీరో ఫలితం వచ్చింది. అటు జగన్ పరిస్థితి అంతే. అంతే వచ్చే ఎన్నికల్లో అయినా ఆ చక్రం తమ చేతికి వస్తుందని అనుకుంటున్నారు. వైసీప బలం తనకు అదనపు బలం అవుతుందని కేసీఆర్ అనుకుంటున్నారు. జగన్ అలా అనుకోకపోయినా.. ఇప్పటికైతే కేసీఆర్ తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు.వచ్చే ఆరు నెలల్లో తమ రాజకీయ వ్యూహాన్ని మార్చుకుని బీజేపీపై వీరు యుద్ధం ప్రకటించబోతున్నారని తాజా పరిణామాలను బట్టి అర్థం అవుతోందని రాజకీయ వర్గాలంటున్నాయి. కానీ ఇప్పుడు మాట్లాడే మాటలన్నీ కేవలం బీజేపీకి తామున్నామని గుర్తు చేయడానికేనని కొంత మంది అంటున్నారు. ప్రస్తుతం బీజేపీ హైకమాండ్ వీరి ఉనికిని పెద్దగా గుర్తించడం లేదు. వీరు కనుక.., బీజేపీపై యుద్ధం ప్రకటిస్తే.. రాజకీయాల్లో కాస్త మార్పు వస్తుంది. కానీ వీరు ఆ ధైర్యం చేస్తారా..? ఆరంభ శూరత్వమా అన్నది త్వరలో తెలుస్తుంది.

# కాళేశ్వరం పై ఆశలు

- మొదటి పేజీ తరువాయి



ఆ ప్రాంతంలో ఇసుక మాఫియా చెలరేగిపోతుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్ డ్యాం ల మీద బాంబులు వేశారని మండిపడ్డారు. మానవ నిర్మిత అద్భుతమైన కట్టడాల మీద మానవ విధ్వంసం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా పేరుపొందిన రాజేంద్ర సింగ్ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలిస్తున్న తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. "ఇసుకను తరలించడానికి ప్రాజెక్టులకు రంధ్రాలు చేస్తున్నారు. అందులో బాంబులు పెట్టి పేల్చుతున్నారు. ఇసుకను దోచుకోవడానికి ప్రాజెక్టులు అడ్డుగా ఉన్నాయని భావించి.. కోట్ల రూపాయల ప్రజల సొమ్ముతో నిర్మించిన చెక్ డ్యాములను పడగొడుతున్నారు. భూగర్భ జలాల పెంపుదల కోసం మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చెక్ డ్యాములను నిర్మించాం. ఇసుక కోసం వాటిని కూల్చివేసి.. పొలాలను ఎడారులుగా మారుస్తున్నారు. ఈ పరిణామాలు తెలంగాణ రాష్ట్రానికి ఎంత మాత్రం మంచిది కాదు. వీటిని చూస్తూ ఊరుకోమని" కేటీఆర్ వ్యాఖ్యానించారు.కేటీఆర్ చేసిన వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నాయకులు కూడా అదే స్థాయిలో సమాధానం చెప్పారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసిందని ప్రశ్నించారు.. బాంబులతో పెట్టి కూల్చేస్తే కూలిపోయే స్థాయిలో కాళేశ్వరం ఉందా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పడ్డది చిన్న పర్రె అని.. రిపేర్ చేస్తే సరిపోతుంది అని కేటీఆర్ గతంలో అన్నారని.. ఇప్పుడేమో బాంబులు పెట్టి కూల్చేశారని ఆరోపిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఏదైనా ఒక మాట మీద కేటీఆర్ నిలబడాలని సూచించారు.

# నెలరోజుల్లోగా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

- మొదటి పేజీ తరువాయి

శ్వేత పత్రం విడుదల చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ రాకముందే.. నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఇటీవల తెలంగాణలో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక గ్రామ పంచాయతీలను గెలుచుకుంది. గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు.. మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అయితే ఈ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్.. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదీకాక.. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సర్కార్ కసరత్తు చేస్తుంది. వీటిని సంక్రాంతి పండగ వెళ్లిన తర్వాత చేపట్టాలని భావిస్తుంది. ఒకవేళ ఈ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే.. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఇది నిధుల విడుదలకు అడ్డంకిగా మారుతోంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## ఆధ్యాత్మికత ఆత్మ-పరమాత్మల అనుసంధాత"

డాక్టర్ కె.వి. రమణాచారి

**హైదరాబాద్ డిసెంబర్ 24:** మానవ జీవితం ఆధ్యాత్మికతో ముడిపడి ఉన్న మహోన్నత స్థితి అని, దానికి పలు రచనలు, శ్లోకాలు ధన్యతను చేకూర్చుతాయని డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు.శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయితలు డా? వేదాంతం ఆంజనేయ కుమారస్వామి, బండారుపల్లి రామంద్రరావులు శ్రీ వెంకటేశ స్తోత్రములకు తెలుగు భావార్థముల సంకలన గ్రంథాన్ని, ప్రముఖ కవి రఘుశ్రీ రచించిన "రఘుశ్రీ హైకూలు" పుస్తకాన్ని తెలంగాణ ప్రభుత్వ పూర్వసలహాదారులు డా. కె.వి.రమణ చారి ఆవిష్కరించి, ప్రసంగించారు. మాసబ్యాంక్లో ని డా.రమణాచారి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు కడియాల ప్రభాకరరావు అధ్యక్షత వహించారు.డాక్టర్ కె.వి. రమణాచారి ప్రసంగిస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి పద్దెనిమిది శ్లోకాలను ఎంచుకుని తెలుగు భావార్థ రచన గావించిన కుమారస్వామి, సంకలనకర్త బండారుపల్లి రామచంద్రరావుల కృషి ప్రశంసనీయమని ద్వైతాద్వైతములు, కర్మ యోగములు, భక్తియోగ జ్ఞానయోగ, రాజయోగ, బుద్ధి యోగముల విశ్లేషణ విశేషముగా ఉన్నావని, ఇటువంటి రచనలు మనస్సును ఉద్దీపింపజేసి అలౌకిక తత్వాన్ని, ఆధ్యాత్మిక ఆనందాన్ని కలుగ జేస్తాయని అన్నారు. ఇది నేటి యువతకు అవసరమైన గ్రంథమని అన్నారు. రఘుశ్రీ హైకూలులో సామాజిక స్పృహ, హాస్యం, వ్యంగ్యం, ఇమిడి ఉన్నాయని కొనియాడారు.అనంతరం గ్రంథకర్తలను ఘనంగా సత్కరించారు.ఇంకా సభలో పద్యకవి కళ్యాణశ్రీ మరియు గ్రంథకర్తలు ప్రసంగించారు.

# జనవరి 8న ఏపీ బీసీ విద్యుత్ ఉద్యోగుల చలో విజయవాడ...

**విద్యుత్ ఉద్యోగుల సంఘం 20వ రాష్ట్ర మహాసభ**



**హైదరాబాద్ జనవరి 24:** ఆంధ్ర ప్రదేశ్ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం 20వ రాష్ట్ర మహాసభ సందర్భంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీకే వీరభద్రయ్య ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ లు తెలిపారు ఈ మేరకు విద్యానగర్ లోని బీసీ భవన్ లో ఆంధ్ర ప్రదేశ్ బీసీ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని పోస్టర్ ను ఆవిష్కరించారు అనంతరం వీరభద్రయ్య మాట్లాడుతూ జనవరి 8వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథిగా ఆర్ కృష్ణయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యుత్ ఉద్యోగుల సంఘం డైరీ మరియు క్యాలెండర్ ను ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ మహాసభలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ సవిత తో పాటు విశిష్ట అతిథులుగా విద్యుత్ శాఖ చీఫ్ సెక్రటరీ కె విజయ ఆనంద్, ఏపీ జెన్కో ఎండి ఎస్ నాగలక్ష్మి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి సూర్య సాయి ప్రవీణ్, ఏపీ డి సి ఎల్ ఎండి పృథ్వితేజ్, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎండి శివశంకర్ లోతేటి, ఏపీ సి పి డి సి ఎల్ ఎం డి పి పుల్లారెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు వారు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఏపీ ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం శ్రీధర్, డిప్యూటీ సెక్రటరీ జి చిన్న బాబు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నీల వెంకటేష్, రాందేవ్,నికిల్,రాజేందర్,రామకోటి తదితరులు పాల్గొన్నారు

# రీజనల్ రింగ్ రోడ్ నిర్వాసిత రైతుల సమస్యలపై ఎమ్మెల్సీ కవిత పోరాటం




రీజనల్ రింగ్ రోడ్ (ట్రిపుల్ ఆర్) ప్రాజెక్టు నిర్వాసిత రైతుల సమస్యలపై ఎమ్మెల్సీ కవిత గట్టిగా స్పందించారు. రాయిగిరి, తిమ్మాపురం, బస్వాపూర్ వంటి ప్రాంతాల రైతులతో కలిసి మాట్లాడిన కవిత, ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో చిన్న రిజర్వాయర్‌ను పెద్దదిగా మార్చి రైతుల భూములు లాగేసుకున్నారని ఆరోపించారు. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం (భువనగిరి)లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు స్పందించారు. పరిహారం రాలేదని ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. 'ట్రిపుల్ ఆర్ రైతులకు అండగా ఉండి, సమస్యలు పరిష్కరించేందుకు అందరం కలిసి ఉద్యమిద్దాం' అని కవిత పిలుపునిచ్చారు. జనవరి 4న 8 జిల్లాల నిర్వాసిత రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఆసుపత్రుల్లో వైద్య సేవలు, చికిత్స నాణ్యతపై కూడా అధికారులను ప్రశ్నించి కవిత సమాచారం సేకరించారు.

# నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవు

**పోలీస్ కమిషనర్ సిపి సజ్జనార్ హెచ్చరిక**



**హైదరాబాద్ డిసెంబర్ 24:** నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సిపి సజ్జనార్ తెలిపారు. నేటి నుంచి హైదరాబాద్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..డిసెంబరు 31 రాత్రి హైదరాబాద్ లోని 100 ప్రాంతాల్లోని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతాయని, తనిఖీల్లో పట్టుబడితే వాహనాలు సీజ్, రూ.10 వేలు జరిమానా ఉంటుందని సజ్జనార్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే 6 నెలల జైలు శిక్ష విధించబడుతుందని, తనిఖీల కోసం 7 ప్లాటూన్ల అదనపు బలగాలు ఏర్పాటు చేశామని తెలియజేశారు. పబ్ లు, త్రీస్టార్, ఆపై హోటళ్లలో అర్థరాత్రి ఒంటిగంట వరకే అనుమతని.. మాదకద్రవ్యాలు, అశ్లీల నృత్యాలకు యజమానులదే బాధ్యతని సూచించారు. రద్దీ ప్రాంతాలు, పార్టీ వెన్యూలు, జంక్షన్లో మఫ్టీలో 15 షీ టీమ్స్ ఏర్పాటు చేశామని సిపి సజ్జనార్ పేర్కొన్నారు.

# కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూబర్డ్ బ్లాక్-2 విజయవంతం..

**హరికోట డిసెంబర్ 24**: కమర్షియల్ మిషన్‌ను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. ఇవాళ ఉదయం అమెరికాకు చెందిన కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూబర్డ్ బ్లాక్-2 )ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఎల్‌వీఎం3-ఎం6 భారీ రాకెట్ ద్వారా ఆ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. 24 గంటల కౌంట్‌డౌన్ ముగియగానే ఇవాళ ఉదయం ఉదయం 8.55 నిమిషాలకు ఎల్వీఎం3 రాకెట్ దూసుకెళ్లింది. ఆ రాకెట్ సుమారు 43.5 మీటర్ల పొడుగు ఉన్నది. దానికి ఎస్200 సాలిడ్ బూస్టర్లు ఉన్నాయి. శ్రీహరికోటలోని రెండోవ లాంచ్ ప్యాడ్ నుంచి దీన్ని ప్రయోగించారు. అంతరిక్ష కేంద్రం నుంచి ఎగిరిన సుమారు 15 నిమిషాల తర్వాత శాటిలైట్ విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించింది. సుమారు 520 కిలోమీటర్ల ఎత్తులో ఆ కక్ష్య ఉన్నట్లు ఇస్రో చెప్పింది.న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎస్ఐఎల్), అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్‌మొబైల్ మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా బ్లూబర్డ్ శాటిలైట్‌ను ప్రయోగించారు. లో ఎర్త్ ఆర్బిట్‌లో బ్లూబర్డ్ శాటిలైట్ విహరించనున్నది. మొబైల్ సర్వీసులు అందించేదుకు ఈ శాటిలైట్‌ను ప్రయోగించారు. 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, టెక్స్ట్‌లు, స్ట్రీమింగ్, డేటా ఎప్పుడైనా, ఎక్కడైనా ఈ శాటిలైట్ ద్వారా అందించనున్నారు. లో ఎర్త్ ఆర్బిట్‌లో మోహరించిన అతిపెద్ద కమర్షియల్ కమ్యూనిషేన్ శాటిలైట్‌గా దీన్ని గుర్తిస్తున్నారు.విజయవంతంగా శాటిలైట్ పరీక్ష చేపట్టిన ఇస్రో బృందంపై కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ విజన్‌ను సక్రమంగా నిర్వర్తిస్తున్నారని ఇస్రోను మెచ్చుకున్నారు. ఒక విజయం తర్వాత మరో విజయాన్ని నమోదు చేస్తూ అంతరిక్ష టెక్నాలజీ రంగంలో భారత సామర్థ్యాన్ని చాటుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

# నాగోబా జాతర షురూ...

**అదిలాబాద్, డిసెంబర్ 24:**మెస్రం వంశీయుల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా మహా పూజలకు మెస్రం వంశీయులు శ్రీకారం చుట్టారు. పుష్యమాస అమవాస్యను పురస్కరించుకొని 2026 జనవరి 18న కేస్లాపూర్ నాగోబా జాతర నిర్వహించనున్న సందర్భంగా సోమవారం రాత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మెస్రం వంశీయులు ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామానికి చేరుకొని నాగోబా మురాడి దేవస్థానంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మెస్రం వంశీయుల పటేల్ కేస్లాపూర్ నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సాంప్రదాయం ప్రకారం నెలవంకను దర్శించుకునీ, నాగోబాకు పూజలు నిర్వహించారు.ఆదివాసీలకు పవిత్ర మాసం ఈ పుష్యమాసం.. కాళ్లకు చెప్పులు ధరించకుండ, మద్యం, మాంసాలకు దూరంగా ఉంటూ నెలరోజుల పాటు అత్యంత పవిత్రంగా పుష్యమాసంలో అడవి బిడ్డలు తమ ఆరాధ్య దైవాలను కోలుస్తుంటారు. ఒక్కో గోత్రానికి ఒక్కో రకమైన ఆచారాలు సాంప్రదాయాలు వారి దైవాలు ఉంటాయి. అయితే ఈ మెస్రం వంశీయులకు నాగోబా కుల దైవం. మెస్రం వంశీయులలోనూ భయ్ గొట్టే మెస్రం వంశీయులు



పడియోర్ అని పిలుస్తుంటారు. ఆదివాసీలు తమ ఆచార సాంప్రదాయాల ప్రకారం సూర్య చంద్రులను దైవాలుగా కోలుస్తారు. అందులో ఒక భాగమే నేలవంక దర్శనం. మాసాలను గుర్తించే దిశగా ఈ నెలవంక సూచిస్తుంది. పుష్యమాసం ప్రారంభంతో నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో తమ దైవాలను కోలుస్తుంటారు.మెస్రం వంశీయులు ప్రతియేటా నాగోబాను పుష్యమాసంలో భక్తి శ్రద్ధలతో కొలుస్తూ దర్శించుకుంటారు. వచ్చే 2026 జనవరి18న నాగోబాకు పవిత్ర గంగాజలంతో అభిషేకం నిర్వహించి మహాపూజ చేయనున్నారు. మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. అయితే నాగోబాకు అభిషేకం కోసం కావలసిన పవిత్ర గంగాజలం సేకరణ, నాగోబా మహాపూజ, జాతర గురించి 7 గ్రామాల్లో, 7 రోజుల పాటు ప్రచారం నిర్వహించే (ఛకడ) ఎడ్లబండి నాగోబా ప్రచార రథయాత్రను నేడు మంగళవారం ప్రారంభించనున్నారు. నేడు మరోసారి అందరూ మెస్రం వంశీయులు సమావేశమై ఈ నాగోబా ప్రచార రథయాత్ర గురించి రూట్ మ్యాప్ ను తయారు చేసి నాగోబాకు పూజలు చేసి ఛకడ వాహనం ఎడ్లబండిపై నాగోబా ప్రచార రథయాత్ర ప్రయాణం చేయనున్నారు.

**7 రోజులపాటు 7 గ్రామాలలో జాతర**

7 రోజుల పాటు ఆయా గ్రామాల గుండా ఈ రథయాత్ర కొనసాగుతుంది. ఏడు గ్రామాలలో ఏడు రోజులపాటు నాగోబా జాతర ప్రారంభం గురించి మహాపూజకు కావాల్సిన కుండలు ఇతర వాటి సేకరణ గురించి కార్యాచరణ మొదలుపెడతారు. అనంతరం ఏడు రోజుల తర్వాత తిరిగి కేస్లాపూర్ కు చేరుకొని, నాగోబా అభిషేకం మహాపూజ కోసం కావలసిన పవిత్ర గంగాజలం కోసం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరినదిలో గల హస్తలమడుగు వద్దకు పాదయాత్రగా బయలుదేరనున్నారు

# రెడ్డిపల్లి సబ్ స్టేషన్ ను అకస్మాత్తుగా తనిఖీ

**మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి....**

**హైదరాబాద్:**రెడ్డిపల్లి సబ్ స్టేషన్ ను మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అకస్మాత్తుగా తనిఖీ చేసారు..

**హరీష్ రావు మాట్లాడుతూ**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు కేవలం 12 గంటల కరెంటు మాత్రమే సరఫరా చేస్తున్నట్టుగా ఉంది నర్సాపూర్ సబ్ స్టేషన్ లో,సునీత లక్ష్మారెడ్డి నేను కలిసి సబ్ స్టేషన్ ను విజిట్ చేయడం జరిగింది.పార్టీ సమావేశానికి వెళ్తుండగా రైతులు కరెంట్ రావడంలేదని ఫోన్ చేస్తే సడన్గా ఆగడం జరిగింది.రెండు గ్రామాల రైతులు రెడ్డిపల్లి, మద్దూరు గ్రామ రైతులు ఫోన్ చేసి మాకు కరెంటు సరిగ్గా రావడంలేదని ఫోన్ చేస్తే మేము ఇక్కడికి సబ్ స్టేషన్ దగ్గర ఆగడం జరిగింది.రేవంత్ రెడ్డి 24 గంటలు కరెంటు ఇస్తమంటున్నాడు రెడ్డిపల్లి మద్దూరు గ్రామాల ప్రజలు 12-13 గంటలకు కరెంటు మాత్రమే వస్తుంది. మాకు ఇబ్బంది అవుతుంది నారుబోసే సమయము పొలానికి నారేసే టైం ఇబ్బంది అవుతుందని.. ఫోన్ చేస్తే ఇది నిజమా కాదా అని సమస్య ఏంది అని తెలుసుకుందామని నర్సాపూర్ సబ్ స్టేషన్ కు రావడం జరిగింది.ఇక్కడ లాక్ బుక్ చూస్తే కేవలం 12 గంటల కరెంటు మాత్రమే వచ్చింది.ఇంకొక రోజు చూస్తే సాయంత్రం ఐదు గంటలకు పోయి ఉదయం 3:00 వచ్చింది. అంటే 14 గంటలు మాత్రమే వచ్చింది ఇంకొక



రోజు చూస్తే 13 గంటల కరెంట్ వచ్చింది అంటే ఈ విధంగా 12,13 గంటల కరెంటు మాత్రమే వస్తుంది.

రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కరెంటుకు మేమే చాంపియన్, 24 గంటల కరెంటుకు మేమే బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పిండు.మరి 12 గంటల కరెంట్ ఎందుకు వస్తుంది నాయనా రేవంత్ రెడ్డి.ఆనాటి కాంగ్రెస్ పాలనలో కరెంటుతో రైతులు ఇబ్బందులు పడ్డారు నేడు కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంటుతో ఇబ్బందులు పడుతున్నారు. నాడు ఎరువులకు ఇబ్బందులు పడ్డారునేటి కాంగ్రెస్ పాలనలో ఎరువులకు ఇబ్బందులు పడుతున్నారు.మేం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉన్నాం రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి.భట్టి విక్రమార్క మీరు పెద్దపెద్ద మాటలు మాట్లాడడం కాదు,కెసిఆర్ అంటేనే 24 గంటల కరెంటు కు బ్రాండ్ అంబాసిడర్: ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా రైతుల కోసం 24 గంటలు నాణ్యమైన కరెంటు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం.కానీ మీరు వచ్చిన తర్వాత 12 13 గంటల కరెంటు కూడా రైతులకు రావడం లేదు, ఏది చూసినా సగం సగమే ఉంది రేవంత్ ప్రభుత్వంలో 24 గంటల కరెంటు రైతు బంధు, రుణమాఫీ బోనస్ అన్నిట్లో సగం సగం, దమ్ముంటే అసెంబ్లీలో విద్యుత్ సరఫరా మీద చర్చ పెట్టండిప్రతిపక్షాల మీద బురద జల్లడం కాదు, రైతు సమస్యల మీద ప్రజల సమస్యల మీద చర్చ పెట్టండిరైతులకు ఇచ్చిన హామీలు ఎగ్గొటినందుకు భయపడి కారు గుర్తు కనపడే ఎన్నికలు పెడుతలేడు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే కో ఆపరేటివ్ ఎన్నికలు పెట్టు ఈ ప్రభుత్వమే రైతు వ్యతిరేక ప్రభుత్వం.మేం ఒచ్చి చూసినం అని ఈ అధికారుల మీద చర్యలు తీసుకోకూ రేవంత్ రెడ్డి. నీకు నిజాయితీ ఉంటే రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

# సర్ తో అంతా సరౌతుందా..

**హైదరాబాద్, డిసెంబర్ 24:**భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. మరోవైపు మేధావి వర్గం సైతం అభ్యంతరాలు చెబుతోంది. ఈ సవరణలో భాగంగా చాలా రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు. దీంతో ఇది దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎన్నికల సంఘం తాజాగా తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాల ప్రకారం తమిళనాడులోని 97.37 లక్షల ఓట్లను తొలగించినట్లు ఈసీ అధికారికంగా ప్రకటించింది. గుజరాత్ లోను 73 లక్షల ఓట్లను జాబితా నుంచి తొలగించారు. తొలుత బీహార్లో ఈ ప్రక్రియ చేపట్టి ఎన్నికలు నిర్వహించారు. అక్కడ ఎన్డీఏ ఘనవిజయం సాధించడంతో ప్రత్యేక సమగ్ర సవరణ అనేది రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్నది అనే వాదన బలపడింది. ప్రజాస్వామ్యం పారదర్శకంగా ఉండాలన్న ఆలోచనతోనే ఈ ప్రక్రియ చేపట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం చెబుతోంది. బీహార్లో ప్రత్యేక ఏజెన్సీ ద్వారా అధ్యయనం చేసిన తరువాత మాత్రమే ఈ ప్రక్రియ చేపట్టినట్లు చెప్పుకోస్తోంది ఈసీ.వాస్తవానికి ప్రతి రాష్ట్రంలోనూ మరణించిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. వలస వెళ్లిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. ఒక్కొక్కరికి రెండు చోట్ల కూడా ఓట్లు ఉంటున్నాయి. ఈ విషయంలో ప్రత్యేక సమగ్ర సవరణ మంచిదే. కానీ ప్రజలతో పాటు మేధావుల సందేహాలను నివృత్తి చేయడంలో మాత్రం ఎలక్షన్ కమిషన్ అనుకున్న స్థాయిలో శ్రద్ధ చూపడం లేదు. అందుకే రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం ఈ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతోందని స్పష్టం చేస్తోంది. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అనంతరం అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పిస్తున్నామని.. అర్హులైన వాటర్లు తమ పేరును తొలగించబడితే సంబంధిత బూత్ లెవెల్ అధికారులను కానీ.. ఈసీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తుంది. తుది జాబితా విడుదలకు ముందు అన్ని అభ్యంతరాలను పరిశీలిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే బీహార్లో తమ ఓట్లు గల్లంతయ్యాయని.. చాలామంది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తమ ఓట్లను దూరం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల కమిషన్ అభ్యంతరాలు ఉంటే చెప్పాలని చెబుతోంది. తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని సూచిస్తుంది. అయితే





ఇప్పటివరకు తమ సొంత ప్రాంతంలో ఓటు వేసేవారు.. తాము నిజంగా ఓటర్లమని ధ్రువీకరించుకోవాల్సి వస్తోంది. దీనిపైనే ఎక్కువగా ఆగ్రహవేశాలు వ్యక్తం అవుతున్నాయి. చనిపోయారని చెప్పి చాలా మంది ఓట్లను తొలగించారు. అటువంటి వారు న్యాయస్థానాలను ఆశ్రయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఈ సమగ్ర సవరణ అనేది మంచి కార్యక్రమమే. కానీ సరైన అధ్యయనం చేయకుండా చేస్తే మాత్రం ఇబ్బందికరమే. మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ఓటు అనేది ఆయుధం. అటువంటి ఓట్లను సవరించే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. బీహార్లో అధ్యయనం చేసిన తరువాత మాత్రమే మిగతా రాష్ట్రాల్లో చేస్తున్నామని ఎలక్షన్ కమిషన్ చెబుతోంది. కానీ ఈ అధ్యయనం ఎవరు చేశారు? ఏ సంస్థ చేసింది? ఏమని నివేదిక ఇచ్చింది? అనే విషయాలను మాత్రం ఎలక్షన్ కమిషన్ బయట పెట్టడం లేదు. అందుకే ఇప్పుడు అందరిలోనూ అదే అనుమానం. దేశవ్యాప్తంగా సమాజం పట్ల అవగాహన ఉన్న పౌరులతో పాటు తటస్థులు, మేధావులు ఇదే విషయంపై ప్రశ్నిస్తున్నారు. కానీ ఎన్నికల కమిషన్ నుంచి ఆశించిన స్థాయిలో జవాబు రావడం లేదు.ఇప్పటికే ఎన్ డి ఏ పై ఒక అపవాదు ఉంది. ఈవీఎంల టెంపరింగ్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. దానిపై ఒక వైపు గలాటా నడుస్తుంటే.. కొత్తగా సమగ్ర సవరణ విషయంలో ఎన్నికల కమిషన్ ఎంత జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. రాజ్యాంగబద్ధమైన ఓ స్వతంత్ర సంస్థగా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎన్నికల కమిషన్ పై ఉంది. దానినే గుర్తు చేస్తున్నారు మేధావులు. ఆపై పౌర సమాజం. ఇక తేల్చుకోవాల్సింది ఎన్నికల కమిషన్ మాత్రమే.

# కాబోయే ప్రధాని ప్రియాంక గాంధి !...

**న్యూఢిల్లీ డిసెంబర్ 24:** వరుస ఓటములతో రాహుల్ గాంధీ పై కాంగ్రెస్ విశ్వాసం కోల్పోయిందని ఇప్పటికే బీజేపీ ఆరోపిస్తోంది కాగా, మంగళవారం రాబర్ట్ వాద్రా తన భార్య కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఎప్పటికైనా ప్రధాని అవుతుందన్న విశ్వాసం వ్యక్తం చేయడంతో తాజా చర్చకు తెరలేచింది. ఇందిరా గాంధీ మాదిరిగా పోలికలు ఉన్న ప్రియాంకను ప్రధానిగా చూడాలని చాలామంది కోరుకుంటున్నారని, ఇది కాలమే నిర్ణయించాలని రాబర్ట్ వాద్రా అన్నారు. ప్రియాంక తన నాన్నమ్మ మాదిరిగా బలమైన ప్రధానిగా నిరూపించుకుంటారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా రాబర్ట్ వాద్రా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.రాజకీయాల్లో ప్రియాంకకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ఈ దేశంలో క్షేత్రస్థాయిలో అవసరమైన మార్పులు తీసుకురాగలదని తాను భావిస్తున్నట్లు రాబర్ట్ వాద్రా పేర్కొన్నారు. ప్రియాంక తన బామ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ, సోనియా, సోదరుడు రాహుల్ గాంధీ నుంచి చాలా నేర్చుకుందని తాను భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలలో ఆమె గుర్తింపు పొందారు. ఆమె ఏం మాట్లాడినా గుండె లోతులనుంచి సూటిగా మాట్లాడుతుంది. ప్రజలు ఆమె మాటలను ఇష్టపడుతున్నారని వాద్రా అన్నారు

## హుస్నాబాద్ నియోజకవర్గం సమస్యలపై మంత్రి పొన్నం సమీక్ష



**హుస్నాబాద్:**విద్యా,వైద్య వ్యవసాయ, విద్యుత్ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్యుత్ సంబంధిత సమస్యలు, యాసంగి పంటల విధానం, యూరియా సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు,పాఠశాల మౌలిక వసతులు,మండలాల్లో మెడికల్ క్యాంపులు గ్రామాల్లో ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సమీక్షా సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, మెడికల్ ఆఫీసర్లు,ఏఈలు, ఎంపీఓలు, ఎంఈవో లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నట్టల నివారణతోనే పశు ఆరోగ్యం

**తెల్కపల్లి (స్కై న్యూస్ )24** జిల్లా వ్యాప్తంగా సామూహిక నట్టల నివారణ కార్యక్రమం,నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,నాగర్ కర్నూల్ జిల్లా లోని 11 లక్షల 25 వేల గొర్రెలు మేకలకు కడుపులోని నులిపురుగుల నిర్మూలనకు వాటి ఎదుగుదలకు దోహదం చేసే నట్టల మందు పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని చిన్న ముద్దునూర్ గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై రైతులు, పశుపోషకులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,??? ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచితంగా నిర్వహిస్తున్న ఈ సామూహిక లనట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నట్టల వల్ల పశువుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని, వాటి కారణంగా రక్తహీనత, బరువు తగ్గడం, పాల ఉత్పత్తి తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయని వివరించారు. రైతు ఆర్థికాభివృద్ధిలో పశు సంపద కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పశువులు



ఆరోగ్యంగా ఉన్నప్పుడే రైతు ఆదాయం పెరుగుతుందని, దాని ద్వారా కుటుంబ స్థాయిలోనే కాకుండా జిల్లా స్థాయిలో కూడా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అందువల్ల పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ సూచించారు.జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి మండలాల వారిగా 50 బృందాలుగా పశువైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు అన్ని గ్రామాల్లో తిరిగి గొర్రెలు, మేకలు సహా పశువులకు నట్టల మందులను త్రాగించనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ జీవాలకు నట్టల మందులను తప్పనిసరిగా త్రాగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.నట్టల నివారణ మందులు త్రాగించడం వల్ల పశువుల శరీరంలో ఉన్న అంతర్ పరాన్నజీవులు పూర్తిగా నశించి పశువులు ఆరోగ్యంగా మారుతాయని, దాంతో పాటు వాటి బరువు పెరగడం, పునరుత్పత్తి సామర్థ్యం మెరుగుపడటం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అదేవిధంగా పశువుల వ్యాధి నిరోధక శక్తి పెరిగి అంటువ్యాధుల బారిన పడకుండా రక్షణ లభిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.పశువుల ఆరోగ్య సంరక్షణలో లనట్టల నివారణ అత్యంత కీలకమని పేర్కొన్న కలెక్టర్, రైతులు నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత కాలంలో నట్టల నివారణ మందులు త్రాగించడం ద్వారా పశుసంపదను కాపాడుకోవాలని సూచించారు. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే రైతు జీవన ప్రమాణం మెరుగుపడుతుందని, వ్యవసాయం?పశుసంవర్ధక రంగాలు పరస్పర ఆధారంగా అభివృద్ధి చెందుతాయని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జ్ఞాన శేఖర్, , మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గొర్రెలు?మేకల పెంపకందారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నారాయణ హై స్కూల్ హస్తినాపురం రైతు కిసాన్ దినోత్సవం

**హైదరాబాద్: (స్కై న్యూస్) డిసెంబర్ 24** ఎల్బీనగర్ డివిజన్లో బి.యన్.రెడ్డి హస్తినాపురం, డిసెంబర్ 24, 2025దేశానికి రైతులు చేసిన అమూల్యమైన కృషిని గౌరవించేందుకు, డిసెంబర్ 24, 2025న హస్తినాపురంలోని నారాయణ హై స్కూల్ రైతు కిసాన్ దినోత్సవాన్ని ఎంతో గౌరవంగా మరియు ఉత్సాహంగా జరుపుకుంది.ప్రిన్సిపాల్ మేడమ్ లక్ష్మి శారద, మరియు అనిల్ , కోఆర్డినేటర్ గాయత్రి ,ఆర్ఐ రవి ప్రసాద్ , వైస్ ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి , ఎ.ఓ. రాజేష్ మరియు కరుణాకర్ , ఎ.జి.ఎం హేమంబర్ మరియు జి.ఎం గోపాలరెడ్డి . హాజరుతో ఈ కార్యక్రమం అలంకరించబడింది, వారు ఈ సందర్భంగా పాల్గొనడం వల్ల ఈ కార్యక్రమానికి గౌరవం మరియు ప్రేరణ లభించింది. ఈ కార్యక్రమం హృదయపూర్వక స్వాగతంతో ప్రారంభమైంది మరియు దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడంలో మరియు ఆహార భద్రతను నిర్ధారించడంలో రైతుల ప్రాముఖ్యతను హైలైట్ చేసింది.విద్యార్థులు ప్రసంగాలు, స్కిట్‌లు, పోస్టర్లు మరియు సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా వేడుకలో చురుకుగా పాల్గొన్నారు, రైతుల పట్ల కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేశారు మరియు వారి కృషి మరియు అంకితభావం గురించి






అవగాహన కల్పించారు. ప్రముఖులు సభను ఉద్దేశించి ప్రసంగించారు,రైతులను గౌరవించడం, వ్యవసాయ విలువలను అర్థం చేసుకోవడం మరియు గ్రామీణ సమాజాల పట్ల సానుభూతిని పెంపొందించుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.దేశానికి వెన్నెముకగా రైతుల పాత్రను గుర్తించి, వారి దైనందిన జీవితంలో కృతజ్ఞత, స్థిరత్వం మరియు బాధ్యత అనే విలువలను స్వీకరించడానికి ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను ప్రేరేపించారు. అధిపతి మహేశ్వరి మరియు ఇతర అధికారులు వ్యవసాయంలో ఆవిష్కరణలు మరియు విద్య మరియు సాంకేతికత ద్వారా రైతులకు మద్దతు ఇవ్వవలసిన అవసరం గురించి మాట్లాడారు.ఈ వేడుక స్ఫూర్తిదాయకమైన గమనికతో ముగిసింది, విద్యార్థులలో రైతుల పట్ల మరియు సమాజానికి వారి నిస్వార్థ సేవ పట్ల లోతైన ప్రశంసలను మిగిల్చింది. ఈ కార్యక్రమం యువ అభ్యాసకులలో గౌరవం, కృతజ్ఞత మరియు జాతీయ బాధ్యత యొక్క సందేశాన్ని విజయవంతంగా బలోపేతం చేసింది.

## సెయింట్ జోసెఫ్స్ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు




**చుంచుపల్లి డిసెంబర్24( స్కై న్యూస్):** చుంచుపల్లి మండలంలోని దన్ బాద్ పంచాయతిలో సెయింట్ జోసెఫ్స్ హై స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించబడింది ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రెవ్ ఫాదర్ బొల్లి కొండ జయరాజు ,ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి వైస్ ప్రిన్సిపల్ బ్రదర్ జెరోమియాస్ బ్రదర్ దయాబాన్ విచ్చేశారు.అనంతరం విద్యార్థిని విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.6 టు 10త్ తరగతులకు నిర్వహించిన క్రీడల్లో గొలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగాబహుమతులు అందజేశారు .ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి వైస్ ప్రిన్సిపల్ బ్రదర్ జెరోమియాస్ బ్రదర్ దయాబాన్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 24(స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు గద్వాల నియోజకవర్గం సంబంధించిన వివిధ గ్రామానికి , టౌన్ చెందిన ఆడపడుచులకు కళ్యాణి లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ చేతులమీదుగా లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరిగినది. ఆడపడుచులు లబ్ధిదారులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు లక్ష 116 రూపాయలు చెక్కులను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి , మాజీ జెడ్పిటిసి, సర్పంచ్ రాజశేఖర్ , మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ వాసు కె నాయకులు హనుమంతు రెడ్డి, ఫయాజ్, రామాంజనేయులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హెచ్ పి సి వేతనాలు ఇవ్వాలి






**కొత్తగూడెం డిసెంబర్ 24 (స్కై న్యూస్ ):** తెలంగాణ లో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హెచ్ పి సి వేతనాలు ఇవ్వాలని కోరుతూ సిఐఎల్ (కోల్ ఇండియా లిమిటెడ్)కలకత్తాలో వినతిపత్రం ఇచ్చిన ఐఎఫ్టియు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో పని చేస్తున్న 35,000 మంది కార్మికులకు కూడా హెచ్పిసి వేతనాలు ఇవ్వాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్ సి సి డబ్ల్యూ యు) ఆధ్వర్యంలో కలకత్తా సిఐఎల్ ఆఫీస్ నందు వినతిపత్రం సమర్పించడం జరిగింది.అనంతరం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏ వెంకన్న గోదావరి లయ బొగ్గు గాని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే సీతారామయ్యలు మాట్లాడుతూ తెలంగాణ సింగరేణిలో సిఐఎల్ ఇచ్చిన జీవోలను వేతనాలను సర్కిలర్ ని అమలు చేస్తున్న సింగరేణి యాజమాన్యం తెలంగాణ సింగరేణిలోని కాంటాక్ట్ కార్మికులకు హెచ్ పి సి వేతనాలను ఎందుకు అమలు చేయడం లేదొ కార్మికులకు చెప్పాలని వారు అన్నారు.2012 అక్టోబర్లో జరిగిన జె బి సి సి ఐ సమావేశంలో తీర్మానం చేసిన ఇప్పటివరకు సింగరేణి లో జే బి సీసీఐ వేతనాలు అమలు కావడం లేదని కనీసం సిఐఎల్ కూడా వాటి గురించి పట్టించుకోవడంలేదని తక్షణమే దీనిపై దృష్టి సారించి పెరిగిన ధరలకు అనుగుణంగా తమ జీవితాలను కోల్పోతున్న కార్మిక వర్గం కోసం తెలంగాణలో ప్రత్యేకంగా సింగరేణి విభాగం పై దృష్టి సారిస్తారని వారన్నారు.ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ సీనియర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం,జి ఎల్ బి కే ఎస్ రాష్ట్ర నాయకులు ఈ నరేష్,ఎస్సి సి డబ్ల్యు రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరావు యన్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి...

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 24( స్కై న్యూస్)** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహిళా సాధికారతకు నిరంతరం పనిచేస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని అందులో భాగంగానే ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని బిజెపి జిల్లా కార్యాలయ కార్యదర్శి చందు అన్నారు బుధవారం జిల్లా కేంద్రంలోని డీకేఆర్ వనజ హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీలో పథక లబ్ధిదారులకు ఉచితంగా సిలిండర్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మహిళలకు వంట చేసేందుకు ఇబ్బందులను తొలగించేందుకు ఉచితంగా ఎల్పిజి సిలిండర్ లను మంజూరు చేయడం జరుగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరు వాటికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నేటికి చాలా గ్రామాలలో మహిళలు కట్టెల పొయ్యి ద్వారా వంట పూర్తి చేస్తున్నారని దీని ద్వారా అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని గుర్తించి ప్రతి ఇంటికి ఉచితంగా సిలిండర్లను పంపిణీ చేసేందుకు 2016 మే 1న పథకాన్ని



ప్రారంభించి 10 కోట్లకు పైగా ఉచితంగా సిలిండర్లను దేశ వ్యాప్తంగా అందించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు ఎలిమే రాము పట్టణ పట్టణ ప్రధాన కార్యదర్శి బొట్టు శ్రీను తోపాటు నిర్వాహకులు మరియు సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు

## మల్లికార్జున్ సేవలు మరువలేనివి - డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్



**మహబూబ్ నగర్ డిసెంబర్ 24(స్కైన్యూస్)**మాజీ కేంద్రమంత్రి మల్లికార్జున్ జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం మల్లికార్జున్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక పద్మావతికాలనీలోగల మల్లికార్జున్ విగ్రహానికి, పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ మల్లికార్జున్ మెడికల్ కోర్సును అభ్యసించిన కాలంలోనే తొలిదశ తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రతరం చేశారని గుర్తు చేశారు. ఎంపీగా తనను ఆదరించిన జిల్లా అభివృద్ధి కోసం కేంద్రం నుంచి అనేక పథకాలు, నిధులు మంజూరు చేయించారని అన్నారు. కలెక్టర్ బంగ్లా సమీపంలోని ఫ్లేవర్ బ్రిడ్జి, వీరన్నపేట వద్ద టౌన్ రైల్వే స్టేషన్, దూరదర్శన్ రిలే కేంద్రం, రామన్పాడు తాగునీటి పథకం ఆయన హయాంలోనే మంజూరు అయ్యాయని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం ముందుకు సాగుదామని తెలిపారు. మల్లికార్జున్ సతీమణి భాగ్యలక్ష్మి కుమారుడు మను మాట్లాడుతూ హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ వద్ద మల్లికార్జున్ విగ్రహం పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నారాయణపేట డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ గౌడ్, నాయకులు చంద్రకుమార్ గౌడ్, జహీర్ అఖ్తర్, సీజే బెనహర్, గోపాల్ యాదవ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, షబ్బీర్, లింగం నాయక్, అవేజ్, అజ్మత్‌అలీ, ఆంజనేయులు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## క్లాస్ మెంట్ క్లబ్ అధ్యక్షులుగా నాగం చంద్రమోహన్ రెడ్డి...

**ప్రతినిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం**



**నాగర్ కర్నూల్ డిసెంబర్ 24 (స్కై న్యూస్)** విద్యార్థులకు మరియు పేదలకు సేవలు అందించేందుకు వాస రాఘవేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్లాస్మెంట్ క్లబ్ ఇకనుండి ప్రతినిత్యం ఏదో ఒక సేవా కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందించడం జరిగిందని క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ తెలిపారు బుధవారం జిల్లా కేంద్రంలోని ఐడియల్ మోడల్ పాఠశాలలో క్లబ్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు క్లబ్ జిల్లా అధ్యక్షులుగా నాగం చంద్రమోహన్ రెడ్డి కార్యదర్శిగా చిగుళ్లపల్లి రమణ కుమార్ కోశాధికారిగా ఎండీ ఖాజాలను ఎన్నుకున్నట్లు వివరించారు ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీని ఆయన అభినందించారు. ప్రతి సంవత్సరం లక్షలాది రూపాయలు దాతల సహకారంతో మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను మరియు పేద విద్యార్థులకు చేయూత లాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని రాష్ట్రవ్యాప్తంగా క్లాస్మేట్ క్లబ్ సేవలకు విస్తృతంగా ఆదరణ లభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు నాగం చంద్రమోహన్ కార్యదర్శి రమణ కుమార్ కోశాధికారి ఖాజాలు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో క్లాస్మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో సేవలు నిర్వహించేందుకు ముందుకు సాగుతామని వివరించారు. తమ ఎన్నికకు సహకరించిన క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు

## బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు ప్రాజెక్టును మాత్రం పదేళ్లపాటు పాతరేశారు

**తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 24:-** రంగారెడ్డి జిల్లాలోని షాద్నగర్ పట్టణ కేంద్రంలోతెలంగాణ జాగృతి సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టును బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు పాతరేశారని నేడు మొసలి కన్నీరు కారుస్తున్నారని జాగృతి నాయకులు మడిపడ్డారు. టిఆర్ఎస్ తెలంగాణ ఉద్యమ నినాదంలో నీళ్ళు, నిధులు, నియమకాలు అందులో నీళ్ల మొదటి అంశం, పదేళ్ల బీఆర్ఎస్ పాలన అనంతరం వెనక్కి తిరిగి చూస్తే దక్షిణ తెలంగాణకు గుండెకాయ వంటి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కేవలం ఒక రాజకీయ నినాదంగానే ఉండి పోయిందే తప్ప ఉమ్మడి పాలమూరు రంగారెడ్డి, జిల్లా ప్రజలకు పెద్దగా ఒనగూరింది ఏమి లేదు బీఆర్ఎస్ హయాంలోనే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలోనే పూర్తి చేశామని చెప్పుకొనే బిఆర్ఎస్ పాలమూరు ప్రాజెక్టును మాత్రం పదేళ్లపాటు పాతరేశారని వారు మండి పడ్డారు ఇప్పుడు నిద్రలేసిన బిఆర్ ఎస్ నాయకులు ఇప్పుడు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పై అవలంబిస్తున్న విధానం వల్ల 90 టీఎంసీల నుంచి 45 టీఎంసీలకు తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రల వల్ల జిల్లాల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుంది అని మొసలి కన్నీరు కారుస్తు రాజకీయ ఉనికికోసం మభ్యపెడుతున్నరని అన్నారు. బిఆర్ఎస్, బీజేపీతో ఉన్న స్నేహాన్ని కేవలం తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారే తప్ప, తెలంగాణ ప్రాజెక్ట్ కు అనుమతుల కోసం ఒత్తిడి చేయలేదని అన్నారుకేంద్రం పాలమూరు డీపీఆర్ ను వెనక్కి పంపిందంటే దానికి కారణం బిఆర్ఎస్,కాంగ్రెస్ ప్రభుత్వాల బాధ్యతారాహిత్యమని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ జాగృతి ఇంచార్జ్ చీమల రమేశ్, జాగృతి సీనియర్ నియోజకవర్గ నాయకులు చలసాని విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనలో ట్విస్ట్

**టిప్పర్ యజమాని ప్రధాన నిందితుడిగా తేల్చిన పోలీసులు**




నవంబర్ 3న జరిగిన టిపర్ ఆర్టీసీ బస్సు ఢీకొని 18 మంది మృతి చెందిన రోడ్డు ప్రమాద దుర్ఘటనలో ఓవర్ లోడే ప్రమాదానికి కారణమని పోలీసుల నిర్ధారణ చేశారు టిప్పర్ యజమాని లచ్చు నాయక్ పేరును తాజాగా ఎఫ్ఐఆర్ లో పోలీసులు చేర్చారని సమాచారం ఇచ్చిన పోలీసులు, ప్రమాద సమయంలో టిప్పర్ లోనే ఉన్న ఓనర్, ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్ మృతి చెందగా గాయాలతో ఓనర్ బయటపడ్డాడు.

వార్తాతరంగాలు

గురువారం 25 డిసెంబర్ 2025

## కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్,సహాయ న్యాయవా దులు గా నందు,కూర్మన్న



**నారాయణపేట డిసెంబర్ 24:( స్త్రైన్యూస్)** కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా జి.రఘువీర్ యాదవ్,సహాయ న్యాయవాదులు గా నందు నామాజీ , కర్మన్న గౌడ్ ను నియమిస్తూ కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖా ఉత్తర్వులు జారీ చేసింది.తనను కేంద్ర ప్రభుత్వం న్యాయవాదిగా ,సహాయ న్యాయవాదులు గా నియమించడానికి సహకరించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ .రామచందర్ రావు పార్లమెంట్ సభ్యురాలు, డీకే అరుణమ్మ రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామా జీ,రాష్ట్ర నాయకులు రతంగ్ పాండురెడ్డి,కొండయ్య, జిల్లా అధ్యక్షులు శ్రీ సత్యయాదవ్ లకు రఘువీర్,నందువనామా జీ, కుర్మన్న కృతజ్ఞతలు తెలిపారు.

## స్థానిక కృష్ణవేణి ఉన్నత పాఠశాల భాగ్యనగర్ కాలనీ నందు నేడు క్రిస్మస్ వేడుకలు



**రంగారెడ్డి జిల్లా స్త్రై న్యూస్, డిసెంబర్ 24:-** రంగారెడ్డి జిల్లాలోని షాద్నగర్ పట్టణంలో స్థానిక కృష్ణవేణి ఉన్నత పాఠశాల భాగ్యనగర్ కాలనీ నందు నేడు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారుఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు ఎంతో చక్కగా ఆనందంగా క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్నారు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీమతి రఫత్ సుల్తాన మాట్లాడుతూ క్రిస్మ స్ పండుగ యొక్క విశిష్టతను విద్యార్థిని విద్యార్థులకు తెలియపరచారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల చిన్నారులు సంతా క్లాషు మరియు వివిధ వేషధారణలతో పాఠశాల ఆవరణ మొత్తం క్రిస్మస్ వేడుకలతో సందడిగా. కనిపించింది. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు మరియు వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిట్స్ కు ఎంపికైన విద్యార్థులను ఆభినందించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



నిన్న గద్వాల బాలుర ప్రభుత్వ స్కూల్ లో జరిగిన 53వ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గద్వాలలోని విశ్వం అక్షర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలకు రాష్ట్ర స్థాయి ఎగ్జిబిట్స్ కు ఎంపికైయ్యాయి. ఈ రోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గారు జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన చుక్క లక్ష్మీప్రణీత, వంశిక విద్యార్థినిలను శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ..... విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశాలు ఉంటాయన్నారు. రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుక రావాలని ఆకాంక్షించారు. ??ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు శ్రీరాములు,విశ్వం అక్షర కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపాల్ ఎవి రత్నం, ఉపాధ్యాయుడు ఒసామా తదితరులు పాల్గొన్నారు.

## భీమ్ భరత్ ఆధ్వర్యంలోబిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి గ్రామ మాజీ సర్పంచ్ స్వర్ణలత సతీష్ కుమార్ బిఆర్ఎస్ గ్రామ యూత్ ప్రెసిడెంట్ కావాలి రమేష్ ముదిరాజ్ తో సహా గ్రామ నాయకులు దాదాపుగా 100 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు భీమ్ భరత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి ఈ సందర్భంగా రంగా రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టి యు ఎఫ్ ఐ డి సి చైర్మన్ చల్ల నరసింహా రెడ్డి వారికి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరుతున్నారని చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ అన్నారు

## కృష్ణవేణి ఉన్నత పాఠశాల గాంధీనగర్ బ్రాంచ్ లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు




**రంగారెడ్డి జిల్లా స్త్రై న్యూస్, డిసెంబర్ 24:-** రంగారెడ్డి జిల్లాలోని షాద్నగర్ పట్టణంలో కృష్ణవేణి ట్యాలెంట్ ఉన్నత పాఠశాల గాంధీనగర్ బ్రాంచ్ లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు కేక్ కట్ చేసి ఎంతో చక్కగా ఆనందంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకున్నారు, పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రిస్మ స్ పండుగ యొక్క విశిష్టతను విద్యార్థిని విద్యార్థులకు తెలియపరచారు ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల చిన్నారులు సంతా క్లాషు వివిధ వేషధారణలతో పాఠశాల ఆవరణ మొత్తం క్రిస్మస్ వేడుకలతో సందడిగా కనిపించింది కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గిరిజన సాంప్రదాయాలు ఉట్టిపడేలా మ్యూజియం...

### గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు పిల్లలు నేర్చుకోవాలి






**భద్రాచలం డిసెంబర్ 24( స్త్రై న్యూస్):**నేటి తరం బాల బాలికలకు చదువుతోపాటు విజ్ఞానాన్ని వినోదాన్ని పంచడానికి తాతల కాలంలో ఆచరించిన గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, పాతకాలపు వస్తువులను గిరిజన మ్యూజియంలో పొందుపరచడంతో విద్యార్థినీ విద్యార్థులకు ఆకర్షణీయంగా ఉండడంతో పాటు పాతకాలపు గిరిజనుల సంస్కృతి తెలుసుకునే అవకాశం ఉంటుందని పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల భద్రాచలం కోమల హై స్కూల్ ప్రిన్సిపాల్ లు డాక్టర్ బి ఝాన్సీ రాణి, పలివెల రవికుమార్ అన్నారు.బుధవారం నాడు ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను భద్రాచలంలోని కోమల హైస్కూల్, పాల్వంచలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల బాల బాలికలు 550 మంది 12 మంది ఉపాధ్యాయునీలు సందర్శించి మ్యూజియంలో పొందుపరిచిన గిరిజనుల అన్ని కళాఖండాలను క్షుప్తంగా తిలకించి చిన్నపిల్లలు సరదాగా మ్యూజియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రీడాస్థలంలో ఆటలు ఆడుకున్న అనంతరం ప్రిన్సిపాల్లు మాట్లాడుతూ అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు నేటితరం బాల బాలికలకు తెలిసే విధంగా కళాఖండాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటి యొక్క చరిత్రను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా తెలుగులో ముద్రించి ప్రదర్శించడం వలన విద్యార్థులకు పూర్తిస్థాయి లో అవగతమైందని, మ్యూజియంలో మాత్రం గిరిజనులకు సంబంధించిన స్పష్టమైన సమాచారం విద్యార్థులకు తెలిసే విధంగా మ్యూజియం నిర్వహకులు ప్రతి అంశం తెలియజేయడం చాలా బాగుందని అన్నారు. పాఠశాల, కళాశాలలకు మ్యూజియం సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా అవకాశం కల్పించి విద్యార్థిని, విద్యార్థులకు ఆటవీడుపుగా ఇటువంటి సందేశాలు ఉన్న గిరిజన కళాఖండాలు చూపెట్టడం వలన వారిలో మేధాశక్తి పెరిగి గిరిజన సంస్కృతి సాంప్రదాయాల గురించి పూర్తిస్థాయిలో తెలుసు కుంటారని అలాగే పాతతరం గిరిజనులు వాడే పనిముట్లు, ఆదివాసి గిరిజనుల సంస్కృతి భాష గిరిజనుల వేషధారణ కనుమరుగు కాకుండా కోయ భాషను పి ఓ రాహుల్ నేర్చుకొని భాష యొక్క అంతర్యాన్ని గిరిజనులు మరిచిపోకుండా అందరూ ఆచరించే విధంగా ఆయన చేస్తున్న కృషికి మా పాఠశాల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు.అలాగే మ్యూజియం ప్రాంగణంలో చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన బోటింగ్ పాయింట్, సెల్ఫీ పాయింటు, పాతకాలపు ఇండ్లు చూడముచ్చటగా ఉన్నాయని, చిన్నపిల్లల కోసం ఏర్పాటుచేసిన క్రీడాస్థలం చాలా బాగుందని అన్నారు.ఈ కార్యక్రమంలో లెక్చరర్లు సంధ్యారాణి, ప్రసన్న, పావని, రమాదేవి, వీణ, ఉపాధ్యాయినీలు వరలక్ష్మి, రేవతి, మోహిని, ఊర్మిళ, స్వప్న ప్రియ, నాగమణి మ్యూజియం నిర్వహకులు వీరాస్వామి, మాధవి, చలపతిరావు విద్యార్థినీ విద్యార్థులు, బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సేవా సమితి ఉచిత వృత్తి శిక్షణ తరగతులుప్రారంభించిన కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవ సమితి అధ్యక్షురాలు జి. మధుర వాణి





**సింగరేణి డిసెంబర్ 24 (స్త్రై న్యూస్ ):** బుధవారం న సి.ఈ.ఆర్ క్లబ్ నందు కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్, గౌతమ్ పూర్ రామవరం సేవా సభ్యులతో జ్యూట్ బ్యాగ్ తయారీ ఉచిత వృత్తి శిక్షణ కొరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం ఎం.ఎస్.ఎం.ఈ సహకారంతో సింగరేణి కొత్తగూడెం ఏరియా నందు ఉచిత జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణ కోర్సులను ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగింది.ఈ జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణ ఆరువారాల పాటు ఉంటుందాన్ని ఈ శిక్షణకు ఎం.ఎస్.ఎం సంస్థ నందు శిక్షణ ప్రావీణ్యం కలిగిన ముగ్గురు ట్రైలర్స్ తో ఆసక్తి కలిగి దరఖాస్తు చేసుకున్న మహిళలందరికీ ఈ శిక్షణను నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎం.ఎస్.ఎం.ఈ (మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్) సంస్థ నుండి అసిస్టెంట్ డైరెక్టర్, దినేష్ వాషిస్ట్ బి. వరలక్ష్మి, బి. స్వప్న, వి. మాధురి ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.అనంతరం సేవా అధ్యక్షురాలు ఈ ఆర్థిక సంవత్సరం లో ఇతర వృత్తి శిక్షణ తరగతులు (టైలరింగ్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్) కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవ సమితి అధ్యక్షురాలు శ్రీమతి ఎం. మధుర వాణి షాలెం రాజు ప్రారంభించడం జరిగింది. ముందుగా కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలకు సేవా సెక్రటరీ వై. అనిత పుష్పగుచ్చంతో ఆహ్వానం పలికినారు. తదనంతరం సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. సింగరేణి సేవా సమితి ద్వారా ఈ ఉచిత వృత్తి శిక్షణ తరగతులకు హాజరై నిరుద్యోగ మహిళలు గృహిణులు వారి కుటుంబాలకు ఆర్థిక లబ్ధిని చేకూర్చాలన్నారు వారు ఈ శిక్షణ తరగతులకు శ్రద్ధగా హాజరై నేర్చుకోవాలని ఇతరులకు నేర్పించాలన్నారు.సింగరేణి సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధిని శిక్షణను పొంది ఆర్థిక లబ్ధిని పొందవలసిందిగా సేవా సభ్యులకు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా అధ్యక్షురాలు శ్రీమతి జి. మధుర వాణి తో పాటు ఎజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, ఎం.ఎస్.ఎం.ఈ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్, దినేష్ వాషిస్ట్ బి. వరలక్ష్మి, బి. స్వప్న, వి. మాధురి, సేవా సెక్రటరీ వై. అనిత, సీనియర్ పిఓ. మజ్జి. మురళి, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ సిహెచ్. సాగర్, శిక్షణ తరగతులు ఇచ్చు ఫ్యాకల్టీ ఇతర సేవ సభ్యులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ పట్టణ చౌరస్తాలో

# రోడ్డు విస్తరణ పనులు చేయాలి..

### ప్లకార్డులతో చౌరస్తాపై ఆర్.ఎన్ రాము వినూత్న నిరసన..



**రంగారెడ్డి జిల్లా స్త్రై న్యూస్ డిసెంబర్ 24:-**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ చౌరస్తాలో ఆర్.ఎన్ రాము వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు చౌరస్తాను విస్తరణ చేయండి మహాప్రభో, కాపాడండి మా ప్రాణాలను అంటూ ప్లకార్డులను ప్రదర్శించి అధికారుల నిర్లక్ష్యాన్ని నిలదీశాడు గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోయాయని, ఇటీవల పట్టణానికి చెందిన తండ్రి కూతుర్లు మచ్చేందర్, మైత్రిలు గత జులై 26న నడి చౌరస్తాపై దిక్కులేని చావు చచ్చారని ఇంకా ఎంతోమంది ప్రాణాలు పోయాయని కొంతమందికి క్షతగాత్రులై అంగ వికలాంగులు అయ్యారని ఇంత జరుగుతున్న స్థానిక మున్సిపాలిటీ ఇతర శాఖల అధికారులు ఏమాత్రం ప్రతిస్పందించడం లేదని ఆర్.ఎన్ రాము ఆవేదన చెందారు. గతంలో స్థానిక మున్సిపాలిటీలో అదేవిధంగా ఆర్డీవో కార్యాలయంలో, తాహసిల్దార్ కార్యాలయంలో, అదేవిధంగా మునిసిపల్ రాష్ట్ర కార్యాలయంలో ఉన్నత అధికారికి సైతం లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తను ఆయా కార్యాలయాల్లో ఫిర్యాదు చేసిన సమయంలో చౌరస్తా విస్తరణకు ఇంకా ఎంత సమయం పడుతుంది అని ప్రశ్నిస్తే సరైన సమాధానం రావడంలేదని రాము ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బి కార్యాలయంలో అధికారులను ప్రశ్నిస్తే అది మాకు సంబంధం లేదు మున్సిపల్ కార్యాలయంలో పెండింగ్లో ఉందని అక్కడ అడగాలని చెబుతున్నారని తాను మున్సిపల్ కార్యాలయంలో అధికారిని అడిగితే విస్తరణ పనులపై కేసు ఉందని చెబుతున్నారని కేసు వివరాలను వెల్లడించమని తాను కోరుతున్న పట్టించుకోవడంలేదని తెలిపారు. ముఖ్యంగా కేసు వివరాలు తమకు ఇస్తే న్యాయస్థానంలో జడ్జిని ప్రాధేయపడిన రోడ్డు విస్తరణకు న్యాయం చేయమని కోరుతామని తమ వివరాలు అందించాలని రాము ఆందోళన వ్యక్తం చేశారు ఇది ఇలాగే నిర్లక్ష్యం కొనసాగితే మున్సిపల్ కార్యాలయం ముందు తాను త్వరలోనే బట్టలు విప్పి మరి తన నిరసన తెలియజేస్తానని హెచ్చరించారు. అంతేకాదు తన ఈ పోరాటం ఆగదని పెద్ద ఎత్తున పోరాటం చేస్తానని పాలకులను అధికారులను రాము హెచ్చరించారు.

## టెక్నాలజీతో పోలీసింగ్‌కు బలం మెగా రివార్డు మేళాలో జిల్లా సిబ్బందికి పురస్కారాలు



**నారాయణపేట డిసెంబర్ 24:( స్త్రైన్యూస్)**పోలీస్ శాఖలో టెక్నాలజీ వినియోగాన్ని మరింత బలోపేతం చేస్తూ, సమర్థవం తమైన సేవలందిస్తున్న సిబ్బందిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో హైదరాబాద్ లకిడి కాపూల్‌లోని డీజీపీ కార్యాల యంలో మంగళవారం నిర్వహించిన మెగా రివార్డు మేళా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ (టెక్నికల్ సర్వీసెస్) వివి. శ్రీనివాస రావు చేతులమీదుగా నారాయణపేట జిల్లా పోలీస్ విభాగానికి చెందిన టెక్నికల్ సిబ్బందికి రివార్డులు అంద జేయడం జరిగింది. నారాయ ణపేట జిల్లాలో ఐటీ సెల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ సీసీటీఎన్ఎస్, ఆన్‌లైన్ డేటా అప్డేషన్లలో విశేష ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ టీమ్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, సభ్యులు మహేష్, అలాగే టెక్ టీమ్ సభ్యులు నీలయ్య గౌడ్ మాగనూర్ పోలీస్ స్టేషన్, వినయ్ కుమార్, ధన్వాడ పోలీస్ స్టేషన్ లకు చెందిన కానిస్టేబుల్ లను ఈ సందర్భంగా ప్రత్యేక రివార్డులు అందజేశారు.సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్ వ్యవస్థలో డేటా ఖచ్చితత్వం, వేగవంతమైన అప్డేషన్, సాంకేతిక సమస్యల పరిష్కారంలో వీరి పనితీరు అత్యంత ప్రశంసనీయం కావడంతో ఈ గుర్తింపు లభించిందని అధికారులు పేర్కొన్నారు.డిజిటల్ పోలీసింగ్ దిశగా నారాయ ణపేట జిల్లా పోలీస్ విభాగం చూపిస్తున్న కృషి ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలు స్తోందని, టెక్నాలజీని సమ ర్థంగా వినియోగించినప్పుడు ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని ఈ రివా ర్డులు స్పష్టంగా చాటిచెబు తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ రివార్డు పొందిన సిబ్బందిని హృదయ పూర్వకంగా అభినందిస్తూ, ఇలాంటి కృషి నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షిం చారు. అలాగే ఇలాంటి గుర్తింపులు సిబ్బందిలో ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా, పోలీస్ శాఖ ఆధునీకరణకు మరింత ఊతమిస్తాయని తెలిపారు.

# ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 24(స్కై న్యూస్):**బ్యాంకింగ్ లావాదేవీలను సమర్థవంతంగా నిర్వహించుకోవడానికి, తాము కృషి చేస్తున్న రంగాల్లో ప్రగతి సాధించేందుకు ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. ఫైనాన్షియల్ రంగంలో క్లెయిమ్ చేయని ఆస్తులను సమర్థవంతంగా మరియు త్వరగా పరిష్కరించడానికి ఉద్దేశించిన మీ డబ్బు మీ హక్కు కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం గద్వాల ఐడిఓసి మీటింగ్ హాల్లో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్లు, ఇంతకంటే ఎక్కువ సంవత్సరాలుగా వివిధ బ్యాంకుల్లో, ఇన్సూరెన్స్, తదితర కంపెనీల్లో ఖాతాదారులకు సంబంధించిన క్లెయిమ్ చేయబడకుండా ఉండిపోయిన డిపాజిట్లను తిరిగి పొందేందుకు, ఆయా ఖాతాలను మళ్లీ పునరుద్ధరించుకోవడానికి ఈ కార్యక్రమం సువర్ణ అవకాశంగా కలెక్టర్ పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో సుమారు లక్షకు పైగా ఖాతాలకు చెందిన రూ. 16.39 కోట్ల క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఉన్నాయని, వీటిని తిరిగి చెల్లించేందుకు ఆర్.బి.ఐ అధికారులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో సాధారణ ప్రజలతోపాటు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఖాతాలు కూడా ఉండడంతో ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



మొదట బ్యాంకుల్లో అత్యధిక డిపాజిట్లు కలిగిన 1000 మంది ఖాతాదారులను గుర్తించి వారు తమ డబ్బులను క్లెయిమ్ చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. తర్వాత మిగతా ఖాతాదారులకు అవగాహన కలిగించి తమ డిపాజిట్లను తిరిగి పొందేలా బ్యాంకింగ్ అధికారులు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. వినియోగంలో లేని ఖాతాల పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఉద్గం పోర్టల్ సహకరిస్తుందన్నారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతుండడంతో బ్యాంకు ఖాతాలు కలిగిన ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల ఫోన్లకు సైబర్ నేరాలకు పాల్పడే వాళ్ళు తాము బ్యాంకుల నుంచి మాట్లాడుతున్నామని వివిధ లింకులు పంపించి, ఖాతాలకు సంబంధించిన వివరాలు అడుగుతూ ఓటీపీలు చెప్పాలని మోసం చేస్తుంటారనీ, ఈ విషయంలో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ బ్యాంకు అధికారులు కూడా ఇలా అడగరని ప్రతి ఖాతాదారుడు తెలుసుకుంటే సైబర్ నేరాల ఉచ్చులో చిక్కుకోకుండా జాగ్రత్త పడవచ్చు అన్నారు. ఖాతాదారులు నిర్దేశిత సమయంలోగా ఈ కేవైసీ అప్డేట్ చేసుకోవాలని, బ్యాంకులకు సంబంధించిన యాప్ల ద్వారానే నగదు బదిలీలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనవసరంగా ఎక్కువ బ్యాంకుల్లో ఖాతాలు ఉంచుకోవడం సరికాదని, అవసరంలేని ఖాతాలను క్లోజ్ చేసుకోవడం మంచిదన్నారు. ఈ సందర్భంగా ఇటీవల క్లెయిమ్ చేసుకున్న పలువురు ఖాతాదారులకు ప్రొసీడింగ్ కాపీలను కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం పై ముద్రించిన కరదీపికలను కలెక్టర్ బ్యాంకింగ్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్బిఐ జనరల్ మేనేజర్ సుప్రభాత్, యుబిఐ జోనల్ హెడ్ అరవింద్ కుమార్, డీజీఎం సత్యనారాయణ, నాబార్డ్ డిడిఎం మనోహర్ రెడ్డి, ఎల్డిఎం శ్రీనివాసరావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, భీమా రంగ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 27న అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 24( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని సీతారామస్వామి ఆలయం లో ఈనెల 27న అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు గ్రామ గ్రామం నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆకాంక్షించారు. కళ్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని వారు అధికారులను కోరారు. లక్ష్మీ నరసింహస్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండేవిధంగా కళ్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు



# విధినిర్వహణలో ఉద్యోగుల పాత్ర మరువలేనిది

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 24( స్కై న్యూస్)** జిల్లాలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ అన్నారు బుధవారం టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు జిల్లా కలెక్టర్ ను సన్మానించారు అనంతరం 2026 నూతన సంవత్సర క్యాలెండర్ను ఆయన ఆవిష్కరించారు ఈ సందర్భంగా భావండ్ల వెంకటేష్ మాట్లాడుతూ అధికారుల సహాయ సహకారాలతో అటు ఎన్నికలను ఇటు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల హక్కులను కాపాడుతూ బాధ్యతలను కూడా గుర్తించి పని చేయడం వల్లే జిల్లాకు మంచి పేరు లభిస్తుందని అందుకు జిల్లా ఉన్నతాధికారుల సహాయ సహకారాలు కూడా ఎంతో కీలకమన్నారు ఈ కార్యక్రమంలో



టీఎన్జీవో కార్యదర్శి ఎం డి షర్ఫుద్దీన్ కోశాధికారి బాలరాజు ఉపాధ్యక్షులు అరుణాదేవి సంయుక్త కార్యదర్శి శివరత్న అలివేలు శ్రీనివాసులు అమరేశ్వర రావు ఆర్గనైజింగ్ కార్యదర్శులు శ్రీరామ్ అరుణ నగర్ కర్నూల్ యూనిట్ అధ్యక్షులు నసీరుద్దీన్ కార్యదర్శి మల్లిపెద్ది సురేష్ కుమార్



కోశాధికారి యాదగిరి కొల్లాపూర్ యూత్ అధ్యక్షులు వెంకటేష్ కల్వకుర్తి యూనిట్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ బిజినపల్లి యూనిట్ అధ్యక్షులు కళ్యాణకృష్ణ తో పాటు నాయకులు ఖాజా మహిమద్దీన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఉచిత కోచింగ్ సెంటర్





**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 24 (స్కై న్యూస్):**విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గద్వాల లోని టి.జి.బి.సి స్టడీ సర్కిల్ నందు ఉచిత కోచింగ్ యొక్క దరఖాస్తు తేదీని 11- 01- 2026 కు పొడిగించినట్లు టి.జి.బి.సి స్టడీ సర్కిల్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్యతో పాటు స్కాలర్ షిప్ పొందేందుకు ఎఇఓ శిక్షణ మరియు ఇంగ్లీష్ లో మంచి ప్రావీణ్యం పొందుటకు డిగ్రీ పూర్తి చేసిన వారు లేదా డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ః.అ. నిరుద్యోగ యువతి,యువకులు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు _Dbx‹_;³yxÜrxle.xDD.Dú\.తిని వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరములకు ఫోన్ నెంబర్ 9985434941, 08546-293022 సంప్రదించాలని కోరారు.

# కోటకొండ సమస్యలు పరిష్కరించండి...

**ఎంపీ డీకే అరుణకు బిజెపి నాయకుల వినతి**



**నారాయణపేట డిసెంబర్ 24: (స్కై న్యూస్)** నారాయణపేట మండలంకోట కొండ గ్రామ సమస్యలను పరిష్కరించాలని బిజెపి నాయకులు గ్రామ ప్రజల తరపున మంగళవారం నారాయణపేట కు వచ్చిన పాలమూరు ఎంపి.డి కే.అరుణకు వినతి పత్రం సమర్పించారు. కోట కొండ డబుల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయించాలని, కోట కొండను మండలం గా ప్రకటించాలని,బీసీ గురుకుల పాఠశాలకు నూతన భవనం వెంటనే నిర్మించాలని, గ్రామం లో సి సి రోడ్ల నిర్మాణం చేపట్టాలని, గ్రామంలో ఐమాక్స్ లైట్ ఏర్పాటు చేయాలని,బి ఎస్ ఎన్ ఎల్ టవర్ ను పునరుదరించాలని విన్నవించారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు పగడాకుల శ్రీనివాసులు , జిల్లా ఉపాధ్యక్షులు కెంచే శ్రీనివాసులు , గ్రామ ఉపసర్పంచ్ చేనప్ప యాదవ్ , బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాక ప్రవీణ్ కుమార్ , బి జె వై ఎం మండల నాయకులు వేపర్ రవి, బొక్కి బాలరాజ్ , ఉట్కూరు సంతోష్ గ్రామ వార్డు మెంబెర్స్ గాజుల భగవాన్ శంకర్ , ఎల్లనోల్ల రామ కృష్ణ , కావాలి నర్సింలు , కమ్మరి మహేష్ , అంగాడెలి పరశురామ్ , సాక అనిత , ఈగలి స్వప్న వెంకటేష్ మరియు నాగేష్ యాదవ్, మంగలి సత్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## మాదాసి కురుమలను ఎస్సీ ల్లో చేర్చాలి

**నారాయణపేట డిసెంబర్ 24:** (స్కైన్యూస్)కురుమ మాదాసి లను ఎస్సీ జాబితాలో చేర్చాలని పాలమూరు ఎంపి డి కే అరుణ కు నారాయణపేట మండలం బైరంకొండ కురుమలు వినతి పత్రం అందజేశారు. నారాయణ పేట జిల్లా లోని , మండలం లోని కురు మాలను ఎస్సీ లొ చేర్చి



అందరికీ ఎస్సీ కుల ధృవ పత్రం ఇచ్చే విధంగా ప్రభుత్వానికి తెలియజే యాలని కోరారు. ఇప్పటికే దేశం లోని పలు రాష్ట్రాల్లో ఇస్తున్నారని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది అని, తెలిపా రు ఇట్టి కార్యక్రమంలోజిల్లా నాయకులు శంకరోల రవి, జిల్లా నాయకులు ఆశ ప్ప,ముఖాల రవి,నర్సింలు, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లల్లోకి చేరి కలకలం సృష్టిస్తున్న పాములు

**చాకచక్యంగా బంధిస్తున్న ప్రాణధార ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్**

**కొత్తగూడెం డిసెంబర్ 24 (స్కై న్యూస్ ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ఇళ్లలో చేరి పాము కలకలం సృష్టించిన సందర్భంలో ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ హెల్ప్ లైన్ కు ఫోన్ చేయగా ఫోన్లో వారికి తగు సూచన చేస్తూ వెంటనే చేరుకొని సురక్షితంగా సర్పాలను బంధించి వాటిని బుధవారం జిల్లా ఫారెస్ట్ ఆఫీస్ ఎ ఓ మూర్తి సమక్షంలో, పట్టిన పాముల వివరాలు నమోదు చేసి అనంతరం అటవీ ప్రాంతంలో విడుదల చేశారు. ప్రాణధార ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ తో పాటు రెస్క్యూ ట్రైనీ సభ్యుడు శ్రీకాంత్ (చోటు). ఈ సందర్భంగా పాములు ఇళ్లలోకి ప్రవేశిస్తే వాటినే గమనిస్తూ సమాచారం ఇవ్వాలని భయం అవసరం లేదని, ఈ కాలంలో



రాత్రులు జాగ్రత్తగా ఉండాలని పరిసరాలు శుభ్రంగా



ఉండాలని సంతోష్ తెలిపారు.

# మాజీ జర్నలిస్టు రవి అకాల మరణం పట్ల వారి కుటుంబాన్ని పరామర్శించిన షాద్ నగర్ జర్నలిస్టులు

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, డిసెంబర్ 25:-** రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ పట్టణంలో మాజీ జర్నలిస్ట్ రవి అకాల మరణం పట్ల వారి కుటుంబాన్ని పరామర్శించిన షాద్ నగర్ జర్నలిస్టులు, రవి అకాల మరణంతో వారి కుటుంబంలో విషాదఛాయలు కొమ్ముకున్నాయి ఈ సందర్భంగా షాద్ నగర్ జర్నలిస్టులు రవి కుటుంబాన్ని పరామర్శించారు ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ ఖాజా పాషా (కెపి) రవి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం సీనియర్ జర్నలిస్టు కాజా పాషా మాట్లాడుతూ విలువలు కలిగిన పాత్రికేయులలో మాజీ జర్నలిస్టు రవి పేరు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు రవి కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన



పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు జాకీర్, రంగనాథ్, నరసింహారెడ్డి, సాక్షి శ్రీశైలం, ప్రవీణ్ యాదవ్,



టిఎన్జీవో నాయకులు ఎం. వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## నట్టల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

**మండల పశువైద్యాధికారి డాక్టర్ కల్పన**

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 24 (స్కైన్యూస్)** మూగజీవాలకు నట్టల వ్యాధి నివారణకు ఉచితంగా ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుందని రైతులు వాటిని పశు వులకు ఇప్పించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ కల్పన కోరారు బుధవారం మండల పరిధిలోని గగ్గలపల్లి గ్రామంలో శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికై



బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ ఉషారాణి తో పాటు ఉపసర్పంచ్ వార్డు సభ్యులను సన్మానించారు అనంతరం మేకలు మరియు పశువులకు టీకాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూగజీవాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు టీకాలు ఎంతో దోహదం చేస్తాయని ప్రతి రైతు మూగజీవాలకు నట్టల నివారణ వ్యాధి టీకాలను వేయించాలని ఆమె కోరారు

## మానవ సేవయే మాధవ సేవచీకటి తొలగించి కంటికి వెలుగునిచ్చి, ఔదార్యం

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఫిక్ అహ్మద్ పటేల్**

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ డిసెంబర్ 24:**-రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లోని కేశంపేట మండలం సంతాపూర్ గ్రామానికి చెందిన నాగుల చంద్రయ్య అనే నిరుపేద వ్యక్తి అందత్వ సమస్యతో జీవితం చీకటిగా మారుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఫీ అహ్మద్ పటేల్ నేనున్నానంటూ ఆపన్న హస్తంతో ముందుకు





వచ్చి చేయూతనిచ్చారు. తన సొంత ఖర్చులతో కంటి వెలుగును పంచారు, హైదరాబాదులోని సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో నాగుల చంద్రయ్యకు రఫీఖ్ అహ్మద్ పటేల్ తన సొంత ఖర్చులతో కంటి ఆపరేషన్ చేయించి ఔదార్యం చాటారు ఈ సందర్భంగా నాగుల చంద్రయ్య కుటుంబ సభ్యులు ఆయనకు అభినందించి ధన్యవాదాలు తెలిపారు.

# ఐటి ఉద్యోగులకు ఏఐ ఎసరు


ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఊడ్చేస్తోంది. ఒకప్పుడు తిరుగులేని ఉద్యోగ రంగంగా ఉన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగంలో కొలువు. ఈ రోజుల్లో గాల్లో దీపంలా మారింది. గతంలో ఓ ఉద్యోగిని తొలగించారంటే ఎన్నో కారణాలు ఉండేవి. ఈ ఏడాది ఎఐ కారణంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు లక్షన్నర ఉద్యోగాలు పోయినట్లు అంతర్జాతీయ గణాంకాలు చెబుతుండగా, వీటిలో నూటికి 90 టెక్ ఉద్యోగాలే కావటం గమనార్హం. ఇలా ఉద్యోగాలు పీకేసిన సంస్థల్లో టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి కంపెనీలుండటం గమనార్హం. వీటిలో ఒక్క టిసిఎస్ సుమారు 20 వేల ఉద్యోగులను ఇంటికి పంపింది. గతంలో ఎవరి ఉద్యోగమైనా పోతే.. అనేక కారణాలుండేవి. కానీ, ప్రస్తుతం ఏ టెక్ సంస్థ అయినా లేఆఫ్ ప్రకటించిందంటే దానికి ఎఐ ప్రభావమే కారణమవుతోంది. ఈ నేపథ్యంలో టెక్ రంగంలోని ఉద్యోగులు తీవ్రమైన మానసిక ఒత్తిళ్ల మధ్య పనిచేయాల్సి వస్తోంది. ఏ రోజుకారోజు దినదిన గండం.. నూరేళ్ల ఆయుష్షుఅన్నట్లుగా వారు భయభయంగా ఉద్యోగాలు చేస్తున్నారు. రాబోయే ఐదేండ్లలో తమ ఉద్యోగులను పెద్దమొత్తంలో తొలగించనున్నట్టు 41% కంపెనీలు పేర్కొన్నట్టు వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్) ఇటీవల ఒక నివేదికలో వెల్లడించింది. ప్రధాన రంగాల్లోకి ఎఐ ప్రవేశించడమే దీనికి కారణంగా వివరించింది. అమెజాన్ ఎఐలో భారీ పెట్టుబడులు పెడుతోంది. 2025 నాటికి ఎఐ మెషిన్ లెర్నింగ్‌లో సుమారు ఎనిమిదిన్నర లక్షల కోట్లు ఖర్చు చేయడానికి కంపెనీ సిద్ధంగా ఉందని ప్రకటించింది. ఈ పెట్టుబడులతో, సంస్థలోని హై-పెయిడ్ వైట్-కాలర్ ఉద్యోగులను ఎఐద్వారా భర్తీచేయాలని అమెజాన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఇప్పుడు విస్తృత చర్చకు దారితీస్తోంది. అమెజాన్ లేఆఫ్‌ల ప్రత్యక్ష ప్రభావం భారతదేశంపై పెద్దగా ఉండకపోవచ్చు. కానీ ఇతర బహుళజాతి కంపెనీలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయనేది ప్రశ్నార్థకంగా మారింది. బెంగళూరు, చెన్నై, పుణె, హైదరాబాద్‌లోని అవుట్‌సోర్సింగ్ హబ్‌లు ఇప్పటికే ఎఐ నుండి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. చాలా వరకు ఐటి కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఉద్యోగులకు శిక్షణ కూడా ఇస్తున్నాయి. రానున్న రోజుల్లో దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం అవుతున్నాయి. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, క్రౌడ్ స్ట్రైక్, ఐబిఎం వంటి పెద్ద కంపెనీలు సుమారు 70,000 మంది ఉద్యోగులను తొలగించారు. మైక్రోసాఫ్ట్ లాభదాయకతను పెంచుకోవడం, ఎఐ, డేటా సెంటర్లలో భారీ పెట్టుబడుల కోసం ఉద్యోగులను తొలగిస్తోంది. ఐబిఎం హెచ్‌ఆర్ కార్యకలాపాలలో ఎఐ వ్యవస్థలను విస్తృతంగా ప్రవేశపెట్టి 8 వేల మంది ఉద్యోగులను తగ్గించింది. అమెరికా టెక్ దిగ్గజాలు




భారతదేశంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను కలిగి ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సేల్స్, సపోర్ట్ వంటి విభాగాల్లో భారతీయ నిపుణులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ లేఆఫ్‌లు భారతీయ ఉద్యోగులపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం చూపుతాయి. ఐటి రంగంలో ఇప్పుడు ఆటోమేషన్, ఎఐ టెక్నాలజీలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ టెక్నాలజీల పుణ్యమా అని పునరావృత పనుల్లో ఉద్యోగుల అవసరం లేకుండాపోతోంది. మిగతా పనుల్లోనూ ఐటి కంపెనీలు ఎఐని విరివిగా ఉపయోగిస్తున్నాయి. అందుకోసం ఉన్న ఉద్యోగులకే కొత్త డిజిటల్ టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి వినియోగించుకుంటున్నాయి. ఆ టెక్నాలజీలపై పట్టు సాధించలేని ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ఐటి ఉద్యోగులకు ఎఐ ఒక పెద్ద సవాలుగా మారింది. పొదుపు చర్యలు, పెరుగుతున్న నైపుణ్య అవసరాలు, ఆటోమేషన్, ఎఐ అడాప్టేషన్ ఒత్తిళ్లతో ఉద్యోగ ప్రపంచం తలకిందులవుతోంది. ఉద్యోగం ఉంటుందా, ఊడుతుందా అనే టెన్షన్‌తో టెకీలు ఆందోళన చెందుతున్నారు. ఇఎంఐలు ఎలా కట్టాలి? మరో ఉద్యోగం ఎప్పుడు వస్తుంది అనే ప్రశ్నలు వారిని వెంటాడుతున్నాయి. కంపెనీలు వ్యయం తగ్గింపు, నష్టాల నియంత్రణ వంటి కారణాలకు బదులు, ఇప్పుడు సంస్థ పునర్నిర్మాణం, పురోగతి, వర్క్‌ఫోర్స్ ఆప్టిమైజేషన్ వంటి పదాలను ఉపయోగిస్తూ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కమ్యూనికేషన్లు, పాడ్‌కాస్టింగ్, పరికరాలు, హెచ్‌ఆర్, సర్వీస్ డిపార్ట్‌మెంట్‌లలో కోతలు ఎక్కువగా ఉన్నాయి. వ్యయ నియంత్రణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత ఐటి రంగంలో సైలెంట్ లేఆఫ్‌లు ఉద్యోగుల్లో దడ పుట్టిస్తున్నాయి. ఎఐ సాంకేతికతతో ఇంజనీరింగ్ పనులను ఆటోమేట్ చేయడం, వ్యయ తగ్గింపు చర్యలు, వ్యాపార వృద్ధిలో మందగమనం వంటివి దీనికి కారణాలు. కంపెనీలు సామూహిక లేఆఫ్‌లను ప్రకటిస్తే మార్కెట్లో చెడు సంకేతం వెళ్తుందని భావించి, ఉద్యోగులే స్వచ్ఛందంగా రాజీనామా చేసేలా ఒత్తిడి చేసే పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఎఐ వల్ల ఉద్యోగాలు పోతాయని 67.5 శాతంమంది ఇంజినీర్లలో ఆందోళన నెలకొన్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. నైపుణ్యాల్ని పెంచుకోకపోతే కెరీర్‌కు రక్షణ ఉండదని 87.5 శాతం మంది అభిప్రాయపడ్డారు. వచ్చే పదేళ్లలో 40 శాతం వరకు జాబ్స్ ఎఐ పరిధిలోకి వెళ్లే అవకాశం ఉందని, దీంతో 89 శాతం మేర ఇంజినీర్లు ఎఐ, ఎంఎల్‌లోనే కొత్త నైపుణ్యాల్ని నేర్చుకోవాలనుకుంటున్నారని ఆ అధ్యయంలో పేర్కొంది. ఎఐ విప్లవంపై మరో వాదన కూడా ఉంది. ఎఐ అభివృద్ధి వల్ల ఉద్యోగాల స్వరూపం మారుతుందని ఒకవైపు చర్చ జరుగుతుంటే, అనేక సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడానికి ఉద్యోగాలను తొలగిస్తూ, దానికి ఎఐ ని కారణంగా చూపుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఎఐ సాధనాలు ఇప్పటివరకు కొన్ని రంగాల్లో మాత్రమే ప్రభావవంతంగా ఉన్నాయని, వేలాది మంది ఉద్యోగాలను ఒకేసారి భర్తీ చేసే స్థాయికి ఇంకా చేరలేదని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య ఎఐ సునామీని ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది, భారతీయ ఉద్యోగ మార్కెట్ ఈ మార్పులకు అనుగుణంగా మారాల్సి ఉంటుంది.

# మేటి గాయకుడు రఫీ

ప్రముఖ ఉత్తర భారత నేపథ్యగాయకుడు. హిందీ సినీ చిత్ర సీమలో ఒకనాడు మకుటం లేని మహారాజుగా వెలిగాడు. హిందీ సినిమా రంగం 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. కేవలం రఫీ పాటలతో వందల కొద్దీ చిత్రాలు విజయం పొందాయనేది నూటికి నూరుపాళ్లు నిజం. తన గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించిన మహ్మద్ రఫీ 24 డిసెంబర్ 1924 పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించాడు. బాల్యంలో తమ గ్రామానికి వచ్చే ఫకీర్ల గానాన్ని రఫీ అనుకరించే వాడు. అలా చిన్నప్పుడే సంగీతంతో మక్కువ ఏర్పడింది. ఆ క్రమంలోనే ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్ వద్ద రఫీ సంగీత శిక్షణలో రాటుదేలాడు. అలా సినిమాల్లో పాటలు పాడడానికి 1944లో బొంబాయి వెళ్లాడు. గావ్ కీ గోరి' అనే హిందీ చిత్రంలో జి.ఎం.దురానీ తో కలిసి రఫీకి మొదటిసారి పాడే అవకాశం వచ్చింది. రఫీ పాడిన తొలి హిందీ గీతమిది. ఆ తర్వాత 1948లో గాంధీజీ హత్య జరిగినపుడు రఫీ 'సునో సునో ఏ దునియావాలో బాపూజీకి అమర్ కహానీ' పాటతో పాపులర్ అయ్యాడు. ఈ పాటకు భారత ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నాడు. హిందీ సినిమా గాన జగత్తులో 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో పాటలు పాడాడు. 17 భాషలలో తన గానంతో అందరినీ అబ్బుర పరచాడు, లతా మంగేష్కర్ ల గాయక జోడీ, హిందీ నేపథ్యగాన చరిత్రలో కొత్త ఒరవడిని, రికార్డును సృష్టించింది. మహ్మద్ రఫీని వరించిన అవార్డులకు లెక్కేలేదు. కేంద్ర ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం. జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డుతో పాటు పలు ఫిల్మ్ ఫేర్ అవార్డులు ఆయన్ని వరించాయి. హిందీతో పాటు 17 భారతీయ భాషల్లో 20వేలకు పైగా పాటలు పాడాడు. తొలితరం భారతీయ సినీ సంగీత సాగర ప్రయాణానికి దిక్సూచి లాంటి వాడు రఫీ. పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రిషీ కపూర్ వంటి మూడు తరాల బాలీవుడ్ నటులకు స్వరాలు అందించిన ఘనత రఫీ సొంతం. తెలుగు విషయానికొస్తే...తండ్రి ఎన్టీఆర్, కొడుకు బాలకృష్ణకు ప్లేబ్యాక్ అందించారు రఫీ. నౌషాద్ కోసం రఫీ మొత్తం 149 పాటలు, బర్మన్‌తో కలిసి 37 చిత్రాలలో పని చేశాడు, శంకర్ - జైకిషన్ కోసం రఫీ మొత్తం 341 సంఖ్యలను (216 సోలో) పాడారు. కల్యాంజీ ఆనంద్జీ రఫీ స్వరంలో సుమారు 170 పాటలు కంపోజ్ చేశారు. రవితో , మదన్ మోహన్‌తో , ఓ పీ నయ్యర్‌తో, లక్ష్మీకాంత్ - ప్యారేలాల్‌తో, రోషన్, జైదేవ్, ఖయ్యామ్, రాజేష్ రోషన్, రవీంద్ర జైన్, బాపి లాహిరి, సపన్ జగ్మోహన్ వంటి సంగీత దర్శకులందరికీ తరచూ పాడారు. ఉషా ఖన్నా , సోనిక్ ఒమి , చిత్రగుప్తా , ఎస్ఎన్ త్రిపాఠి , ఎన్. దత్తా మరియు ఆర్.డి బర్మన్ లాంటి సంగీత దర్శకులతో పని చేశాడు. అనేక ప్రైవేట్ ఆల్బమ్‌లను వివిధ



శైలులు మరియు భాషలలో రికార్డ్ చేశాడు. గిన్నీస్ రికార్డు ప్రకారం భారతీయ భాషలలో 28,000 పాటలను రికార్డ్ చేసినట్లు పేర్కొన్నారు. రఫీ రెండు సినిమాల్లో నటించాడు. లైలా మజ్ను (1945) చిత్రంలో "తేరా జల్వా జిస్ నే దేఖా" మరియు జుగ్ను (1947) చిత్రంలో "వో అప్ని యాద్ దిలాన్ కో" పాటల కోసం తెరపై కనిపించాడు. 1948 - స్వతంత్ర భారత మొదటి సాంవత్సరిక ఉత్సవాలలో రజత పతాకాన్ని జవహర్లాల్ నెహ్రూ చేతుల ద్వారా ప్రదానం చేయబడింది. 1967 - భారత ప్రభుత్వంచే పద్మశ్రీ బిరుదు ప్రదానం చేయబడింది. 2001 - హీరో హొండా, స్టార్ డస్ట్ మేగజైన్ లద్వారా "బెస్ట్ సింగర్ ఆఫ్ ద మిలీనియం గౌరవ ప్రదానం. 2013 - సి ఎన్ ఎన్.. ఐ బి ఎన్ పోల్ లో గ్రేటెస్ట్ వాయిస్ ఇన్ హిందీ సినిమాగా ఎన్నికయ్యాడు."చౌధవీఁ కా చాంద్ హో , తేరి "ప్యారీ ప్యారీ సూరత్ కో", "చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే", "బహారో ఫూల్ బర్సావో", "మై గావూ తుమ్ సోజావో", "ఖిలోనా జాన్ కర్", "క్యా హువా తేరా వాదా", ఇలా ఒక్కటేమిటి, రఫీ పాడిన ఎన్నో పాటలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. తెలుగులో ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యమే. 'భలే తమ్ముడు' చిత్రంలోని ఎంతవారు కానీ వేదాంతులైనా కానీ, ఎన్టీఆర్ 'ఆరాధన'లో నా మది నిన్ను పిలిచింది గానమై.. 'అక్బర్ సలీం అనార్కలి'లో ఆయన పాడిన సిపాయి పాట నేటికి తెలుగు ప్రేక్షకుల్లో మనసుల్లో అలాగే నిలిచి వుంది. 1980 జూలై 31న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన ఈ లోకాన్ని వదిలి వెళ్లి దాదాపు 40 ఏళ్లు దాటినా ఆయన స్వరం ప్రతిగుండెలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందుకే భారతీయ సినీ సంగీత ప్రపంచంలో రఫీ అమర గాయకుడిగా నిలిచిపోయారు.

## ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ఆగ్రహం

**ఖమ్మం :** అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్ మీడియా సమావేశంలో మాత్రం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం చిమ్ముతున్నారని ఆయన విమర్శించారు.ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు.తమ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ప్రతి సంవత్సరం రూ.12,500 కోట్లు విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని భట్టివిక్రమార్క తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు తోలు తీస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారని, తాము వారిలా మాట్లాడలేమని పేర్కొన్నారు. అలా మాట్లాడే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని భట్టివిక్రమార్క అన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు అలర్ట్.. డిసెంబర్ 31 వరకే ఛాన్స్

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలకు మొత్తం 9,79,506 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది. ఈ మేరకు ఇప్పటి వరకు పరీక్ష ఫీజులు చెల్లించినట్లు పేర్కొంది. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇప్పటికే వరకు ఫీజు చెల్లించకపోతే.. అటువంటి వారికి మరో అవకాశం ఇస్తూ బోర్డు తాజాగా కీలక ప్రకటన జారీ చేసింది. రూ.2 వేల ఆలస్య రుసుంతో డిసెంబరు 31వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు పొడిగిస్తున్నట్లు ఇంటర్‌బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.తాజా ప్రకటన మేరకు డిసెంబర్ 31వ తేదీ వరకు విద్యార్థులు ఆయా జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపల్‌లకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. కాగా ఈ ఏడాది అక్టోబరులో పరీక్షల ఫీజు షెడ్యూల్ ప్రకటించగా.. ఇందులో ఇచ్చిన వివరాల ప్రకారం ఆలస్య రుసుం గడువు డిసెంబరు 15వ తేదీతో ముగిసింది. ఈ క్రమంలో ఈ నెలాఖరు వరకు పరీక్ష ఫీజు చెల్లింపులకు అవకాశం కల్పించారు. ఇక ఇంటర్ ఫస్ట్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 17వ తేదీ వరకు జరగనుండగా.. ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18వ తేదీ నిర్వహించనున్నారుఐబీపీఎస్ ఆర్ఆర్‌బీ సీఎం స్కేల్ ఎ 2025 మెయిన్స్ పరీక్ష మరో ఐదు రోజుల్లో జరగనుంది. ఈ క్రమంలో ఆర్ఆర్‌బీ అడ్మిట్ కార్డులను విడుదల చేసింది. డిసెంబర్ 28న జరగనున్న మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ రిజిస్ట్రేషన్ లేదా రోల్ నంబర్, పాస్‌వర్డ్ లేదా పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నోటిఫికేషన్ కింద రూరల్ బ్యాంకుల్లో మొత్తం 13,217 పోస్టులను భర్తీ చేయనున్న సంగతి తెలిసిందే. ఇందులో 3, 907 స్కేల్ ఎ అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు ఉన్నాయి. మెయిన్స్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూకి పిలుస్తారు.

## కరీంనగర్ పోలీసులకు సైబర్ నేరాలు, డిజిటల్ చెల్లింపులపై ఆర్బీఐ అవగాహన సదస్సు

### ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్ :** నకిలీ నోట్ల గుర్తింపు, డిజిటల్ అరెస్ట్ వంటి అంశాలపై పోలీసులకు శిక్షణ.రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్బీఐ, ఆధ్వర్యంలో మంగళవారంనాడు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర హాలు నందు ఈ-బిఏటి ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అవేర్నెస్ మరియు ట్రైనింగ్, కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ చెల్లింపులు, సైబర్ మోసాలు మరియు నకిలీ నోట్ల గుర్తింపుపై పోలీసు అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరగాళ్లు అవలంబిస్తున్న కొత్త కొత్త పద్ధతుల పట్ల పోలీసు అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే బాధితులకు త్వరితగతిన న్యాయం చేయగలమని సూచించారు.ఈ సదస్సులో క్రింది అంశాలపై కూలంకషంగా వివరించారు.?సైబర్ మోసాలు: ఇటీవల సంచలనం సృష్టిస్తున్న డిజిటల్ అరెస్ట్, లాటరీ స్కామ్‌లు మరియు అనుమానాస్పద లింక్‌ల ద్వారా జరుగుతున్న నేరాలు.సురక్షిత లావాదేవీలు: యూపీఐ, ఎన్ఇఎఫ్ టి,ఆర్ టి జిఎస్ మరియు ఎల్ ఎంపిఎస్ వంటి సేవలను ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. ముఖ్యంగా యూపీఐ పిన్ భద్రత గురించి వివరించారు.?నకిలీ నోట్ల గుర్తింపు: అసలు నోట్లకు, నకిలీ నోట్లకు ఫేక్ కరెన్సీ, మధ్య ఉండే తేడాలను ఎలా గుర్తించాలి మరియు నోట్ రీఫండ్ నియమాల గురించి అవగాహన కల్పించారు.?ఫిర్యాదుల విధానం: డిజిటల్ లావాదేవీల్లో పొరపాట్లు జరిగినప్పుడు లేదా మోసపోయినప్పుడు ఏ విధంగా ఫిర్యాదు చేయాలి, ఆర్బీఐ అంబుడ్స్‌మన్ సేవలను ఎలా పొందాలి అనే విషయాలను వివరించారు.?నగదు రహిత లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాలు మరియు సైబర్ భద్రతా చిట్కాలను పోలీసు సిబ్బందికి ప్రాక్టికల్‌గా వివరించారు.?ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్, వెంకటరమణ, ఆర్బీఐ అధికారులు, ఆర్బీఐ ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ మేనేజర్ సత్యజిత్ ఘోష్, మేనేజర్ ఖాదర్ హుస్సేన్, వెంకటరమణ, కమిషనరేటుకు చెందిన ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ :** కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంరోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో తరచుగా ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి, గత సమావేశంలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు, జిల్లాలో ఎన్ని బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి, గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు ఏమిటని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద అవకాశం ఉన్న స్థలాల్లో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాటికి గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ లో చర్చించిన అంశాలకు సంబంధించి చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు. పాఠశాల బస్సులపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ అతికించాలని సూచించారు. జనవరి 1 నుండి 31వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. ఉత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. తిమ్మాపూర్ లోని సారథి ట్రాఫిక్ అవగాహన పార్కును విద్యార్థులు సందర్శించేలా చూడాలని తెలిపారు. విభిన్న కార్యక్రమాల ద్వారా రోడ్డు అవగాహన మాస ఉత్సవాలు ఏర్పాటు చేయాలని అన్నారు.పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గురించి వివరించారు. గత సంవత్సరం కాలంలో ప్రమాదాలు, మరణించిన వారి సంఖ్య తదితర వివరాలు వెల్లడించారు. కరీంనగర్-జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు ఎక్కువగా ఉన్నందున రాత్రి వేళల్లో దారి కనిపించక చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సంభవిత అధికారులు ఈ మార్గంలో వాహనదారులకు ఉన్న ఇబ్బందులను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు



# చలికాలంలో కొన్ని తినొద్దంటున్న న్యూట్రిషనిస్ట్


శీతాకాలంలో ప్రజల ఆహారపు అలవాట్లు మారతాయి. శరీరాన్ని వెచ్చగా ఉంచడం కోసం చాలా మంది వేడి వేడిగా తింటుంటారు. ఇందులో వేడి వేడి బజ్జీలు, పకోడీలు, సూపులు ఉంటాయి. అంతేకాకుండా అమ్మమ్మల కాలం నుంచి ఫేమస్ అయిన డ్రై ఫ్రూట్ లడ్డూలు, క్యారెట్ హల్వా, ఉసిరి మిఠాయి వంటివి కూడా చలికాలంలో తింటుంటారు. ఇక, వేడి వేడి పరాఠాలు, నెయ్యితో వేయించిన కూరగాయలు వంటివి కూడా తింటుంటారు. ఇక, బంగాళదుంపులు, చిలగడదుంపల్ని ఉడకబెట్టుకుని తింటారు. అయితే, వీటిలో చాలా వరకు మన ఆరోగ్యానికి హాని చేసేవే ఉన్నాయి. అంతేకాకుండా వీటిని తినడం వల్ల బరువు కూడా పెరిగే ప్రమాదం ఉంది. అయితే, కొన్ని ఆహార పదార్థాల్ని ఆరోగ్యకరమైనవి భావించి చలికాలంలో ఎక్కువగా తింటుంటారు. అయితే, ఇవి ఆరోగ్యానికి హాని చేస్తాయంటున్నారు. పుణేకు చెందిన న్యూట్రిషనిస్ట్ అమిత గాద్రే. అలాంటి ఫుడ్స్ లిస్ట్‌ను కూడా తన ఇన్‌స్టా ఖాతాలో అందించారు. చలికాలంలో ఉసిరి కాయలు ఎక్కువగా లభిస్తాయి. ఉసిరి కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తి పెంచడంలో సాయపడుతంది. అందుకే ఉసిరి ఆరోగ్యానికి మంచిదని అమిత చెబుతుంది. అయితే, ఉసిరి మిఠాయి ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు అమిత. ఎందుకంటే ఇందులో చక్కెర పుష్కలంగా ఉంటుంది. ఆమ్లా క్యాండీ తినే బదులు.. తాజా ఉసిరిని తీసుకోమని సలహా ఇస్తున్నారు. ఉసిరిని తురుముకుని చట్నీ, గంజి, కూరల్లో వాడుకోమని ఆమె సూచిస్తున్నారు. చలికాలంలో చాలా మంది ఆరోగ్యానికి మంచిదన చ్యవన్‌ప్రాష్ తింటుంటారు. అంతేకాకుండా పిల్లలకు కూడా తినిపిస్తారు. అయితే, చ్యవన్‌ప్రాష్‌లో కూడా ఎక్కువ చక్కెర ఉంటుదని అమిత హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా అనేక అధ్యయనాలు చ్యవన్‌ప్రాష్‌లో భారీ లోహాల ఉనికిని వెల్లడించాయి. అందుకే ఇది పిల్లలకు మంచిది కాదు. దీన్ని చలికాలంలో ఎట్టి పరిస్థితుల్లో తినొద్దని అమిత సూచిస్తున్నారు. దీనికి బదులు తాజా కూరగాయలతో చేసిన సూప్ తాగమంటున్నారు అమిత. డ్రై ఫ్రూట్స్‌తో చేసిన లడ్డూల్ని చలికాలంలో ఎక్కువగా తింటారు. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. అయితే, వీటిలో కేలరీలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఉదహరణకు ఒక డ్రై ఫ్రూట్ లడ్డూలో దాదాపు 200 కేలరీలు ఉంటాయని అమిత వివరిస్తున్నారు. బరువుతో పాటు బెల్లీ ఫ్యాట్ తగ్గించుకోవాలని ప్రయత్నిస్తున్నవారు.. ఈ లడ్డూల్ని ఎట్టి పరిస్థితుల్లో తినకూడదని సలహా ఇస్తున్నారు. వీటికి బదులు గుప్పెడు గింజలు, డ్రై ఫ్రూట్స్ తినమని సలహా ఇస్తున్నారు. చలికాలంలో చాలా మంది ఉదయం నిద్ర లేవగానే ఒక టీ స్పూన్ నెయ్యి తింటారు. ఇది ఆరోగ్యానికి చాలా మంచిదని భావిస్తారు.

# పిల్లల చేత గుడ్లు ఏ వయసు నుంచి తినిపించాలి



గుడ్డు మంచి పోషకాహారం. ఎన్నో పోషకాలతో నిండి ఉన్న ఈ గుడ్డుని పిల్లలకి పెట్టడం మంచిదే. కానీ, ఎప్పట్నుంచీ ఏ వయసున్న వారి నుంచి పిల్లలకి గుడ్డు పెట్టాలనే సందేహం ప్రతీ ఒక్క తల్లికి వచ్చే ఉంటుంది. ఇంట్లో పెద్దవారు ఉంటే వారికి తోచిన సలహా వారు ఇస్తారు. అయితే, అసలు నిజాలు ఏంటో డాక్టర్‌ని అడిగి తెలుసుకుని ఆ తర్వాత గుడ్డు తినిపిస్తే మంచిది. దీని గురించి డాక్టర్ గౌతమ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేశారు. అందులో పిల్లలకి గుడ్డు తినిపించే విషయంలో పేరెంట్స్ చేసే మిస్టేక్స్ గురించి చెబుతున్నారు. ఆ మిస్టేక్స్ ఏంటో ముందుగా తెలుసుకోండి. చాలా మంది పేరెంట్స్ చేసే తప్పు ఏంటంటే గుడ్డు మంచిదే అయినప్పటికీ పిల్లలకి ఎప్పుడు తినిపించాలో తెలియక పెద్దగా అయ్యాక తినిపిస్తుంటారు. కానీ, ఎదిగే పిల్లలకి ముందునుంచే తినిపించాలి. 6 నెలల తర్వాత నుంచే ఎగ్ ఎల్లో తినిపించాలి. 8 నెలల తర్వాత నుంచి ఎగ్ వైట్ తినిపించొచ్చు అని డాక్టర్ చెబుతున్నారు. కొంతమంది అపోహ ఏంటంటే ఎగ్ ఎల్లో బ్యాడ్ ఫ్యాట్ అని పిల్లలకి తినిపించరు. కానీ, ఎగ్ ఎల్లో బ్రెయిన్ డెవలప్‌మెంట్‌కి చాలా అవసరం. ఇది పిల్లలకి తినిపించడం అతి ముఖ్యం. పిల్లల బ్రెయిన్ డెవలప్‌మెంట్‌లో ఎగ్ చాలా ముఖ్యం. ఎగ్ ఎల్లోలో గుడ్ ఫ్యాట్ ఉంటుంది. కోలీన్ ఉంటుంది. ఇది పిల్లల్లో మెమరీ పవర్ డెవలప్ అవ్వడానికి చాలా అవసరం. కాబట్టి, ఎగ్ ఎల్లో ఇవ్వాల్సిందే. కొంతమంది పేరెంట్స్ పిల్లలకి ఎగ్ మంచిదని ఉడికించి మాత్రమే తినాలని, వారు చెప్పినట్టుగానే తినాలని అంటారు. కానీ, అలా చేయొద్దు. ఎప్పుడైనా సరే పిల్లలు గుడ్డుని ఎలా తినాలని ఇష్టపడతారో అలానే ఇవ్వండి. ఉడికించి తినాలనుకుంటే అలానే ఇవ్వండి. బుర్జీ, ఆమ్లెట్, ఎగ్ దోశ వేసి ఇలా వారికి నచ్చే విధంగా చేసి తినిపించొచ్చు. కొంతమందికి కొన్ని అపోహలు ఉంటాయి. పౌల్ట్రీ ఎగ్స్ మంచివని, కంట్రీ ఎగ్స్ మంచివని ఎవరికి వారికి బిన్నాభిప్రాయాలు ఉంటాయి. వీటిలో ఏది మంచిదైనా సరే ఎక్కువగా ఉడికించి తినిపించడం మంచిది. ఏ ఎగ్ అయినా అదే పోషకాలు ఉంటాయని గుర్తుపెట్టుకోండి. కొంతమంది పిల్లలకి ఎగ్స్ పడవు. అలాంటప్పుడు వారికి గుడ్లు తినిపించినప్పుడు కొన్ని సమస్యలొస్తాయి. వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. రాషెస్, దురదలు, వాంతులు వంటివి ఉంటే వెంటనే పిల్లల డాక్టర్‌ని కలవడం మంచిది. లేదంటే చాలా సమస్యలొస్తాయి.

# వింత పెళ్లి ఆచారాలు.. తంటాలు



పెళ్ళికి సంబంధించిన ఆచారాలూ సంప్రదాయాలూ అన్ని చోట్లా వున్నాయి. వాటిలో కొన్ని చాలా సరదాగా ఉంటే, మరికొన్ని వధూవరులకు నిజంగానే ఇబ్బందులు కలిగించేలా ఉంటాయి. శారీరక కష్టం, మానసిక ఒత్తిడి లేదా వింతైన సవాళ్లతో కూడిన కొన్ని వివాహ ఆచారాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని... 1. 'చోరీ' : బూట్ల దొంగతనం ఉత్తర భారతదేశంలో ఇది మనందరికీ తెలిసిందే. కానీ విదేశీయులకు ఇది పెద్ద 'ట్రబుల్' లా అనిపిస్తుంది. పెళ్ళి పీటల మీద వరుడు కూర్చున్నప్పుడు వధువు తరపు చెల్లెళ్లు వరుడి బూట్లను దొంగిలిస్తారు. ఆ బూట్లు తిరిగి కావాలంటే వరుడు వారికి అడిగినంత డబ్బు ఇచ్చుకోవాలి. కొన్నిసార్లు ఈ బేరసారాలు గంటల తరబడి సాగి, గొడవలకు కూడా దారితీస్తుంటాయి.

2. వధువు కిడ్నాప్: దీనిని 'అలా కచ్చు' అంటారు. ఇక్కడ అబ్బాయి తనకు నచ్చిన అమ్మాయిని తన స్నేహితులతో కలిసి బలవంతంగా కిడ్నాప్ చేస్తాడు. ఆమెను ఇంటికి తీసుకెళ్ళి, పెళ్ళికి ఒప్పించే వరకు అక్కడే ఉంచుతారు. ఇది ఒక నేరమైనప్పటికీ, అక్కడ ఒక సంప్రదాయంగా ఇప్పటికీ కొనసాగుతోంది. ఇది వధువుకు నిజంగానే పెద్ద ట్రబుల్.

3. నోరు విప్పకూడదు : బాలిలో జరిగే కొన్ని సాంప్రదాయ వివాహాల్లో వధూవరులు పెళ్ళి వేడుక ముగిసే వరకు చాలా తక్కువగా మాట్లాడాలి లేదా అసలు మాట్లాడకూడదు. అంతేకాదు, పెళ్ళికి ముందు వధూవరుల పళ్లను కొంచెం ఫైల్ చేస్తారు. పళ్ళను సమానం చేయడం వల్ల వారిలోని కోపం, అసూయ వంటి చెడు గుణాలు పోతాయని వారి నమ్మకం. ఆ నొప్పిని భరించడం ఒక పెద్ద సవాలే.

**4. చెమటోడ్చాల్సిందే:** కొన్ని స్విస్ సంప్రదాయాల్లో పెళ్ళికి ముందు వధువును ఆమె స్నేహితులు నల్లటి పదార్థాలతో ముంచెత్తడమే కాకుండా, పెళ్ళి రోజున వరుడు ఒక చెక్క మొద్దును గొడ్డలితో సగానికి నరకాలి. వధువు ఆ మొద్దు కదలకుండా పట్టుకోవాలి. అతిథులందరి ముందు ఆ కష్టమైన పనిని త్వరగా పూర్తి చేయకపోతే వరుడిని ఎగతాళి చేస్తారు.

5. నవ్వకూడదు: మనం పెళ్ళిలో నవ్వుతూ ఫోటోలు దిగుతాం. కానీ కాంగోలోని కొన్ని ప్రాంతాల్లో వధూవరులు పెళ్ళి వేడుక మొత్తం నవ్వకూడదు. వారు సీరియస్‌గా ఉంటేనే ఈ పెళ్ళిని వారు సీరియస్‌గా తీసుకుంటున్నారని అర్థం. ఒకవేళ నవ్వితే వారికి పెళ్ళి ఇష్టం లేదని లేదా క్రమశిక్షణ లేదని భావిస్తారు. నవ్వు ఆపుకోవడం అక్కడ పెద్ద ట్రబుల్!

6. వంటల పరీక్ష : జపాన్‌లోని కొన్ని పాత ఆచారాల ప్రకారం, వధువు పెళ్ళి రోజున తెల్లటి మేకప్ వేసుకోవడమే కాకుండా, తలపై ఒక పెద్ద టోపీ ధరించాలి. ఇది ఆమెలోని 'అసూయ కొమ్ములు' కనబడకుండా ఉండటానికట. అంటే పెళ్ళి తర్వాత ఆమె అత్తమామలతో, భర్తతో చాలా అణకువగా ఉండాలని సూచించే ఒక రకమైన మానసిక ఒత్తిడి.

7. వెక్కిరింతల పాటలు: ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో 'గాలి' పాడే ఆచారం ఉంది. వధువు తరపు మహిళలు వరుడిని, అతని తండ్రిని, బంధువులను ఉద్దేశించి బూతులు లేదా వెక్కిరింతలతో కూడిన పాటలు పాడతారు. వరుడి తరపు వారు వీటిని భరిస్తూ నవ్వుతూ ఉండాలి తప్ప కోప్పడకూడదు. ఈ ఆచారాలన్నీ చూస్తుంటే పెళ్ళి అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయికే కాదు, వారి ఓపికకు పెట్టే పరీక్ష అనిపిస్తుంది.

# జొన్న రొట్టెలు అస్సలు తినకూడదు!



జొన్న రొట్టె ఆరోగ్యానికి మంచిదని చాలా మంది భావిస్తుంటారు. ఫైబర్, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నప్పటికీ, జీర్ణ సమస్యలు, మధుమేహం, గుండెల్లో మంట, మలబద్ధకం లేదా బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న వారు దీనిని తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ఇది వారి ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేసే అవకాశం ఉంది. ఈ రోజుల్లో జొన్న రొట్టె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చాలా మంది నమ్ముతారు. గోధుమ రొట్టె కంటే దీన్నే ఇష్టపడుతుంటారు. ముఖ్యంగా చలికాలంలో దీనిని తినడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని చెబుతుంటారు. జొన్న రొట్టెలో ఫైబర్, విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది అనేక వ్యాధులు దరికి చేరకుండా చేస్తాయని భావిస్తారు. అయితే, కొంతమంది మాత్రం జొన్న రొట్టెను పూర్తిగా నివారించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణ సమస్యలతో బాధపడేవారు, అంటే కడుపునొప్పి, అసిడిటీ, గ్యాస్, పేగు సిండ్రోమ్ వంటివి ఉన్నవారు దీనిని తినడం వల్ల వారి సమస్యలు తీవ్రతరం కావచ్చు. మధుమేహంతో బాధపడేవారు కూడా జొన్న రొట్టెను మితంగా తీసుకోవాలి. ఇందులో అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఉండటం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు వేగంగా పెరిగే అవకాశం ఉంది. కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారు వైద్యుడిని సంప్రదించిన తర్వాతే దీనిని తినడం మంచిది. అదేవిధంగా, గుండెల్లో మంట, మలబద్ధకం సమస్యలు ఉన్నవారు, బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న వారు కూడా జొన్న రొట్టెను తమ ఆహారంలో చేర్చుకోకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యానికి మేలు చేసే ఆహారం అయినప్పటికీ, కొన్ని పరిస్థితులలో ఇది హానికరం కావచ్చని అంటున్నారు. అలాగే ఏ ఆహారమైనా శరీరానికి మితంగా తింటే ఏ అనారోగ్య సమస్యలు తలెత్తవని.. అధికంగా తీసుకోవడం వల్ల లేనిపోని అనారోగ్య సమస్యలు వస్తాయని.. అందుకే తినే ఫుడ్ ఏదైనా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మీ డైట్‌లోకి ఏదైనా ఆహారాన్ని జత చేస్తే కచ్చితంగా వైద్యున్ని ముందుగా సంప్రదించాలన్నారు.

# టమాటా తీసుకుంటే కిడ్నీల్లో రాళ్ళా!



ఇటీవలి కాలంలో కిడ్నీలో రాళ్ల సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా యువత కిడ్నీ రాళ్ల సమస్యతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో చాలా మందికి అసలు కిడ్నీల్లో రాళ్లు ఎందుకు ఏర్పడతాయనే దానిపై సందేహాలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో కిడ్నీలో రాళ్ల సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా యువత కిడ్నీ రాళ్ల సమస్యతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో చాలా మందికి అసలు కిడ్నీల్లో రాళ్లు ఎందుకు ఏర్పడతాయనే దానిపై సందేహాలు ఉన్నాయి. ఈ క్రమంలో కొందరు టమాటా తిరడం వల్ల కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయని భావిస్తుంటారు. దీంతో టమోటాలు తినకుండా ఉంటారు. రోజూ ఆహారంలో భాగంగా టమోటాలను తినడం వల్ల లేదా ఆహారంలో ఏదో ఒక విధంగా ఉపయోగించడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయనేది వీరి నమ్మకం. కాబట్టి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయేమోనన్న భయంతో టమోటాలు తినడం మానేస్తుంటారు.

# బిజినెస్

# ఎయిర్‌పోర్టులపై అదానీ గ్రూప్.. గుత్తాధిపత్యం!

## వాట్సాప్‌లో కొత్త మోసం.. 'ఘోస్ట్ పేయిరింగ్'తో జాగ్రత్త!




టెక్నాలజీ పెరుగుతున్న వేళ.. రోజుకో కొత్త స్కామ్ పుట్టుకొస్తోంది. ఇప్పుడు తాజాగా 'ఘోస్ట్‌పెయిరింగ్' పేరుతో వాట్సాప్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. దీని గురించి పూర్తి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

ఘోస్ట్‌పెయిరింగ్ స్కామ్

వాట్సప్‌లోని డివైజ్ లింక్ ఫీచర్ ద్వారా.. ఓటీపీ, పాస్‌వర్డ్స్, వెరిఫికేషన్స్ వంటి వివరాలతో సంబంధం లేకుండానే స్కామర్లు.. యూజర్స్ ఖాతాల్లోకి చొరబడుతున్నారు. దీనినే టెక్ నిపుణులు ఘోస్ట్‌పెయిరింగ్ అంటున్నారు.

ఘోస్ట్‌పెయిరింగ్ స్కామ్ ఇలా..

సోషల్ ఇంజినీరింగ్ ద్వారా.. సైబర్ నేరగాళ్లు ఘోస్ట్‌పెయిరింగ్ మోసాలకు పాల్పడుతున్నారు. స్కామర్లు.. యూజర్ల వాట్సప్‌కు తెలిసిన కాంటాక్టుల ద్వారా Hey, is this you in this photo లేదా I just found your picture అనే మోసపూరిత మెసేజ్ వస్తుంది. ఇలాంటి మెసేజ్‌లో ఇంటర్నల్‌గా వేరే లింక్ ఉంటుంది. కాబట్టి యూజర్లు తమకు వచ్చిన లింక్ క్లిక్ చేయగానే.. ఒక ఫేక్ వెబ్‌పేజ్ ఓపెన్ అవుతుంది. ఓటీపీ గానీ, స్కానింగ్ లేకుండా.. మీకు తెలియకుండా మీ వాట్సాప్ ఖాతా హ్యాకర్ల డివైజ్‌కు కనెక్ట్ అవుతుంది. ఒక్కసారి వారి చేతికి చిక్కితే.. మీ వ్యక్తిగత చాటింగ్స్, ఫొటోలు, వీడియోలు అన్నీ చూస్తారు. మీ కాంటాక్ట్స్ లిస్ట్ దొంగిలిస్తారు. మీ పేరుతో ఇతరులకు సందేశాలు పంపి మోసాలకు పాల్పడతారు. చివరికి మీ ఖాతాను మీరే వాడుకోలేక లాక్ చేస్తారు.

ఘోస్ట్‌పెయిరింగ్ స్కామ్ నుంచి తప్పించుకోవడం ఎలా

మీకు తెలియని లేదా.. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దు.

వాట్సాప్ సెట్టింగ్స్‌లో %Linked Devices ఆప్షన్‌ను తరచూ పరిశీలించండి. తెలియని డివైజ్‌లు ఉంటే వెంటనే రిమూవ్ చేయండి. Two-step verification తప్పనిసరిగా ఎనేబుల్ చేసుకోవాలి.

వీసీ సజ్జనార్ ట్వీట్

వాట్సాప్ ఘోస్ట్‌పెయిరింగ్ ఫీచర్ గురించి.. వీసీ సజ్జనార్ ట్వీట్ చేసారు. ఇందులో.. "హేయ్.. మీ ఫొటో చూశారా? అంటూ ఏదైనా లింక్ వచ్చిందా? తెలిసిన వారి నుంచి వచ్చినా సరే.. పొరపాటున కూడా క్లిక్ చేయకండి" అని వెల్లడించారు.

ఇటీవల ఎయిర్ ఇండిగో సంక్షోభం కారణంగా దేశంలోని లక్షలాది మంది విమాన ప్రయాణికులు ఎదుర్కొన్న ప్రయాణ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. దీనంతటికీ దేశీయ విమానయాన రంగంలో ఇండిగో సంస్థకు ఉన్న గుత్తాధిపత్యమే కారణమని, ఆ సంస్థ తప్పు చేసిందని తెలిసినా ప్రభుత్వం తక్షణం ఏ చర్యలూ తీసుకోలేని నిస్సహాయ స్థితిలో పడిందని అటు ప్రభుత్వ పెద్దలు, ఇటు మేధావులు, నిపుణులు కూడా నిర్ధారణకు వచ్చారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్‌ల నిర్వహణలో గుత్తాధిపత్యం సాధించి అతిపెద్ద ఎయిర్‌పోర్టు ఆపరేటర్‌గా అవతరించిన అదానీ గ్రూప్‌పై ఇప్పుడు అందరూ దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే పలు విమానాశ్రయాలను చేజిక్కించుకున్న అదానీ గ్రూప్ గుత్తాధిపత్యాన్ని పలువురు వేలెత్తి చూపుతున్నారు. వైమానిక రంగంలో మరో పెను సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. విమానాశ్రయాల నిర్వహణలో ఎలాంటి అనుభవం లేని అదానీ గ్రూప్.. మోదీ పాలనలో దేశంలోనే రెండో అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్‌గా అవతరించింది. రెండేండ్ల స్వల్ప వ్యవధిలోనే ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 8 ఎయిర్‌పోర్టులను చేజిక్కించుకొంది. అంతటితో ఆగకుండా ఇప్పుడు మరో 12 విమానాశ్రయాలను కూడా తమ ఖాతాలో వేసుకొని, దేశంలోనే నంబర్ వన్ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్‌గా మారేందుకు అడుగులు వేస్తున్నది. అదానీ గ్రూప్ కోసం ఇప్పటికే వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను కారుచౌకగా కట్టబెట్టిన కేంద్రంలోని బీజేపీ సర్కారు.. మరో డజను ఎయిర్‌పోర్టులను కూడా కట్టబెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వచ్చే ఐదేండ్లలో 12 ఎయిర్‌పోర్టులు లీజుకు**

రానున్న ఐదేండ్లలో దేశంలోని 12 ఎయిర్‌పోర్టులను లీజుకు తీసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు అదానీ గ్రూప్ డైరెక్టర్ జీత్ అదానీ తెలిపారు. ఈ మేరకు రూ. లక్ష



కోట్లను కేటాయించబోతున్నట్టు పేర్కొన్నారు. కాగా, దేశంలో రద్దీగా ఉండే ఎనిమిది ఎయిర్‌పోర్టులను కేంద్రంలోని బీజేపీ సర్కారు ఇదివరకే అదానీ గ్రూప్‌నకు కట్టబెట్టింది. ఎయిర్‌పోర్ట్ నిర్వహణలో ఎలాంటి అనుభవంలేని కంపెనీలకు డీల్ అప్పగించవద్దంటూ ఆర్థిక వ్యవహారాల శాఖ (డీఈఏ), నీతి ఆయోగ్ చేసిన సూచనలను కూడా పక్కనబెట్టిమరీ ఈ ప్రక్రియకు ఆమోదముద్ర వేసింది. దీనికోసం నిబంధనలు కూడా మార్చేసింది. ఈ డీల్‌లో అవకతవకలు జరిగాయంటూ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఏఈయూ), ఆయా విమానాశ్రయాల్లో పనిచేస్తున్న వేలాదిమంది ఉద్యోగులు నిరసనోద్యమాలు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదు. వెరసి గత 8 ఎయిర్‌పోర్టులకు అదనంగా ఇప్పుడు ఇంకో 12 ఎయిర్‌పోర్టులు కూడా అదానీ కంపెనీవరమైతే గుత్తాధిపత్యం తప్పదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విమానాశ్రయాల్లో చార్జీల మోత మోగవచ్చని చెప్తున్నారు. ఇండిగో తరహా సంక్షోభాలు నిత్యకృత్యంగా మారే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు.

**'జీవీకే'ను దక్కించుకునేందుకు అడ్డదారులు**

ఎయిర్‌పోర్టులను చేజిక్కించుకొనేందుకు ఇతర సంస్థలపై అదానీ గ్రూప్ ఒత్తిళ్లకు కూడా పాల్పడుతుందని విమర్శలు ఉన్నాయి. జీవీకే గ్రూప్ నిర్వహణలో ఉన్న ముంబై ఎయిర్‌పోర్ట్‌ను కైవసం చేసుకోవడంలో అదానీ కంపెనీ అడ్డదారులు తొక్కినట్టు ఆరోపణలున్నాయి. ఈ విషయంలో అదానీ కంపెనీకి కేంద్రం కూడా వంత పాడినట్టు విమర్శలు ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ముంబై ఎయిర్‌పోర్ట్‌లో జీవీకేకు 50.5 శాతం, దక్షిణాఫ్రికాకు చెందిన బిడ్‌వెస్ట్‌హడ్ కంపెనీకి 13.5 శాతం వాటా ఉండేది. ఒకవేళ బిడ్‌వెస్ట్‌హడ్ తన వాటాలను విక్రయించాలనుకొంటే తొలుత జీవీకేకు ఆ ఆఫర్‌ను ఇవ్వాలి. ఈ మేరకు ఆర్ఓఎఫ్ఆర్ (రైట్ ఆఫ్ ఫస్ట్ రిఫ్యూజల్) క్లాజ్‌ను నిబంధనల్లో చేర్చారు. అయితే, అదానీ గ్రూప్ ఈ నిబంధనను తుంగలో తొక్కి, 2019లో బిడ్‌వెస్ట్‌హడ్ వాటాను చేజిక్కించుకొన్నది. దీంతో జీవీకే గ్రూప్ కోర్టులో కేసు వేసింది. ఈ క్రమంలోనే అనూహ్య పరిణామం చోటుచేసుకొన్నది. ముంబై ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిలో రూ.705 కోట్ల అవకతవకలకు పాల్పడినట్టు 2020 జూన్‌లో సీబీఐ.. జీవీకే గ్రూప్‌పై కేసు నమోదు చేసింది. అయితే, ఎప్పుడైతే ఈ ఎయిర్‌పోర్ట్ నిర్వహణలో ఉన్న తన 50.5 శాతం వాటాను అదానీ గ్రూప్‌నకు జీవీకే గ్రూప్ అప్పగించిందో.. సీబీఐ యూ-టర్న్ తీసుకున్నది. ఈ కేసులో ఎలాంటి అవకతవకలు గుర్తించలేదంటూ కోర్టుకు తెలిపింది. జీవీకే గ్రూప్‌నకు ఒకవిధంగా క్లీన్‌చిట్ ఇచ్చింది. ఈ ఉదంతం వెనుక కేంద్ర ప్రభుత్వం ప్రమేయం ఉన్నదని, అదానీ గ్రూప్‌నకు ముంబై ఎయిర్‌పోర్టును అప్పగించడానికే జీవీకే గ్రూప్‌పై వేధింపుల పర్వం కొనసాగించిందంటూ విపక్షాలు ధ్వజమెత్తాయి. ఇప్పుడు ఈ 12 ఎయిర్‌పోర్టుల విషయంలోనూ ఇదే తరహా ఒత్తిళ్లు, వేధింపులు కొనసాగుతాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఫేక్ యాడ్స్ మోసం.. వివాదంలో జుకర్‌బర్గ్ కంపెనీ!

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల మాతృ సంస్థ అయిన మెటా తన ప్లాట్‌ఫామ్‌లలో మోసపూరిత ప్రకటనల ద్వారా బిలియన్ డాలర్లు సంపాదిస్తున్నట్లు కొన్ని నివేదికలు వెల్లడించాయి. ఇంతకీ ఈ వివాదం ఏమిటి? దీనిపై మెటా స్పందన ఏమిటి? అనే విషయాలను ఇక్కడ చూసేద్దాం.

మెటాపై విమర్శలు

మోసపూరిత ప్రకటనలను సంస్థ గుర్తించినప్పటికీ.. కఠినమైన చర్యలు తీసుకోలేదు. స్కామర్ల ప్రకటనల వల్ల మెటాకు అడ్వర్టైజింగ్ రూపంలో భారీ లాభాలు వస్తున్నాయి. కాబట్టి మెటా అటువంటి ప్రకటనలను అరికట్టడం లేదని నివేదికలు చెబుతున్నాయి. సామాన్య ప్రజలు.. ముఖ్యంగా యువత, వృద్ధులు ఈ మోసాలకు బలయ్యారు. దీంతో అనేక దేశాలు మెటాపై విమర్శలు కురిపిస్తున్నాయి. ముఖ్యంగా చైనాకు సంబంధించిన స్కామ్ ప్రకటనలకు విషయంలో లెక్కలేనన్ని ప్రశ్నలు పుడుతున్నాయి. మెటా తన ప్లాట్‌ఫామ్‌లలో స్కామ్.. ఇతర మోసపూరిత ప్రకటనల ప్రసారం చేయడం ద్వారా ఏటా బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. గత ఏడాదిలో కంపెనీ.. ఒక్క చైనీస్ కంపెనీల ప్రకటనల నుంచి 18




బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ డబ్బు సంపాదించిందని, ఇది కంపెనీ ప్రపంచ ఆదాయంలో 10 శాతం కంటే ఎక్కువ అని రాయిటర్స్ దర్యాప్తులో వెల్లడించింది.

స్కామ్ ఎగుమతి దేశంగా చైనా!

చైనాలో ఫేస్‌బుక్ %ూ% ఇన్‌స్టాగ్రామ్‌లను నిషేధించినప్పటికీ.. అక్కడి కంపెనీలు విదేశీ వినియోగదారులకు ప్రకటనలు ఇవ్వడానికి అనుమతి ఉంది. ఈ విధంగా.. మెటా ప్లాట్‌ఫామ్‌లలో దాదాపు 25% స్కామ్ %ూ% నిషేధిత ప్రకటనలు చైనావే కావడం గమనార్హం. దీంతో చాలామంది చైనాను స్కామ్ ఎగుమతి దేశంగా అభివర్ణించారు. అయితే.. చైనా నుంచి వచ్చే స్కామ్ యాడ్‌లను అరికట్టడానికి మెటా తాత్కాలికంగా ఒక యాంటీ ఫ్రాడ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందాన్ని ఏర్పాటు చేసిన తరువాత కంపెనీ ఆదాయం 19 శాతం నుంచి 9 శాతానికి తగ్గిపోయింది. దీంతో మెటా ఆ బృందాన్ని 2024 చివరలో రద్దు చేసి, చైనీస్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలపై ఆంక్షలు ఎత్తివేసింది. ఆ తరువాత ఆదాయం మళ్లీ 16%కి పెరిగింది.

మెటా స్పందన

మెటా ప్రతినిధి ఆండీ స్టోన్ రాయిటర్స్‌తో మాట్లాడుతూ.. యాంటీ ఫ్రాడ్ టీమ్ కేవలం తాత్కాలిక చర్య మాత్రమేనని అన్నారు. సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ఆ బృందాన్ని రద్దు చేయాలని ఆదేశించలేదని, స్కామ్ కార్యకలాపాలను తగ్గించడానికి ప్రపంచవ్యాప్త ప్రయత్నాలను ముమ్మరం చేయాలని కంపెనీని ఆదేశించారని ఆయన స్పష్టం చేశారు. గత 18 నెలల్లో, మెటా తన ప్లాట్‌ఫామ్‌ల నుంచి 46 మిలియన్ల చైనీస్ ప్రకటనలను తొలగించిందని వెల్లడించారు.

# ఫైనల్లో చేతులెత్తేసిన భారత స్టార్లు.. పన్నెండోసారి విజేతగా పాకిస్థాన్!

# స్పోర్ట్స్

పురుషుల అండర్ -19 ఆసియాకప్ ఫైనల్లో భారత జట్టుకు పాకిస్థాన్ బిగ్ షాకిచ్చింది. భారీ స్కోర్ చేసిన పాక్ అనంతరం పవర్ ప్లేలోనే కీలక వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టింది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ(26), ఆయుష్ మాత్రే(2)ను ఔట్ చేసి భారత్‌ను అలీ రజా(4-42) ఒత్తిడిలో ఒత్తిడిలో పడేశాడు. పాక్ బౌలర్లు షార్ట్ పిచ్ బంతులకు మిడిల్డార్ బ్యాటర్లు వికెట్ ఇచ్చేశారు. టాప్ స్కోరర్గాన దీపేశ్ దేవేంద్రన్(36)ను చివరి వికెట్‌గా వెనుదిరగడంతో 26.2 ఓవర్లలో 156కు భారత్ ఆలౌటయ్యింది. దాంతో.. 191 పరుగుల తేడాతో గెలుపొందిన పాకిస్థాన్ 12వ సారి విజేతగా రికార్డు నెలకొల్పింది. అజేయంగా అండర్ 19 ఆసియాకప్ ఫైనల్ చేరిన భారత్ అనూహ్యంగా బోల్తా పడింది. లీగ్ దశలో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన టీమిండియా.. టైటిల్ పోరులో మాత్రం తల్గొంది. మొదట ప్రత్యర్థిని భారీ స్కోర్ చేయనిచ్చిన ఆయుష్ మాత్రే బృందం.. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ తేలిపోయింది. ఫైనల్లో భారత బౌలర్లను ఉతికేసిన పాక్ ఓపెనర్ సమీర్ మిన్హాస్(172) విధ్వంసక సెంచరీతో చెలరేగాడు. అహ్మద్ హుసేన్(56) అర్ధ శతకంతో మెరవగా దాయాది జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 347 పరుగులు చేసింది. భారీ ఛేదనలో టీమిండియాను ఆరంభంలోనే షాకిచ్చాడు అలీ రెజా(4-42).

**ఒక్కరూ నిలబడలే**

ఓపెనర్ ఆయుష్ మాత్రే(2)ను పెవిలియన్ పంపిన అతడు కాసేపటికే డేంజరస్ వైభవ్ సూర్యవంశీ(26)ని సైతం వెనక్కి పంపాడు. ఆదిలోనే కష్టాల్లో పడిన టీమిండియాను గట్టెక్కిస్తారనుకున్న ఆరోన్ జార్జ్(16), విహాన్ మల్హోత్రా(7), అభిగ్యాన్ కుండు(13)లు పాక్ బౌలర్ల షార్ట్ పిచ్ బంతులకు వికెట్ పారేసుకున్నారు. 59కే నాలుగు, 94కే ఏడు వికెట్లు పడడంతో టీమిండియా కోలుకోలేకపోయింది. పవర్ ప్లేలోనే కీలక వికెట్లు పడడంతో మ్యాచ్ పాక్ చేతుల్లోకి వెళ్లింది. ప్రధాన బ్యాటర్లు డగౌట్ చేరినా దీపేశ్ దేవేంద్రన్(36) ఉన్నంతసేపు ధనాధన్ ఆడాడు. పాక్ బౌలర్లను దంచేస్తూ ఆరు ఫోర్లు, 2 సిక్సర్లు బాదిన దీపేశ్ చివరకు రజా ఓవర్లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అంతే.. 26.2 ఓవర్లలోనే మ్యాచ్ ముగియగా.. 191 పరుగులతో గెలుపొందిన పాక్ 12వ సారి ఆసియా విజేతగా నిలిచింది.




## అత్యంత అరుదైన మైలురాయిని తాకిన మిచెల్ స్టార్క్

ఆసీస్ వెటరన్ స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత అరుదైన మైలురాయిని తాకాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 750 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. క్రికెట్ చరిత్రలో స్టార్క్ కంటే ముందు కేవలం 12 మంది మాత్రమే ఈ ఘనత సాధించారు. ఆసీస్ తరఫున కేవలం ఇద్దరే 750 వికెట్ల మార్కును తాకారు. ఇంగ్లండ్‌తో ఇవాళ ముగిసిన మూడో యాషెస్ టెస్ట్‌లో స్టార్క్ ఈ ఘనత సాధించాడు. అడిలైడ్ వేదికగా ఇవాళ ముగిసిన యాషెస్ మూడో టెస్ట్‌లో స్టార్క్ 4 వికెట్లతో రాణించాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో బ్యాట్‌తోనూ (54) సత్తా చాటాడు. ఈ సిరీస్ తొలి రెండు టెస్ట్‌ల్లోనూ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పెర్త్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో 10 వికెట్ల ప్రదర్శన (7,3) నమోదు చేసిన అతను.. బ్రిస్బేన్ వేదికగా జరిగిన రెండో టెస్ట్‌లో 8 వికెట్లతో (6,2) సత్తా చాటాడు.

రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో స్టార్క్ బ్యాటింగ్‌లోనూ (77 పరుగులు) రాణించాడు. తొలి రెండు



టెస్ట్‌ల్లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన స్టార్క్ ఈ సిరీస్‌లో ఇప్పటివరకు జరిగిన 3 మ్యాచ్‌ల్లో 22 వికెట్లు తీసి లీడింగ్ వికెట్ టేకర్‌గా కొనసాగుతున్నాడు.

మూడో టెస్ట్‌లో స్టార్క్‌తో పాటు అలెక్స్ క్యారీ (106, 5 క్యాచ్‌లు, 72, 6 క్యాచ్‌లు, ఓ స్టంప్, ఓ క్యాచ్) విజృంభించడంతో ఆసీస్ ఇంగ్లండ్‌పై 82 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ గెలుపుతో ఆసీస్ మరో 2 మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలి రెండు టెస్ట్‌లో కూడా ఆసీస్ విజయం సాధించింది. ఈ సిరీస్‌లోని నాలుగో టెస్ట్ మ్యాచ్ మెల్‌బోర్న్ వేదికగా డిసెంబర్ 26న మొదలవుతుంది.


## చావోరేవో మ్యాచ్‌లో ఇంగ్లండ్ బోల్తా.. హ్యాట్రిక్ విజయాలతో సిరీస్ పట్టేసిన ఆస్ట్రేలియా..!



స్వదేశంలో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా హ్యాట్రిక్ కొట్టింది. పెర్త్, బ్రిస్బేన్‌లో ఇంగ్లండ్‌కు షాకిచ్చిన ఆసీస్ అడిలైడ్‌లోనూ పంజా విసిరింది. మిచెల్ స్టార్క్(3-62), నాథన్ లియాన్(3-77) విజృంభించడంతో చావోరేవో మ్యాచ్‌లో పర్యాటక జట్టు బ్యాటర్లు చేతులెత్తేశారు. ఐదోరోజు జేమీ స్మిత్(60), విల్ జాక్స్ (47)లు పోరాడినా స్టార్క్ వీరిద్దరిని ఔట్ చేసి ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లాడు. అడిలైడ్‌లో 82 పరుగుల తేడాతో గెలుపొందిన కంగారూ టీమ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో పట్టేసింది. యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ పోరాడలేక ట్రోఫీ సమర్పించుకుంది. ఆస్ట్రేలియా బౌలర్ల జోరుకు ప్రధాన బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోవడంతో 82 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఓవర్‌నైట్ స్కోర్ 2076 తో ఐదో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్‌ను మిచెల్ స్టార్క్(3-62) దెబ్బకొట్టాడు. అర్ధ శతకంతో రాణించిన జేమీ స్మిత్(60)ను, విల్ జాక్స్(47)ను ఔట్ చేసి పర్యాటక జట్టును ఓటమి ఖాయం చేశాడు. దాంతో, తొలి రెండు టెస్టుల్లో ఆస్ట్రేలియాకు కనీసం పోటీ ఇవ్వలేకపోయిన ఇంగ్లిష్ టీమ్.. అడిలైడ్‌లోనూ అదే తడబాటుతో సిరీస్ సమర్పించుకుంది. ఆసీస్ నిర్దేశించిన భారీ ఛేదనలో ఓపెనర్ జాక్ క్రాలీ(85) అర్ధ శతకంతో ఆశలు రేపినా.. కమిన్స్ (3-24), నాథన్ లియాన్(3-64) వికెట్ల వేటకు టాపార్డర్ కుప్పకూలింది. కమిన్స్ ఓవర్లో జో రూట్(39), లియాన్ దెబ్బకు హ్యారీ బ్రూక్(30)లు తేలిపోయారు. స్వల్ప తేడాతో బ్రూక్‌ను, బెన్‌స్టోక్స్(5)ను బౌల్డ్ చేసిన లియాన్ ఇంగ్లండ్‌ను విజయావకాశాల్లి దెబ్బతీశాడు. అర్ధ శతకంతో పోరాడిన క్రాలీను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఓటమి అంచున నిలిపాడు లియాన్. ఆఖరి సెషన్‌లో వికెట్ కాపాడుకున్న జేమీ స్మిత్, విల్ జాక్స్ ఐదోరోజు పోరాడినా స్టార్క్ వీరిద్దరిని పెవిలియన్ పంపి ఇంగ్లండ్ యాషెస్ కలను భగ్నం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో మెరిసిన అలెక్స్ క్యారీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

# బ్రేక్ ఈవెన్ దాటి లాభాల బాటలో 'మోగ్లీ'.. రోషన్ కనకాలకి తొలి సూపర్ సక్సెస్!

యాంకర్ సుమ తనయుడు రోషన్ కనకాల హీరోగా నటించిన లవ్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మోగ్లీ' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని నమోదు చేసింది. సందీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయికగా నటించగా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. డిసెంబర్ 12, 2025న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం, విడుదలైన తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. సినిమా విడుదలైన తొలి వారంలోనే బ్రేక్ ఈవెన్‌ను దాటడం విశేషం. సుమారు రూ.8 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన 'మోగ్లీ', థియేట్రికల్‌తో పాటు నాన్–థియేట్రికల్ రైట్స్ ద్వారా మొత్తం దాదాపు రూ.10 కోట్ల వసూళ్లు సాధించినట్లు సమాచారం. దీంతో నిర్మాతలకు లాభాలు అందించిన సినిమాగా 'మోగ్లీ' నిలిచింది. ప్రస్తుతం ఈ చిత్రం విజయవంతంగా రెండో వారంలోకి అడుగుపెట్టింది.రోషన్ కనకాల నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. యంగ్ హీరోగా ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్ సన్నివేశాల్లో చూపిన ఎనర్జీ ఆకట్టుకుంటున్నాయని విమర్శకులు ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా విలన్ పాత్రలో బండి సరోజ్ కుమార్ చేసిన నటన సినిమాకు పెద్ద ప్లస్‌గా మారింది. ఆయన ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌కు ప్రత్యేకంగా ప్రశంసలు దక్కుతున్నాయి. లవ్, యాక్షన్, ఎమోషన్ మేళవింపుతో తెరకెక్కిన 'మోగ్లీ' యువతను థియేటర్లకు రప్పించడంలో సక్సెస్ అయింది. ఈ విజయంతో రోషన్ కనకాల కెరీర్‌కు మంచి బూస్ట్ లభించినట్టుగా టాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి. రెండో సినిమాతోనే లాభాల బాట పట్టిన హీరోగా రోషన్ పేరు నిలవడం విశేషం. మొత్తానికి తనయుడు సినిమా మంచి హిట్ కొట్టడంతో సుమతో పాటు రాజీవ్ కనకాల ఆనందానికి అవధులు లేవనే చెప్పాలి.






## రోషన్‌కి జోడీగా మహేశ్ మూవీ చైల్డ్ ఆర్టిస్ట్.. సాంగ్ రిలీజ్

శ్రీకాంత్ కొడుకు రోషన్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా 'ఛాంపియన్'. ఈ వీకెండ్ క్రిస్మస్ కానుకగా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే ట్రైలర్, పాటలతో బజ్ తీసుకొచ్చే కాస్త బజ్ తీసుకొచ్చారు. ఇప్పుడు మూవీలోని ఐ యామ్ ఛాంపియన్ అంటూ సాగే టైటిల్ గీతాన్ని రిలీజ్ చేశారు. ఇందులో ఒకప్పటి టాలీవుడ్ బాలనటి కనిపించడం విశేషం. మరి ఈమెని గుర్తుపట్టారా? ఛాంపియన్ మూవీలో రోషన్‌తో పాటు ఓ పాటలో కనిపించిన ఈ బాలనటి పేరు అవంతిక వందనపు. తెలుగు మూలాలున్నప్పటికీ అమెరికాలో పుట్టి పెరిగింది. మహేశ్ బాబు 'బ్రహ్మోత్సవం' మూవీతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా పరిచయమైంది. తర్వాత తెలుగులో ప్రేమమ్, ఆక్సిజన్, బాలకృష్ణుడు, మనమంతా, రారండోయ్ వేడుక చూద్దాం, అజ్ఞాతవాసి తదితర చిత్రాల్లో బాలనటిగా చేసింది. తర్వాత ఇంగ్లీష్‌లోనూ పలు సినిమాలు, సిరీస్‌లు చేసింది. మళ్లీ ఇప్పుడు చాన్నాళ్ల తర్వాత తెలుగులో 'ఛాంపియన్'లోని స్పెషల్ సాంగ్‌లో మెరిసింది. వైజయంతీ మూవీస్ నిర్మించిన 'ఛాంపియన్' చిత్రంతో మలయాళ బ్యూటీ అనస్వర రాజన్.. టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. ప్రదీప్ అద్వైతం దర్శకుడు. స్వాతంత్ర్య బ్యాక్ డ్రాప్‌లోని పీరియాడికల్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాని తెరకెక్కించారు. రోషన్ గతంలో 'పెళ్లి సంద%ణ%'లో హీరోగా నటించాడు. అది అంతంత మాత్రంగానే ఆడింది. ఇదొచ్చిన మూడేళ్లకు ఇప్పుడు 'ఛాంపియన్' అదృష్టం పరీక్షించుకోబోతున్నాడు. మరి ఏమవుతుందో చూడాలి?

## ది రాజాసాబ్ మూవీపై రూమర్స్.. స్పందించిన నిర్మాత



ప్రభాస్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న చిత్రం ది రాజాసాబ్. ఈ హారర్ రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌ను మారుతి డైరెక్షన్‌లో తెరకెక్కించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా.. సంక్రాంతికి కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. రెబల్ స్టార్ మూవీ కావడంతో ఫ్యాన్స్‌తో పాటు అభిమానుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. రెబల్ స్టార్ మూవీ కావడంతో టాలీవుడ్‌లో అప్పుడే చర్చ మొదలైంది. ఈ మూవీ రిలీజ్‌కు ముందే బిజినెస్ డీల్స్‌పై సోషల్ మీడియాలో టాక్ నడుస్తోంది. ది రాజాసాబ్ సినిమాకు నాన్ థియేట్రికల్ బిజినెస్ ఆశించిన స్థాయిలో జరగలేదని నెట్టింట రూమర్స్ వినిపిస్తున్నాయి. ఓటీటీ డీల్‌తో పాటు ఓవర్సీస్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ అంచనాలు అందుకోలేకపోయిందని కొందరు  కామెంట్స్ చేస్తున్నారు. ఈ రూమర్స్‌పై ది రాజాసాబ్ నిర్మాత టీజీ విశ్వప్రసాద్ స్పందించారు. తాజాగా ఆయన చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది మా అతిపెద్ద సినిమా అయిన ది రాజాసాబ్ అంతర్గత లెక్కల గురించి బయటికి చెప్పలేమని నిర్మాత వెల్లడించారు. మా సినిమాకు థియేటర్లలో రిలీజ్ తర్వాత వచ్చే లెక్కలను అఫీషియల్‌గా ప్రకటిస్తామని తెలిపారు. సినిమా రంగం అనేది దశలవారీగా మారుతూ ఉంటుందన్నారు.  ఈ రోజుల్లో నాన్–థియేట్రికల్ మార్కెట్‌లో సాధారణంగా  సర్దుబాట్లు జరుగుతుంటాయని అన్నారు. థియేటర్లలో మాత్రమే అసలైన నంబర్స్ వస్తాయని వెల్లడించారు. అయినప్పటికీ కూడా మా సినిమా ఈ రోజు  అత్యధిక నాన్–థియేట్రికల్ విలువను సాధించిందని విశ్వప్రసాద్ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ది రాజాసాబ్‌కు పోలికలు అనవసరమని రూమర్స్‌ను కొట్టిపారేశారు నిర్మాత.  కాగా.. ఈ చిత్రం జనవరి 9న థియేటర్లలో సందడి చేయనుంది.

## 'విధి నిన్ను ఇక్కడికి రప్పించింది'.. ఆసక్తిగా శంబాల ట్రైలర్



ఆది సాయి కుమార్ హీరోగా వస్తోన్న లేటెస్ట్ హారర్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. ఈ సినిమాకు యగంధర్ ముని దర్శకత్వం వహించారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజులు నిర్మించారు. ఇప్పటికే రిలీజైన సాంగ్స్‌కు ఆడియన్స్‌ను అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. రిలీజ్ తేదీ దగ్గర పడడంతో మూవీ ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు మేకర్స్. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'పంచభూతాల్ని శాసిస్తుందంటే ఇది సాధారణమైంది కాదు'.. అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ట్రైలర్ చూస్తుంటే ఓ గ్రామంలో జరిగిన మిస్టరీ సంఘటనలతో తెరకెక్కించినటులు తెలుస్తోంది. ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వసిక, మధునాదన్, రవివర్మ, మీసాల లక్ష్మణ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా క్రిస్మస్ కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతమందించారు.

# రోషన్ ఛాంపియన్ టీంకు సమంత సపోర్ట్

టాలీవుడ్ యాక్టర్ రోషన్ మేక లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం ఛాంపియన్. ప్రదీప్ అద్వైత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ కాన్సెప్ట్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాను డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన గిర గిర గింగిరాగానే సాంగ్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. తాజాగా మరో సాంగ్ అప్‌డేట్ అందించారు మేకర్స్. ఈ మూవీ నుంచి ఐయామ్ ఏ చాంపియన్ లిరికల్ వీడియో సాంగ్‌ను సాయంత్రం 5 గంటలకు స్టార్ హీరోయిన్ సమంత లాంచ్ చేయనుంది. ఇప్పటికే విడుదల చేసిన టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రానుందని.. రోషన్ ఇందులో ఫుట్‌బాల్ ఆటగాడిగా కనిపించబోతున్నాడని హింట్ ఇచ్చేశారు మేకర్స్. ఈ సినిమాలో మలయాళ యంగ్ బ్యూటీ అనస్వర రాజన్ హీరోయిన్‌గానటిస్తుంది.




# అల్లు అర్జున్ తెలుగు సినిమా హీరో అని తెలియదు..

## ఛాంపియన్ భామ స్టన్నింగ్ కామెంట్స్



టాలీవుడ్ యంగ్ హీరో రోషన్ కనకాల లేటెస్ట్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'ఛాంపియన్' డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో రోషన్ సరసన మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తుండగా ఆమెకు ఇదే తొలి తెలుగు సినిమా కావడం విశేషం. ఇప్పటికే ట్రైలర్, టీజర్ మంచి రెస్పాన్స్ తెచ్చుకోగా, తాజాగా అనస్వర చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అనస్వర రాజన్‌%% తాను చూసిన తొలి తెలుగు సినిమా బాలకృష్ణ నటించిన 'శ్రీరామరాజ్యం' అని చెప్పింది. అయితే ఆ సినిమా తెలుగులో తెరకెక్కిందన్న విషయం అప్పట్లో తనకు తెలియదని వెల్లడించింది. "మా నానమ్మ ఆ సినిమా చూస్తుండగా నేను చూశాను. కానీ అది తెలుగు సినిమా అని అప్పట్లో నాకు అర్థం కాలేదు" అని అనస్వర చెప్పింది. చిన్నప్పట్లో మలయాళంలో డబ్ అయిన అల్లు అర్జున్ సినిమాలు ఎక్కువగా చూసేదాన్నని, ఆ సమయంలో అల్లు అర్జున్ తెలుగు హీరో అని తనకు తెలియదని తెలిపింది. "అయన్ను మలయాళ హీరోనే అనుకున్నాను. ఆ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'మగధీర' సినిమా చూసినప్పుడే తెలుగు సినిమాలు, నటుల గురించి స్పష్టంగా తెలిసింది" అంటూ ఆమె చెప్పుకొచ్చింది. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొందరు నెటిజన్లు సరదాగా స్పందిస్తుండగా మరికొందరు మాత్రం అనస్వర నిజాయితీగా తన అనుభవాన్ని చెప్పిందని కామెంట్స్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే, 'ఛాంపియన్' సినిమాతో అనస్వర రాజన్ తెలుగులోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రంలో ఆమె 'చంద్రకళ' పాత్రలో కనిపించనుంది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాను జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ కలిసి నిర్మించాయి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చేతుల మీదుగా ఇటీవల ట్రైలర్ విడుదల కావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. డిసెంబర్ 25న విడుదల కానున్న ఈ సినిమాతో రోషన్, అనస్వర ఇద్దరికీ మంచి బ్రేక్ వస్తుందేమో చూడాలి.

# అంత ఎక్కువా.. నిగ్గు తేల్చాల్సిందే!



అసలు కంటే కొసరు మక్కువ అనేది నానుడి. ఒడిశా అటవీశాఖ అధికారులు చేసిన ఓ పని ఇలాగే ఉంది. అసలు కంటే కొసరు కోసం ఎక్కువ ఖర్చు చేసి వివాదంలో చిక్కుకున్నారు. డిపార్ట్‌మెంట్ అవసరాల కోసం 51 కార్లు కొన్నారు. మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే కార్లు కొన్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఈ కార్లకు అదనపు హంగుల కోసం వెచ్చించిన ధర దాదాపు వాహనాల రేటుకు దగ్గర ఉండడంతో వివాదం రాజుకుంది. అటవీశాఖ అధికారుల కొను గోల్‌మాల్ బయటపడడంతో విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అటవీ శాఖ 2024–25 ఆర్థిక సంవత్సరంలో మహీంద్రా కంపెనీకి చెందిన 51 థార్ ఎస్‌యూవీలను కొనుగోలు చేసింది. ఒక్కో కారుకు రూ.14 లక్షలు చొప్పున 7 కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేసింది. తమ విభాగం అవసరాలకు అనుగుణంగా ఈ కార్లలో మార్పులు చేయడానికి అదనంగా రూ. 5 కోట్లు ఖర్చు చేయడంతో సమస్య మొదలైంది. మొత్తం 51 వాహనాలకు అదనపు హంగులతో కలిపి రూ. 12.35 కోట్లు వ్యయం అయినట్టు అధికార పత్రాలు ధ్రువీకరించాయి. దీంతో తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

**నిగ్గు తేల్చాల్సిందే..**

బీజేడీ ఎమ్మెల్యే అరుణ్ కుమార్ సాహూ గత మార్చి నెలలో ఈ అంశాన్ని శాసనసభ సమావేశాల్లో లేవనెత్తారు. అటవీశాఖ కొనుగోలు చేసిన వాహనాలకు అయిన ఖర్చు వివరాలు ఇవ్వాలని కోరడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కార్లు కొనడానికి 7 కోట్ల రూపాయలు ఖర్చయితే, అదనపు హంగులకు ఏకంగా రూ. 5 కోట్లు వెచ్చించినట్టు తాజాగా వెల్లడైంది. దీంతో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా స్పందించారు. ప్రత్యేక ఆడిట్ నిర్వహించి, నిగ్గు తేల్చాలని అకౌంటెంట్ జనరల్ (ఏజీ)ని ఆదేశించారు. వాహనాల కొనుగోలు ప్రక్రియతో పాటు మార్పుల కోసం అయిన ఖర్చులను కూడా పరిశీలించాలని సూచించారు. అక్రమాలు జరిగినట్టు రుజువైతే కఠిన చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు.

**అనవసరంగా ఖర్చు చేస్తే సహించం**

వాహనాలకు అదనపు హంగుల కోసం పెట్టిన ఖర్చు సహేతుకమా, కాదా అనేది తేల్చేందుకే ప్రత్యేక ఆడిట్ చేయాలని ఆదేశించినట్టు మంత్రి గణేష్ రామ్ సింగ్ తెలిపారు. ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగినట్టు రుజువైతే కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. అటవీశాఖ అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో కొన్ని మార్పులు చేస్తుంటారని చెప్పారు. అడవుల్లో విధులు నిర్వహించేందుకు అనువుగా ఉండేలా వాహనాల్లో అదనపు లైట్లు, కెమెరాలు, సైరన్‌లు, ప్రత్యేక టైర్లు, ఇతర పరికరాలను అమర్చుతారని తెలిపారు. అయితే అధికంగా లేదా అనవసరంగా చేసే ఎలాంటి ఖర్చునైనా తాము సహించబోమని ఆయన స్పష్టం చేశారు.

**మార్పులు అవసరం**

తాము కొనుగోలు చేసిన వాహనాలకు అవసరానికి మించి ఖర్చు చేశామా, లేదా అనేది ఆడిటింగ్ తేలుతుందని అటవీ శాఖ అధికారులు అంటున్నారు. తమ శాఖ విధులకు అనుగుణంగా వాహనాలకు మార్పులు చేయడం అవసరమని వారు చెబుతున్నారు. ఫ్రంట్‌లైన్ సిబ్బంది పెట్రోలింగ్, దావానలం నియంత్రణ, వన్యప్రాణుల రక్షణ, కలప అక్రమ రవాణా నివారణ, పర్యాటకుల జంగిల్ సఫారీల కోసం ఈ వాహనాలను వినియోగిస్తామని చెప్పారు. సిమిలిపాల్ టైగర్ రిజర్వ్, సత్కోసియా టైగర్ రిజర్వ్, డెబ్రిఘర్ వన్యప్రాణుల అభయారణ్యం సహా ఇతర ముఖ్యమైన వన్యప్రాణి సంరక్షణ ప్రాంతాల్లో విధులకు ఈ కస్టమైజ్డ్ ఎస్‌యూవీలను వినియోగిస్తున్నట్టు తెలిపారు.

# ఆశ్చర్యపరిచే నిర్ణయాలు!



కేంద్రంలోని నరేంద్ర మోదీ 3.ఓ ప్రభుత్వం మరోసారి ఆశ్చర్యపరిచే నిర్ణయాలు తీసుకోబోతోంది. యువతను ప్రోత్సహించేలా కీలక నిర్ణయాలు తీసుకునేందుకు రెడీ అవుతోంది. యువ నాయకత్వంపై మోదీ సర్కారు ఫోకస్ పెంచింది. ప్రభుత్వంలో వారికి పెద్దపీట వేయడానికి సిద్ధమవుతోంది. కేంద్ర కేబినెట్‌లో యువ నేతలకు మరిన్ని కొలువులు కట్టబెట్టడానికి కసరత్తు చేస్తోంది. మోదీ 3.ఓ కేబినెట్‌లో యువతరానికి త్వరలో తగిన ప్రాధాన్యం దక్కబోతోంది. దీనికి కొంత సమయం పడుతుందని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయడంతో కమలనాథులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నిల్లోనూ ఇదే జోరు చూపించాలన్న పట్టుదలతో ఉన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని కార్యాచరణలోకి దిగిపోయారు. వచ్చే ఏడాది మార్చి– ఏప్రిల్ మధ్యలో జరగను న్న బెంగాల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారు. దీదీని నాలుగోసారి సీఎం కాకుండా అడ్డుకోవాలని గట్టిగానే ప్రయ త్నిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ అగ్రనేతలు బెంగాల్ పర్యటనలు చేస్తూ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా బెంగాల్‌లో సభలు నిర్వహిస్తూ మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు.

**ఆశ్చర్యపరిచే నిర్ణయాలు**

పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు ముగిసిన తర్వాత మోదీ సర్కారు ఆశ్చర్యకర నిర్ణయాలు తీసుకోబోతోందని సమాచా రం. కేంద్ర కేబినెట్ విస్తరణతో పాటు మరిన్ని కీలక నిర్ణయాలు ఉంటాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించినట్టు ‘ది సండే గార్డియన్స్ నివేదించింది. బిహార్ ఎన్నికల ఫలితాల తర్వాత 45 ఏళ్ల నితిన్ నబీన్‌ను జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించి అందరినీ బీజేపీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. అదే విధంగా బెంగాల్ ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా ఎవరూ ఊహించని నిర్ణయాలు ఉంటాయని తెలుస్తోంది.

**యువతకు పెద్దపీట**

పార్టీ దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని యువ నాయకత్వానికి కేంద్ర కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమాచారం. ఒకవేళ బెంగాల్‌లో తమకు అనుకూలంగా ఫలితాలు వస్తే ఆ రాష్ట్రం నుంచి మరికొంత మందికి కేబినెట్ బెర్తులు దక్కే చాన్స్ ఉంది. ప్రస్తుతం కేంద్ర కేబినెట్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు సహాయ మంత్రులు ఉన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అద్భుతమైన పనితీరు కనబరిస్తే.. ఇద్దరు పూర్తిస్థాయి కేంద్ర మంత్రులను నియమించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమచారం.

**పనితీరే గీటురాయి**

జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్‌ను ఎంపిక చేయడానికి ఎలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారో దాదాపు వాటినే కొత్త మంత్రుల ఎంపికలో పాటిస్తారని తెలుస్తోంది. ఎటువంటి వివాదాలు లేకుండా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయడంతో పాటు ఎక్కువ కాలం బాధ్యతలు చేపట్టగల యువ నాయకులకు అవకాశం ఇస్తారని సమాచారం. పార్టీకి ఎక్కువ కాలం పాటు బాధ్యతలు చేపట్టగల సామర్థ్యంతో పాటు, స్థిరమైన సంస్థాగత పనితీరుతో మంచి ఫలితాలు రాబట్టగలిగే యువ నేతలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. సామాజిక, ప్రాంతీయ సమతుల్యత పాటిస్తూనే.. ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలకు సరైన ప్రాతినిధ్యం దక్కేలా ఎంపికలు ఉంటాయని సమాచారం.

**కేబినెట్‌లో 10 ఖాళీలు!**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంత్రివర్గంలో 72 మంది మంత్రులు ఉన్నారు. పార్లమెంటరీ నిబంధనల ప్రకారం గరిష్టంగా 81 మందిని మంత్రులుగా నియమించే అవకాశం ఉంది. ఈ లెక్కన చూస్తే ప్రస్తుత కేబినెట్‌లో 9 ఖాళీలు ఉన్నాయి. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి బీజేపీ ఇటీవల ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. మంత్రి పదవికి ఆయన రాజీనామా చేయనున్నారు. దీంతో కేబినెట్‌లో ఖాళీల సంఖ్య 10కి చేరుతుంది. ప్రధానిగా తన రెండవ హయాంలో 78 మంత్రులకు కేబినెట్‌లో చోటు కల్పించారు. దీని ప్రకారం చూసుకున్నా ప్రస్తుత మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉన్నాయి. కేబినెట్ విస్తరణలో ఈ ఖాళీలను భర్తీ చేసే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు అంటున్నాయి. చూడాలి బెంగాల్ ఎన్నికలు ఎవరిని అందలం ఎక్కిస్తాయో!

## బంగ్లాదేశ్‌లో హింస..

## ఆందోళన వ్యక్తం చేసిన ఐక్యరాజ్యసమితి

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో చోటుచేసుకుంటున్న హింస పట్ల యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియా గుటెర్రస్ ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ వ్యక్తిని కొట్టి చంపిన ఘటన పట్ల ఆయన రియాక్ట్ అయ్యారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు ఆందోళన కలిగిస్తున్న విషయం వాస్తవమే అని యూఎన్ సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ తెలిపారు. ప్రెస్ మీట్‌లో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయన్న అంశంపై స్పందన కోరగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ అయినా మరే ఇతర దేశమైనా, మెజార్టీకి చెందని ప్రజలు సురక్షితంగా ఉండాలని, బంగ్లాదేశీయులందరూ సేఫ్‌గా ఉండాలని, దేశంలోని ప్రతి పౌరుడు సురక్షితంగా ఉండేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని విశ్వాసంతో ఉన్నట్లు దుజారిక్ తెలిపారు. బంగ్లాదేశ్‌లోని అనేక మీడియా సంస్థలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మీడియా సంస్థలను టార్గెట్ చేయడంలో తమ జీవన హక్కు ప్రమాదంలో పడినట్లు బంగ్లా జర్నలిస్టులు ఆరోపించారు. బంగ్లా మీడియా ప్రస్తుతం దీన అవస్థలో ఉన్నదని, భావస్వేచ్ఛను హరించారని జర్నలిస్టులు పేర్కొన్నారు. ఢాకాలో ఉన్న ప్రోతమ్ ఆలో, ద డెయిలీ స్టార్ వార్తాపత్రికల ఆఫీసులకు నిప్పు పెట్టిన ఘటన నేపథ్యంలో పలువురు ఎడిటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆఫీసులకు నిప్పుపెట్టిన సమయంలో చాలా మంది జర్నలిస్టులు లోపలే చిక్కుకుపోయారని, పోలీసులు.. ఫైర్ సర్వీసులను రాకుండా అడ్డుకున్నారని ఎడిటర్లు ఆరోపించారు. భావస్వేచ్ఛ ఇప్పుడో సమస్య కాదు అని, అసలు బ్రతికి ఉండడమే ఇప్పుడు సమస్యగా మారినట్లు డెయిలీ స్టార్ ఎడిటర్ మహఫూజ్ ఆనమ్ తెలిపారు.

## భారత్ ‘మెగా రోడ్డు’తో డ్రాగన్‌కు చుక్కలే..



**న్యూఢిల్లీ:** తరచూ దుందుడుకు చర్యలకు పాల్పడే చైనాకు భారత్ అడ్డుకట్ట వేస్తోంది. చైనా సరిహద్దు వెంబడి భారత్ మరో భారీ వ్యూహాత్మక అడుగు వేసింది. ఉత్తరాఖండ్‌లోని నీలపాణి నుండి ములింగ్ లా వరకు 16,134 అడుగుల అత్యంత ఎత్తైన ప్రాంతంలో 32 కిలోమీటర్ల మేర నిర్మితమవుతున్న‘మెగా రోడ్డు’ పనులను భారత్ ముమ్మరం చేసింది. అన్ని వాతావరణాలను తట్టుకునేలాంటి రహదారి నిర్మాణాన్ని చేపట్టింది. రూ. 104 కోట్ల వ్యయంతో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) చేపడుతున్న ఈ ప్రాజెక్టు, వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసీ)వద్ద భారత సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచనున్నది. ప్రస్తుతం ములింగ్ లా బేస్ క్యాంపు చేరుకోవాలంటే సైనికులు ఐదు రోజుల పాటు కఠినమైన కొండ మార్గాల్లో ట్రెక్కింగ్ చేయాల్సి వస్తున్నది. శీతాకాలంలో భారీ హిమపాతం కారణంగా ఈ మార్గం పూర్తిగా మూసుకుపోతుంటుంది. దీంతో కేవలం హెలికాప్టర్ల ద్వారానే ప్రయాణం చేయాల్సి వస్తుంది. అయితే ఈ నూతన రహదారి పూర్తయితే, ఐదు రోజుల ప్రయాణం కేవలం కొద్ది గంటల్లోనే ముగియనుంది. తద్వారా దళాల మోహరింపు, రేషన్, ఇంధనం, యుద్ధ సామగ్రిని ఏడాది పొడవునా ఎటువంటి ఆటంకం లేకుండా నేరుగా సరిహద్దుకు చేరవేసే అవకాశం కలుగుతుంది. ఒకప్పుడు సరిహద్దుల్లో రహదారులు నిర్మిస్తే చైనా చొరబడుతుందని భారత్ భావించింది. ఇప్పుడు ఈ సిద్ధాంతాన్ని పక్కనపెట్టి,‘కనెక్టివిటీయే బలం’ అనే దిశగా అడుగులు వేస్తోంది. టిబెట్ ప్రాంతంలో చైనా ఇప్పటికే భారీగా రోడ్డు, రైలు నెట్‌వర్క్‌ను నిర్మించింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా తన మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేస్తోంది. 2020 తూర్పు లడఖ్ ప్రతిష్టంభన తర్వాత, సరిహద్దుల్లోని చివరి మైలు వరకు సైనిక కనెక్టివిటీని పెంచడమే లక్ష్యంగా మెగా రోడ్డు పనులు జరుగుతున్నాయి. హిమాలయాల్లోని అత్యంత కఠినమైన భూభాగంలో సాగుతున్న ఈ రోడ్డు నిర్మాణం ఇంజనీరింగ్ పరంగా పెద్ద సవాలుతో కూడుకున్నది. ఈ రహదారి పూర్తయితే వాయు సేనపై ఆధారపడే అవసరం తగ్గి, రక్షణ వ్యయం గణనీయంగా ఆదా కానుంది. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలు పటిష్టంగా ఉంటేనే, వేగవంతమైన ప్రతిస్పందన సాధ్యమని భారత్ భావిస్తోంది. తద్వారా సరిహద్దు ప్రాంతాలు మరింత సుస్థిరంగా ఉంటాయని రక్షణ నిపుణులు అంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో చైనా చొరబాట్లకు భారత్ సమర్థవంతంగా అడ్డుకట్ట వేయగలదని చెబుతున్నారు.

## చైనా, పాక్‌ల నుంచి ముప్పు..

## భారత్ సిద్ధంగా ఉండాలి



అణు దేశాలైన చైనా పాకిస్థాన్‌ల నుంచి ముప్పు పొంచి ఉన్నదని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయని గుర్తుచేశారు. స్వల్పకాలిక, సుదీర్ఘ యుద్ధాలకు భారత్ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఐఐటీ బాంబేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన ఇద్దరు ప్రత్యర్థులు అణుసామర్థ్యం కలిగి ఉన్నారని, ఆ దేశాల నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉండాలని సీడీఎస్ అన్నారు. గతంలో నిర్వహించిన ఆపరేషన్ల మాదిరిగానే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి స్వల్ప, దీర్ఘకాలిక ఘర్షణలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఇప్పటికే కొనసాగుతోన్న సరిహద్దు వివాదాల కారణంగా భూతల ఘర్షణల్లో పోరాడేందుకు రెడీగా ఉండాలన్నారు. కృత్రిమ మేథ, క్వాంటమ్ కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్, ఎడ్జ్ కంప్యూటింగ్ పోరాట తీరును మారుస్తున్నాయని చెప్పారు.

## శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్-2

## మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం



కొత్త తరం అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్–6ను మోసుకెళ్లే ఎల్‌వీఎం3–ఎం6 రాకెట్ ప్రయోగానికి 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో ప్రారంభమైనట్లు ఇస్రో ప్రకటించింది. బ్లూబర్డ్ బ్లాక్–2 మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని, రేపు ఉదయం 8.54 గంటలకు రాకెట్ నింగిలోకి ఎగరనున్నట్లు వెల్లడించింది. ఈ ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు ఉంటుంది. స్పేస్‌పోర్ట్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఎల్‌వీఎం3–ఎం6 వ్యోమనౌకను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్–2 మిషన్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా నేరుగా 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, మెసేజ్‌లు, వీడియో ప్రసారాలు చేసేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. వాణిజ్య, ప్రభుత్వ అప్లికేషన్లకు సపోర్ట్ చేసేలా దీనిని రూపొందించారు.

## ఇండోపాక్ న్యూక్లియర్ వార్ ఆపాను

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్లీ ఆ విషయాన్నే స్పష్టం చేశారు. ఇండియా, పాకిస్థాన్ మధ్య సంక్షోభాన్ని పరిష్కరించినట్లు చెప్పారు. లక్షల సంఖ్యలో ప్రజల జీవితాలను కాపాడారని, పాక్ సర్కారు తనను మెచ్చుకున్నట్లు కూడా ఆయన తెలిపారు. భారత్, పాక్ మధ్య అణ్వాయుధ యుద్ధాన్ని నిలువరించామని, పాకిస్థాన్ అధినేత, గౌరవప్రదమైన జనరల్, ఫీల్డ్ మార్షల్‌తో పాటు ఆ దేశ ప్రధాని కూడా తన మధ్యవర్తిత్వాన్ని మెచ్చుకున్నట్లు చెప్పారు. ప్రెసిడెంట్ ట్రంప్ సుమారు కోటి మంది లేదా అంత కన్నా ఎక్కువ మంది ప్రాణాలు కాపాడినట్లు పాకిస్థాన్ ప్రశంసించి నట్లు ఆయన పేర్కొన్నారు. ఫ్లోరిడాలోని మార్–ఏ–లాగో ఎస్టేట్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడు తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. డిఫెన్స్ సెక్రటరీ ఈట్ హెగ్‌సేథ్, నేవీ మంత్రి జాన్ పెలాన్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మీకు తెలుసు కదా 8 విమానాలను కూల్చేశారని, ఆ యుద్ధం మళ్లీ ఉగ్రంగా మారే సమయంలో, ప్రెసిడెంట్ ట్రంప్ కోటి మంది ప్రాణాలను కాపాడారని అన్నారని, అన్ని యుద్ధాలను పరిష్కరించామని, కానీ ఒకే ఒక్క యుద్ధం పరిష్కరించ లేదని, ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని తాను ఆపలేకపోయినట్లు ట్రంప్ తెలిపారు. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7వ తేదీన ఆపరేషన్ సింధూర్ చేపట్టగా, ఇండియా.. పాక్ మధ్య సంధి కుదిరినట్లు మే 10వ తేదీన ట్రంప్ ప్రకటించారు. వాషింగ్టన్‌లో రాత్రంతా జరిగిన చర్చల తర్వాత పూర్తి స్థాయిలో కాల్పుల విరమణ కుదిరినట్లు ట్రంప్ తన సోషల్ మీడియాలో వెల్లడించారు. అయితే ఆ నాటి నుంచి ఇప్పటి వరకు కనీసం 60 కన్నా ఎక్కువ సార్లు ఇండియా, పాక్ యుద్ధాన్ని ఆపినట్లు ఆయన చెబుతూనే ఉన్నారు. ఇండోపాక్ ఉద్రిక్తతలను తగ్గించినట్లు చెప్పారు. కానీ భారత ప్రభుత్వం మాత్రం మూడవ దేశ జోక్యాన్ని ఖండించింది. రెండు దేశాలు ఓ ఒప్పందం ప్రకారం సంయుక్తంగా మే 10వ తేదీన యుద్ధాన్ని ఆపేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

**ఏవోబీ సరిహద్దులో లొంగిపోయిన 22 మంది మావోలు**

**లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు**

**లొంగిపోయిన మావోయిస్టులపై రూ.2.18 కోట్ల రివార్డు**

ఆంధ్ర–ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాలో 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన మవోయిస్టులు పోలీసులకు ఆయుధాలను అప్పగించారు. వీటిలో ఒక ఏకే–47, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, మూడు 303 రైఫిళ్లు, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, అలాగే 14 ల్యాండ్‌మైన్‌లు ఉన్నాయి. పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ 22 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.18 కోట్ల రివార్డు ఉంది. తాజా లొంగుబాటు ఏఓబీ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు భారీ ఎదురుదెబ్బ అని పోలీసు అధికారులు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్ట వంటి ప్రత్యేక దాడులను ముమ్మరం చేశాయి.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137